

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
నిజామాబాద్
: fb.com/vaartha Digital


Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-4-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 81 పేజీలు: 10+4 వెల: 6.50


**మణిపూర్‌లో మళ్లీ హింస.. భారీగా నిరసన ర్యాలీలు**

**మోయెర్స్ గురుద్వారాలో రెండు సిక్కువర్గాల ఘర్షణ**

5



## చర్చలకు ట్రంప్!

వర్చువల్‌గానైనా పాల్గొంటారని రిపబ్లికన్‌నేతల వెల్లడి

2



## మోడీ ఉగ్రవాది

కాదు, అలా అనలేదు!

చెన్నైలో వ్యాఖ్యలు చేసిన ఖర్గే

5

# బస్సులు బంద్

**ప్రభుత్వంతో ఆర్టీసీ జెఎసి చర్చలు విఫలం**

**డిమాండ్ల పరిష్కారంలో జాప్యంపై ఆగ్రహం**

**అర్ధరాత్రి నుంచే సమ్మెబాట పట్టిన సిబ్బంది**

**మరో సకల జనుల సమ్మెగా మారుతుంది: జెఎసి**






మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో ఆర్టీసీ జెఏసీ నాయకులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్21:** తెలంగాణలో ఆర్టీసి సమ్మెబాట పట్టనుంది. మంగళవారం సాయంత్రం ప్రభుత్వంతో టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ చర్చలు జరిపింది. సచివాలయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీతో దాదాపు 4 గంటలకుపైగా ఆర్టీసీ సంఘాలు చర్చలు జరిపాయి. అయితే, ఈ చర్చలు విఫలం కావడంతో అర్ధరాత్రి నుంచే టీజీఎస్ ఆర్టీసి సమ్మెకు వెళ్లింది. దీంతో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. ఈక్రమంలో ప్రజా రవాణా స్తంభించే అవకాశం ఉంది. చర్చలు విఫలమైన నేపథ్యంలో మొదటి షిఫ్ట్ నుంచే సమ్మెలోకి వెళుతున్నట్టు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, రెండో వేతనసవరణ అమలు చేయాలని, విశ్రాంత ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలనే డిమాండ్లతో కార్మికలోకం పూర్తిగా సమ్మెలోకి వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో తమ 32 ప్రధాన డిమాండ్లపై స్పష్టమైన హామీ లభించలేదదని కార్మిక నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం హుటాహుటిన ఒక ఉన్నత స్థాయి అధికారుల కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ అది కేవలం >>2




**ప్రపంచంలో అత్యంత వేడి ప్రాంతాల్లో ఆదిలాబాద్, హైదరాబాద్**

**అడవుల విస్తీర్ణత తగ్గడమే కారణం**

**కొత్తగూడెం, గద్వాల, నిర్మల్, నిజామాబాద్‌లలో అత్యధిక ఉష్ణోగ్రతలు**

## ఉడుకు.. ఉడుకు తెలంగాణం



**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు తెలంగాణలో పలు పట్టణాలు ప్రపంచ వేడి నగరాల జాబితాలో చేరుతున్నాయి. నగరం మూసీ నది పరీవాహక ప్రాంతం కావడం, వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, భూగర్భ జలాలు పడిపోవడంవల్ల హైదరాబాద్‌లో వేసవి తీవ్రత అసాధారణ స్థాయిలో పెరిగిపోతోంది. ప్రస్తుత వేసవిలో నగరంలోని న్యూ నాగోల్ ప్రాంతంలో 41.7 డిగ్రీల సెల్సియస్ నమోదవుతుండగా ముషీరాబాద్‌లో 41.6, అంబర్‌పేటలో 41.4, మల్కాజిగిరి, ఎల్బీనగర్ ప్రాంతాల్లో 41.3, మెహదీపట్నంలో 41.1 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అమెరికాకు చెందిన ప్రముఖ వాతావరణ సంస్థ ఎల్డోరాడో వెదర్ తాజాగా ప్రపంచంలోని 100 అత్యంత వేడి నగరాల జాబితాను రూపొందించగా ఆ జాబితాలోకి తెలంగాణలోని ఆదిలాబాద్‌తోపాటు హైదరాబాద్ కూడా ఎక్కింది. ప్రస్తుత వేసవిలో తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు జనం అల్లాడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా అయితే ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా నిలిచింది. ప్రపంచ వేడి ప్రాంతాల జాబితాలో ఆదిలాబాద్ 14వ స్థానంలో నిలిచింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాలలో 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఇక.. ఎల్డోరాడో వెదర్ జాబితాలో మహారాష్ట్రలోని అకోలా 45 డిగ్రీలతో అగ్రస్థానంలో ఉంది. >>2

**కెసిఆర్ చెప్పారనే**

# ఢిల్లీ వెళ్లా

**కేసులపై లాయర్లతో చర్చించాం**

**బిఆర్ఎస్ పోరాడితేనే రైతుబంధు వేస్తారా?: హరీష్‌రావు**



మంగళవారం మీడియాతో హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 21:** తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తాను ఢిల్లీకి వెళ్లానని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆయన చెప్పిన పని కోసమే తాను, వినోద్ కుమార్ తదితరులం వెళ్లామని చెప్పారు. ముఖ్యమంత్రి పెట్టే అక్రమ కేసులను ఎదుర్కోవడానికి, కాళేశ్వరం కేసులపై ఢిల్లీకి వెళ్లి లాయర్లతో చర్చించినట్లు చెప్పారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తన ఢిల్లీ పర్యటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎంవో నుంచి లీకులు ఇచ్చారని, మీడియా వాళ్లతో అర్థం లేని బ్రేకింగ్‌లు పెట్టించారని ఆరోపించారు. విషయం ఉన్న >>2

# బదలీలపై నిషేధం ఎత్తివేత

**మూడేళ్లు పూర్తి చేసిన ఉద్యోగులకు అర్హత**

**మే 1 నుండి 31 వరకూ దరఖాస్తుల స్వీకరణ**

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలపై నిషేధాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎత్తివేసింది. దీంతో ఉద్యోగుల సాధారణ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లయింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మంగళవారం ఉత్తర్వులను విడుదల చేశారు. దీని ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ మే నెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు కొనసాగుతుంది. ఒకే ప్రదేశంలో కనీసం మూడు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. బదిలీ ఆర్డర్ వచ్చిన తర్వాత మూడు రోజుల్లో సంబంధిత ఉద్యోగి రిలీవ్ అవ్వాలి. ఇక ఈ ఏడాది జనవరి 1 నాటికి ఒకే స్థలంలో 3 సంవత్సరాలు పూర్తి చేసిన వారు మాత్రమే బదిలీలకు అర్హులు. ఇదే సమయంలో ఒకే చోట 4 సంవత్సరాల కంటే ఎక్కువ కొనసాగడాన్ని కూడా అనుమతించరు. ఈ బదిలీల్లో ప్రధానంగా భార్యాభర్తలు, రిటైర్మెంట్ దగ్గర ఉన్న ఉద్యోగులు, 70 శాతానికి పైగా అంగవైకల్యం కలిగిన వికలాంగులు, క్యాన్సర్, కిడ్నీ తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలున్న వారు, మానసిక సమస్యలున్న పిల్లల తల్లిదండ్రులకు ప్రాధాన్యత ఇస్తారు. అలాగే ఒక క్యాడర్‌లో గరిష్టంగా 40 శాతం వరకు మాత్రమే బదిలీలు చేయాల్సి ఉంటుంది. 2027 మే 31లోపు రిటైర్ అయ్యేవారిని, వారి అభ్యర్థన ఉన్నప్పుడే బదిలీ చేస్తారు. తమదరఖాస్తుల్లో ఉద్యోగులు 5 ప్రాధాన్య స్థానాలు ఇవ్వవచ్చు. ఈ మొత్తం ప్రక్రియను కఠినమైన నిబంధనలకు కట్టుబడి, పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనికి సంబంధిత విభాగాలు త్వరలో వివరణాత్మక మార్గదర్శకాలను విడుదల చేయనున్నాయి. కాగా పోస్టింగ్‌లు మారడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్న వేలాది మంది ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో ఉపశమనాన్ని కలిగించింది. బదిలీల ప్రక్రియ నెల మొత్తం కొనసాగనున్నందున, రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఉద్యోగులు తమ బదిలీ అయిన స్థానాల్లో చేరతారని భావిస్తున్నారు. ప్రస్తుతం అప్రాధాన్యత పోస్టుల్లో ఉన్న ఉద్యోగులను ప్రాధాన్యత స్థానాల్లోకి బదిలీ చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో వెల్లడించింది. కఠినమైన ప్రాంతాల్లో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న వారికి కూడా బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు. స్పౌజ్ కేటగిరీలో మూడేళ్ల ఏళ్ల నిబంధన వర్తించదు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఉద్యోగుల ఆప్షన్లను స్వీకరించి బదిలీలు చేయనున్నారు. విద్యాశాఖ, పోలీస్, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, రవాణ, అటవీ శాఖలువిడిగా ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేస్తాయి. మే 1 నుంచి 7 వరకు ఉద్యోగ సంఘాలతో చర్చించి ఖాళీలు, కచ్చితంగా బదిలీ చేయాల్సిన ఉద్యోగుల వివరాలను వెల్లడిస్తారు. మే 8 నుంచి 15 వరకు ఉద్యోగుల నుంచి ఆప్షన్ల స్వీకరిస్తారు. ఉద్యోగి గరిష్టంగా 5 ప్రాంతాలను ఆప్షన్లుగా ఎంచుకోవచ్చు. మే 16 నుంచి 24 వరకు ఉద్యోగుల బదిలీల దరఖాస్తుల పరిశీలించి 25 నుంచి 31 వరకు ఉద్యోగుల బదిలీల ఉత్తర్వుల జారీ చేస్తారు. జూన్ 1 నుంచి ఉద్యోగుల సాధారణ బదిలీలపై మళ్లీ >>2



**కాళేశ్వరం కమిషన్‌పై నేడు**

# హైకోర్టు తీర్పు

**కమిషన్ ఏర్పాటును హైకోర్టులో సవాల్ చేసిన కెసిఆర్, హారీష్‌రావు**

**ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలపై ప్రభావం చూపనున్న తీర్పు**

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పిసి. ఘోష్ నేతృత్వంలో నియమించిన కాళేశ్వరం కమిషన్ నివేదికపై బుధవారం హైకోర్ట్ కీలక తీర్పు వెలువరించనుంది. ఈ తీర్పు కోసం రాష్ట్ర అధికార యంత్రాంగంతో పాటు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకల ఆరోపణలపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం జస్టిస్ పిసి. ఘోష్ నేతృత్వంలో >>2




నల్గొండలో మీడియాతో ఎస్పీ శరత్ చంద్ర పవార్

## నకిలీ కెవైసితో 2 కోట్లుపైగా లూటీ

**నల్లగొండ జిల్లా దేవరకొండలో బ్యాంకు డిపాజిటర్లు గగ్గోలు**

**నలుగురు నిందితుల అరెస్టు**

**నల్లగొండ ప్రతినిధి, ప్రభాతవార్త ఏప్రిల్ 21:** నకిలీ కేవైసితో బ్యాంకు ఖాతాదారుల డబ్బులు కాజేసిన ముఠాను దేవరకొండ పోలీసులు అరెస్టు చేసి వారివద్ద నుంచి రెండు కోట్ల నలబై రెండు లక్ష పదివేల రూపాయల నగదు, 6 మొబైల్ ఫోన్లు, 1 ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కేంద్రంలో మంగళవారం ఎస్పీ శరత్ చంద్ర పవార్ మీడియా సమావేశములో వివరాలు వెల్లడించారు. దేవరకొండ ఎస్‌బిఐ అగ్రికల్చరల్ కమర్షియల్ బ్రాంచిలో కాంట్రాక్ట్‌పద్దతిలో హౌస్ కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న లెండల చక్రపాణి తనకున్న సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంక్ సిబ్బందికి కంప్యూటర్ పనుల్లో సహాయం >>2






పశ్చిమ త్రిపురలోని మోహన్‌పూర్‌లో సౌందర్య చిన్మయి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

## కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలం : ఆర్టీసీ ఎండి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్21:** ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం అత్యంత సానుకూలంగా స్పందించిందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి) వై. నాగిరెడ్డి తెలిపారు. కార్మికుల డిమాండ్లపై సమగ్రంగా చర్చించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఐఏఎస్ అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ మంగళవారం కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై చర్చలు జరిపిందని ఆయన వివరించారు. కార్మికులు కోరుతున్న డిమాండ్లలో కొన్ని ఆర్థికపరమైనవి మరియు సంక్లిష్టమైన అంశాలు ఉన్నందున, వాటిని లోతుగా పరిశీలించి పరిష్కరించడానికి ప్రభుత్వానికి కనీసం నాలుగు వారాల సమయం పడుతుందని, ఈ మేరకు ప్రభుత్వం గడువు కోరినట్లు నాగిరెడ్డి పేర్కొన్నారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆర్టీసీపైనే ఆధారపడి ప్రయాణించే దినసరి కూలీలు, చిరు ఉద్యోగులు మరియు సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని, అందరూ బాధ్యతాయుతంగా విధుల్లో పాల్గొనాలని ఎండి నాగిరెడ్డి కోరారు.

## 27న తెలంగాణ భవన్‌లో కెసిఆర్ ప్రత్యేక సమావేశం: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 21:** ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సంబురాల ముగింపు సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, పార్టీ సభ్యత్వాల పునరుద్ధరణ తదితర రాజకీయ అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని రీఆర్గనైజ్ చేసే దిశగా కెసిఆర్ నిర్ణయం తీసుకున్నట్లు సామాచారం. ఈ సమావేశానికి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జెడ్పీ మాజీ చైర్మన్లను ఆహ్వానించారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, భవిష్యత్ పోరాటాల కోసం శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

# నేడు హైకోర్టు తీర్పు

>> కమిషన్‌ను ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు తన తీర్పును వెలువరించనుంది.

గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ పి.సి.ఘోష్ నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే ఈ కమిషన్ ఏర్పాటు ప్రక్రియ, దాని పరిధిని సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. కమిషన్ ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు పాటించలేదని, కమిషన్ ఏర్పాటు చట్టబద్ధం కాదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదించారు. ఉద్దేశపూర్వకంగానే రాజకీయ కక్షసాధింపులో భాగంగా ఈ కమిషన్‌ను ఏర్పాటు చేశారని, కమిషన్‌ను రద్దు చేయాలని కోర్టును అభ్యర్థించారు. అయితే కేసు విచారణ దశలో ఉండగానే కమిషన్ నివేదిక ఆధారంగా ఎటువంటి నిర్ణయాలు తీసుకోకూడదని, ఎలాంటి చర్యలు చేపట్టొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు గతంలోనే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం వెలువడన్ను తీర్పు ఈ కేసులో అత్యంత కీలకం కానుంది.

తీర్పు ప్రభావం రాష్ట్ర రాజకీయాల్లో ఎటువంటి మలుపులకు దారితీస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఒకవేళ హైకోర్టు తీర్పు.. ఘోష్ కమిషన్ ఏర్పాటును సమర్థిస్తే ఆ కమిషన్ ఇప్పటికే సమర్పించిన నివేదిక ఆధారంగా కాళేశ్వరంపై తదుపరి చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమయ్యే అవకాశం ఉంది. ఒకవేళ హైకోర్టు.. కమిషన్ ఏర్పాటును తప్పుబట్టినా లేదా నిబంధనల ప్రకారం లేదని పేర్కొన్నా, అది రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బగా మారనుంది. అదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, రాష్ట్ర సాగునీటిపారుదలరంగానికి సంబంధించిన పరిణామాలపై ఈ తీర్పు ప్రభావం చూపనుంది.

## అమెరికా ట్యారిఫ్ రిఫండ్‌లతో భారత్‌కు 12 బిలియన్ డాలర్లు రాక!

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 21:** అమెరికా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అక్కడి ట్రంప్ ప్రభుత్వం అమలుచేసే సుంకాల తిరిగి చెల్లింపులో భారత్‌కు సైతం భారీ మొత్తం అందే అవకాశాలున్నాయి. మొత్తం 166 బిలియన్ డాలర్లు సుంకాలుగా చెల్లించామని పలు కంపెనీల ప్రతినిధులు అమెరికా సుప్రీంకోర్టులో దావావేయడం వాటిని విచారించినసుప్రీం ట్యారిఫ్ తిరిగి చెల్లించాల్సిందేనని తీర్పు చెప్పడం తెలిసిందే. ఈక్రమంలో మొత్తం చెల్లింపుల్లో భారత్‌కు 10 నుంచి 12 బిలియన్ డాలర్లు అందనున్నాయని గ్లోబల్‌ట్రేడ్ రీసెర్చి కార్యాచరణ సంస్థ ఎవల్లడించింది. ఈనెల 20వ తేదీనుంచే రీఫండ్‌ప్రక్రియ ప్రారంభించారు. డొనాల్డ్‌ట్రంప్ వాణిజ్య అజెండాలోభాగంగానే ఎగుమతులపై ట్రంప్ సుంకాలువ ఇధించినసంగతి తెలిసిందే. ఒకదశలో 50శాతం సుంకాలు కూడా విధిస్తున్నట్లుప్రకటించారు.

ఇపుడు అత్యధికశాతం సుంకాలు రీఫండ్ వస్తాయని అంచనా. అమెరికా కస్టమ్స్ సరిహద్దు రక్షణ విభాగం సమిష్టిపాలన ప్రాసెసింగ్ ఎంట్రిస్ సిస్టమ్ కేప్ ఆధారంగా ఈరీఫండ్‌లు జరుగుతాయి. మొదటిదశలో దిగుమతి నివేదికలు కస్టమ్స్ సమీక్ష తర్వాత నిలిచినవాటికి ఇస్తారు. గడచిన 80 రోజుల్లోపు క్లియర్ అయినవాటికి రీఫండ్ వెళుతుంది. దశలవారీగా వీటిని అందించనున్నట్లు తేలింది. మొదటిదశలో 127 బిలియన్ రీఫండ్‌లు ఉంటాయని కూడా అంచనావేస్తున్నారు. 3.30 లక్షలమంది దిగుమతి దాడులు 53 మిలియన్ల ఎంట్రీలు దాఖలుచేసారని, వాటిని ఆమోదించిన తర్వాత కూడా రీఫండ్‌లు 60 నుంచి 90 రోజులుపడుతుందని కేప్ అధికారులు చెపుతున్నారు.

# ఉడుకు.. ఉడుకు తెలంగాణం

>> అదే సమయంలో రాష్ట్రంలోని కొత్తగూడెం, గద్వాలలో 43.3నిర్మల్, నిజామాబాద్ ప్రాంతాల్లో 43.0 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవు తుండడంతో ఆ ప్రాంతాలు కూడా రికార్డుల కెక్కుతున్నాయి. ఆదిలాబాద్ ప్రాంతంలో ఎండలు ఇంత తీవ్రంగా ఉండటానికి భౌగోళిక కారణాలతో పాటు అటవీ విస్తీర్ణం తగ్గడమే ప్రధాన కారణమని వాతావరణశాఖ (ఐఎండీ) శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు.

మహారాష్ట్రలోని విదర్భ సరిహద్దులో ఉండటం వల్ల మధ్య భారతం నుంచి వీచే పొడి, వేడి గాలులు ఇక్కడ ఉష్ణోగ్రతలను ఆసాధారణంగా పెంచుతున్నాయి.దీనికి తోడు2021లో 18,561 చదరపు కిలోమీటర్లుగా ఉన్న తెలంగాణ అటవీ విస్తీర్ణం 2023 నాటికి 18,456 చదరపు కిలోమీటర్లకు తగ్గింది. ప్రధానంగా ఆదిలాబాద్, కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాల్లో పచ్చదనం తగ్గడం వల్లే సహజసిద్ధమైన చల్లదనం లోపించి హీట్ వేవ్స్ తీవ్రత పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మధ్యాహ్నం వరకు ఎండ.. సాయంత్రం వాన...**

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రానున్న రెండు రోజులపాటు అకాల వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.బుధవారం,గురువారాల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో వర్ష సూచన ఉన్నప్పటికీ రానున్న రెండు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలలో పెద్ద మార్పు ఏమి ఉండదని హెచ్చరించింది. తెలంగాణ పశ్చిమ, తూర్పు జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులు, వడగళ్ళతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారి చేసింది. గంటకు 30 40 కి మీ వేగం కలిగిన ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## నిషేధం ఎత్తివేత

>> నిషేధం అమల్లోకి వస్తుందని ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పేర్కొన్నారు. జనగణన విధుల్లో ఉన్న బదిలీల మార్గదర్శకాలు వర్తించవని ప్రభుత్వం తెలిపింది. ఆన్ లైన్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియ చేపడతారు. అవసరమైతే హార్డ్‌షిప్ పోస్టులకు లాటరీ విధానం అమలు చేస్తారు. రాష్ట్రపతి ఉత్తర్వులకు లోబడి బదిలీల ప్రక్రియ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో చేపట్టనున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

### వారం - వర్జ్యం

22-04-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, అశ్విని కార్తె
షష్ఠి రా.10.53
ఆరుద్ర రా.10.16
వర్జ్యం : ఉ.7.48-ఉ.9.17
దు. ఉ.11.40-మ.12.30
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం:** జీవితభాగస్వామితో స్పర్థలు రాకుండా మీరే సర్దుకుపోవడం చెప్పదగినది. సంతాన విద్యా విషయములలో ప్రోత్సాహం.

**వృషభం:** వ్యాపారములో చేసిన మార్పులు, ప్రచారము సత్ఫలితములనిస్తాయి. వాహన సౌఖ్యము ఏర్పడుతుంది. బంధువుల కలయిక.

**మిథునం:** స్థిరాస్తులను కొనుగోలుచేసే ఆలోచనలు ఫలిస్తాయి. వచ్చిన ధనమును పొదుపు చేయుటకు ప్రయత్నిస్తారు.

**కర్కాటకం :** సాంస్కృతిక కార్యక్రమములు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, వైద్యవిద్య, విదేశీ యత్నములు అనుకూలదిశలో పయనిస్తాయి.

**సింహం:** కుటుంబ వ్యవహారాలలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోండి. ఇతరులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్తలు వహించండి.

**కన్య :** ఖర్చులను తగ్గించు విషయములో పూర్తిగా వైఫల్యమును పొందుతారు. పనులయందు శ్రద్ధాశక్తులను చూపిస్తారు.

**తుల :** ఆరోగ్యమును గురించి వైద్యుని సంప్రదించవలసివస్తుంది. నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృశ్చికం:** మీరు చేయని పొరపాటుకు మిమ్ములను దోషులుగా నిర్ణయించే విషయములో తగు జాగ్రత్తలను పాటించండి.

**ధనుస్సు:** మీ నైపుణ్యమునకు తగిన ప్రతిఫలమును పొందుతారు. బదిలీకి చేసే ప్రయత్నములు ఫలిస్తాయి. వస్త్రలాభం.

**మకరం:** ఆధ్యాత్మిక కార్యక్రమములకు, ధనమును బాగా ఖర్చుచేస్తారు. నూతన భాషలను అభ్యసించే ప్రయత్నాలు చేస్తారు.

**కుంభం:** వృత్తి యందు బాధ్యతల ఒత్తిడి అధికం అవుతుంది. సమర్థవంతంగా నిర్వహిస్తారు. కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**మీనం :** వివాదాస్పద వ్యవహారములు పరిష్కారమౌతాయి. టెండర్స్ అతి కష్టము మీద మీకు అనుకూలంగా వస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# బస్సులు బంద్

>> కాలయాపన చేసే చర్యేనని జేఏసీ నేతలు విమర్శించారు. డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందని ఆర్టీసి జెఏసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. పక్కా హామీ లభించే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు. మొదటి షిఫ్టు నుంచే కార్మికులు సమ్మెలో పాల్గొంటారని, మద్దతుదారులు సమ్మెను విజయవంతం కోసం పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఆర్టీసీ జేఏసీ నేతలు మంగళవారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడారు. సమ్మెకు ఆర్టీసీ, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయని, ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. తాము సమ్మె నోటీసు ఇచ్చి 41 రోజులు గడుస్తున్నా ఏ రకమైన చర్యలు లేవన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం కార్మిక సంఘాలతో చర్చలు జరపకపోవడం విచారకరమని, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియ ఇప్పటికీ మొదలు పెట్టలేదన్నారు. సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించట్లేదని మండిపడ్డారు. ఆర్టీసీని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎలక్ట్రిక్ బస్సులతో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుపరం చేసే యోచనలో ప్రభుత్వం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీని హైదరాబాద్‌లో లేకుండా చేయాలని చూస్తున్నారని, ఆర్టీసీ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే విధంగా యాజమాన్యం వ్యవహారం ఉందని విమర్శించారు. అద్దె బస్సుల నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని, ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా సమ్మెలో పాల్గొనాలని జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఈసారి ఆర్టీసీ సమ్మె మరో సకల జనుల సమ్మెగా మారబోతోందని జేఏసీ నేతలు హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా సమ్మెపై జోక్యం చేసుకోవాలని, కాలయాపన కోసమే విలీనం పేరు మీద కమిటీ వేశారని, నష్టాల్లో ఉన్న మెట్రోను మాత్రం ప్రభుత్వపరం ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. ఆర్టీసీని మాత్రం ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వెనక ఆర్టీసీ కార్మికులు తప్ప మరెవరూ లేరన్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోతే మూసీ అభివృద్ధి ఎలా చేస్తున్నారో చెప్పాలని జేఏసీ చైర్మన్ వెంకన్న ప్రశ్నించారు. ఆర్టీసి సమ్మె ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా బస్సులు నిలిచిపోనున్నాయి. ప్రతిరోజు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించే దాదాపు లక్షల మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్,వరంగల్ వంటి ప్రధాన నగరాల్లో సామాన్య ప్రజలు,విద్యార్థులు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమ్మె విరమించాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని,అందుకే అధికారుల కమిటీని నియమించామని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి డిపోల వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

## ఆర్టీసీకి సంబంధించిన సమస్యలపై అధికారుల కమిటీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 21:** ఆర్‌టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తగిన ప్రతిపాదనలు ఇవ్వడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అధికారుల కమిటీని నియమించింది. నాలుగు వారాల్లో కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీజీఎస్‌ఆర్టీసీకి సంబంధించిన సమస్యలను పరిశీలించడానికి అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్.నెం.66ను విడుదల చేసింది. నేటి నుంచి ఆర్‌టీసీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు వెళుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అధికారుల కమిటీని నియమించింది. కమిటీలో రవాణా, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా కొనసాగుతారు. కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఆర్థిక శాఖ కార్యదర్శి సభ్యుడిగా కొనసాగుతారు. ఆర్‌టీసీ వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కన్వీనర్‌గా ఉంటారు. అదికారుల కమిటీ ఆర్‌టీసీ కార్మికులు, ఉద్యోగులకి సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి నాలుగు వారాల వ్యవధిలోగా ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించాలని సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

# నకిలీ కెవైసితో 2 కోట్లుపైగా లూటీ

>> చేసేవాడు. ఆ చనువుతో సిబ్బంది లాగిన్ పాస్వర్డ్‌లను తెలుసుకుని లాగిన్ అయి బ్యాంకు లోని ఇతర ఎస్ బి ఐ బ్రాంచి ల లోని ఖాతాలను గమనించేవాడు.ఆపరేట్ చేయని ఖాతాల్లో డబ్బులు ఉండటాన్ని గమనించిన చక్రపాణి వాటిని కొట్టేయ్యాలని పథకం వేసాడు. పనిచేస్తున్న బ్రాంచిలో డబ్బులు కాజేస్తే దొరికిపోతామని భావించి..అదే ఎస్బీఐ బ్యాంకు బ్రాంచిలను ఖాతాలపై దృష్టిసారించాడు. ఈ క్రమములో నే అతనికి సూర్యాపేట ఎస్ బి ఐ మెయిన్ బ్రాంచ్ లో పనిచేసే బ్యాంక్ మేనేజర్ పుట్ట వెంకట రామాంజనేయులుతో పరిచయం ఏర్పడింది. కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, అప్పుల కారణంగా అక్రమంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్న చక్రపాణి, రామాంజనేయులు తో కలిసి మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా ఖాతాలలో ఎక్కువగా డబ్బులు ఉండి గత కొన్ని సంవత్సరాలుగా ట్రాన్సాక్షన్ లు జరగని 10 ఇనాక్టివ్ బ్యాంక్ ఖాతాల వివరాలను సేకరించాడు. ఆ ఖాతాదారుల వివరాలు ఆధార్, పాన్, ఫోటో సంతకం వివరాలను సేకరించి, రేఖ ప్రింట్ ఇన్ఫో సైట్ ద్వారా నకిలీ ఆధార్, పాన్ కార్డులను తయారు చేశారు. బ్యాంక్ ఉద్యోగుల లాగిన్ లతో బ్యాంకు కంప్యూటర్ లోకి లాగిన్ అయి, ఖాతాలకు కొత్త మొబైల్ నంబర్ అప్డేట్ చేశారు.అనంతరం యోనో యాప్ ద్వారా కొత్త యూసర్ ఐడీ పాస్వర్డ్ ,పిన్ సృష్టించి చక్రపాణి కి పరిచయం ఉన్న బ్యాంకు రికవరి ఏజెంట్ కేతావత్ రాంలాల్, ఫోటో గ్రాఫర్ మారేపల్లి శివ ల ద్వారా వారికి పరిచయం ఉన్న వ్యక్తులకు కమీషన్ ఆశ చూపి వారి అకౌంట్లలో యోనో యాప్ ద్వారా ఆ ఖాతాల నుండి నగదును ఇతర వ్యక్తుల ఖాతాలకు ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేసేవారు. ఖాతాదారుడి పిర్యాదు తో మోసం వెలుగులోకి :హైదరాబాద్ కోటి ఎస్ బి ఐ బ్రాంచ్ లో పల్లటి నరేందర్ అనే వ్యక్తి కి చెందిన ఖాతా కు కేవైసి అప్డేట్ అయినట్లు ఇమెయిల్ ద్వారా అలర్ట్ మెసేజ్ వెళ్లింది. దీంతో నరేందర్ వెంటనే బ్యాంక్ ను సంప్రదించడంతో అసలు విషయం బయటపడింది. నరేందర్ పిర్యాదు తో విచారణ చేపట్టిన బ్యాంకు అదికారుల కు దేవరకొండ బ్రాంచి లో కేవైసి అప్డేట్ చేసినట్లు గుర్తించారు. అక్కడ మేనేజర్ ఇచ్చిన సమాచారం తో బ్రాంచ్ మేనేజర్ ఫణీంద్ర నీలకంఠ వెంకట రాఘవపూడి తమ శాఖ లో రూ.2,65,55,268 నకిలీ లావాదేవీలు జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసారు. బ్రాంచ్ మేనేజర్ ఫిర్యాదు తో కేసు నమోదు చేసి దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాస రావు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి, సి ఐ పి. వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సమన్వయంతో సాంకేతిక శాస్త్రీయ ఆధారాలను సేకరించి, వివిధ ప్రాంతాల్లో దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,42,10,000 నగదు, 6 స్మార్ట్ మొబైల్ ఫోన్లు, 1 ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి తెలిపారు.విచారణలో అక్రమంగా సంపాదించిన మొత్తాన్ని లెండల చక్రపాణి, పుట్ట వెంకట రామాంజనేయులు కి 45 శాతం, సహాయం చేసిన కేతావత్ రాంలాల్ , మారేపల్లి శివ లకు 10 శాతం వాటాలుగా పంచుకునే వారని చెప్పారు. నిందితులను అరెస్టు చేయటములో ప్రతిభ కనబరిచిన ఎస్ ఐ రాజు, కానిస్టేబుల్స్ యల్ . వీరబాబు, ఫయాజ్, చాంద్ పాషా,వి. సింహాద్రి, సోమ్లా లను జిల్లా ఎస్పీ అభినందించారు.



మంగళవారం ఒడిశాలోని ఝార్సుగూడ జిల్లాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్. చిత్రంలో గవర్నర్ కంభంపాటి హరిబాబు

# కెసిఆర్ చెప్పారనే ఢిల్లీ వెళ్లా

>> వారు ఎవరైనా ఇలాంటి పనులు చేయరని, విషయం లేనివారే ఇలా చేస్తారని విమర్శించారు. బుధవారం ఓటుకు నోటు కేసు కూడా సుప్రీంకోర్టులో విచారణకు రానుందని, ఆ కేసు గురించి న్యాయవాదులతో చర్చించామని అన్నారు. ఈ కేసులో నాటి ముఖ్యమంత్రి, హోంమంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం తరఫున అనామక లాయర్‌ను పెట్టారని విమర్శించారు. నిందితుల తరపున మాత్రం ప్రముఖ లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారని చెప్పారు. రేపటి విచారణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముద్దాయిగా ఉన్నారని గుర్తు చేశారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారని చెప్పారు.రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాత్రి రాహుల్ గాంధీతో, ఉదయం బీజేపీ వారితో తిరిగారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ నిన్న బయటకు వచ్చినందనే రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల చేశారని అన్నారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సిన సొమ్మును పంట చేతికి వచ్చాక ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయి, తమ పార్టీ అధినేత కేసీఆర్ స్థాయి ఏమిటో తెలంగాణ ప్రజలకు జగిత్యాల బహిరంగ సభలతో అర్థమైందని, కేసీఆర్ జగిత్యాల సభ ప్రసంగాన్ని 36 లక్షలమంది చూస్తే, రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కేవలం 4 లక్షలమంది మాత్రమే చూశారని అన్నారు. రేవంత్ రెడ్డి తెలిసి చేశారో లేక తెలియక చేశారో కానీ కెసిఆర్ సభ సమయంలోనే రేవంత్‌రెడ్డి తన సభను ఏర్పాటు చేసుకోవడంతో ఎవరి రేటింగ్ ఏమిటో తెలిసిందని అన్నారు. రైతు భరోసా డబ్బులు ఇంకెన్ని రోజులు వేస్తావని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు. పంట వేసేటప్పుడు ఇచ్చే రైతుబంధు.. పంటలు కోసే సమయానికి కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు.మున్సిపల్ ఎన్నికల కోడ్ అయిపోగానే రైతు భరోసా వేస్తా అన్నావ్ కదా.. ఏమైందని ప్రశ్నించారు. మొన్న సిద్దిపేట వస్తే నిలదీస్తారని సగం రైతుబంధు వేశారని, ఇప్పుడు కేసీఆర్ వస్తుండని మరో సగం రైతుబంధు వేసిండని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రశ్నిస్తే.. బీఆర్ఎస్ పోరాడితే తప్ప రైతుబంధు వేయరా అని ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు థ్యాంక్స్ చెప్పారు. మొన్నటిదాకా కాళేశ్వరం కుప్పకూలింది.. కూలేశ్వరం అయ్యిందని అన్నాడని గుర్తుచేశారు. నిన్ననేమో రెండు పిల్లర్లు కుంగాయని అన్నాడని పేర్కొన్నారు. రాష్ట్రంలో సూపర్ కరవు రాబోతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారని అన్నారు. అప్పుడే రేవంత్ రెడ్డికి సోయి వచ్చిందని అన్నారు. ఎల్‌నినో వస్తుందని ఇప్పుడు రేవంత్ రెడ్డి పరిగెత్తుకెళ్లిందని అన్నారు.

# ఇస్లామాబాద్ శాంతి చర్చలకు ట్రంప్!

### వర్చువల్‌గా నైనా పాల్గొంటారని రిపబ్లికన్‌నేతల వెల్లడి

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 21:** అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్న అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలకు రంగం సిద్ధమైంది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ వారం ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఒకవేళ ఒప్పందం కుదిరితే, దానిపై సంతకం చేయడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా లేదా వర్చువల్‌గా హాజరయ్యే అవకాశం ఉందని అమెరికా మీడియా కథనాలు వెలువడ్డాయి. ఇరు దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ గడువు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ గడువును పొడిగించే అవకాశం చాలా తక్కువని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే, ఈ చర్చల్లో ఇరాన్ పాల్గొంటుందా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవల హార్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్‌కు చెందిన నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడంతో చర్చలకు హాజరుకాబోమని టెహ్రాన్ మొదట ప్రకటించింది. కానీ, తాజాగా తమ వైఖరిని సానుకూలంగా సమీక్షిస్తున్నామని, అయితే తుది నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. చర్చలు జరుగుతాయనే విశ్వాసాన్ని అమెరికా వ్యక్తం చేస్తోంది. ఈ కీలక చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మంగళవారం పాకిస్థాన్‌కు వెళ్లనున్నట్లు అమెరికా వర్గాలను ఉటంకిస్తూ ఏక్సియోస్ నివేదించింది. ఈ చర్చలు విజయవంతం కావడానికి ఇరు దేశాల డిమాండ్లు పెద్ద అడ్డంకిగా మారాయి. చమురు ధరలు, స్టాక్ మార్కెట్లు కుప్పకూలకుండా చూసే ఒప్పందం కోసం ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఇరాన్‌కు అణ్వాయుధాలు అభివృద్ధి చేసే సామర్థ్యం ఉండకూడదని ఆయన గట్టిగా పట్టుబడుతున్నారు. మరోవైపు, యుద్ధాన్ని నివారించి, తమపై ఉన్న ఆంక్షలను సడలించే ఒప్పందం కోసం ఇరాన్ ఎదురుచూస్తోంది. తమ అణు కార్యక్రమానికి ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని స్పష్టం చేస్తోంది. చర్చలు విఫలమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరు దేశాలు హెచ్చరించుకుంటున్నాయి. తమ షరతులను తిరస్కరిస్తే ఇరాన్‌లోని ప్రతి వంతెనను, పవర్ ప్లాంట్‌ను ధ్వంసం చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. దీనికి ప్రతిగా, అమెరికా తమ పౌర మౌలిక సదుపాయాలపై దాడి చేస్తే, గల్ఫ్ దేశాల్లోని పవర్ స్టేషన్లు, డీశాలినేషన్ ప్లాంట్లను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ ప్రతిస్పందించింది. మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్, ఈ కీలక చర్చలకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. చర్చల నేపథ్యంలో ఇస్లామాబాద్ వ్యాప్తంగా దాదాపు 20వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించినట్లు అధికారులు తెలిపారు. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయో వేచి చూడాలి.

**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**

Short Tender Notice No: 07/2026-27/GVMC/SE (West)/EE-West/GVMC/DB. Dt. 20-04-2026 (Item-01 to 05)

| | | |
|---|---|---|
| 01. | No. of Works | 05 Nos (Five) |
| 02. | Value of works (ECV) | Rs. 5,94,00,991/- |
| 03. | Down loading Starting Date | 20-04-2026 @ 10.00 PM |
| 04. | Date of opening Tenders | 28-04-2026 @ 02.30 PM |

Further details at http://www.apeprocurement.gov.in
O/o the Superintending Engineer-West, GVMC    Sd/- Commissioner, GVMC

AU SMALL FINANCE BANK
నమోదిత కార్యాలయం: 19-A ధులేశ్వర్ గార్డెన్, జైపూర్, రాజస్థాన్, ఇండియా, 302001. www.au.bank.in

బంగారంపై రుణం-"ఏది ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలా" ప్రాతిపదికపై వేలం ప్రకటన

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ("బ్యాంక్") నుండి బంగారంపై రుణ సౌకర్యాలు పొందిన క్రింద పేర్కొన్న బడిన రుణగ్రహీత/లు వారి రుణ బకాయి మొత్తాలను చెల్లించవలసినదిగా నోటీసులు జారీ చేయడమైనది. రుణ గ్రహీత/లు అతని/వారి బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున అందులో నిర్దేశించబడిన పద్ధతి ప్రకారం క్రింద పేర్కొనబడిన శాఖలలో 22 మే 2026న ఉ.11.00 మ.3.00 (సమయం) మధ్య తాకట్టు పెట్టిన బంగారు ఐటమ్‌లు/వస్తువుల యొక్క వేలం మేము బలవంతపు ఠర్యాగా నిర్వహించడానికి వస్తోంది. దివంగతులైన రుణగ్రహీతల విషయమై వారి చట్టబద్ధమైన వారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి. పై వేలం నిర్వహించడం ఒకవేళ విఫలమైతే బ్యాంక్ ముందస్తుగా తెలియపరచవలసిన అవసరం లేకుండానే మరొక వేలం నిర్వహించటానికి దానికి హక్కు రిజర్వ్ అయిఉన్నదని దయచేసి గమనించవలసినదిగా ఇందుమూలముగా తెలియజేస్తున్నాము.

భౌతిక వేలం శాఖ వివరాలు

కామారెడ్డి -L25660001647231 L25660002139220 L25660002007479 L25660002122442 L25660002007499 L25660002216275 L25660002196701 L25660002040595 । కాటారం L25660001577972 L25660001090427 L25660001152812 L25660001148650 L25660001109855 నాగర్ కర్నూల్ -L25660000977976 L25660000984813 L25660001111530 L25660001023095 L25660001771766 L25660001173472 L25660001160966 అచ్చంపేట్ -L25660001175088 । మెదక్ -L25660001050524 L25660001148680 L25660001024324 । యాదాద్రి భోంగీర్ -L25660001055215 పార్కల్ -L25660001022077 L25660002106343 L25660001074428 L25660001076855 L25660001997491 L25660001601348 L25660001129296 L25660001025182 బాన్సువాడ -L25660000975860 L25660002045666 । హనుమకొండ వరంగల్ -L25660001169680 L25660000983815 L25660001118637 L25660000990451 L25660000692382 L25660002092226 L25660001304337 L25660001159139 L25660001023335 నారాయణపేట -L25660000961456 L25660000982876 L25660001100501 L25660001080776 కోదాడ -L25660001014153 L25660001123457 । సిద్దిపేట L25660001025382 L25660000980440 । రోడ్ నం.1 బంజారా హిల్స్ -L25660000015858 । షాద్‌నగర్ -L25660001144187 మిరియాల్‌గూడ -L25660002085550 L25660001072342 L25660000995872 L25660001488779 L25660002274475 L25660002161017 L25660001117189 హుస్నాబాద్ -L25660001765558 L25660001357306 ా25660000959231 L25660001069428 । మహబూబాబాద్ -L25660000733256 L25660000983985 L25660001118557 L25660001124785 L25660001112198 L25660000951465 L25660000955198 L25660001165917 L25660001201141 L25660001139927 L25660000972415 L25660001165537 । ఖమ్మం -L25660000954820 L25660001106590 L25660002144230 । జనగాన్ -L25660001094510 L25660000671532 । వనస్థలిపురం -L25660002219660 L25660001876549 । ములుగు -L25660000952264 । సూర్యాపేట -L25660001045934 । జగిత్యాల్ -L25660001003744 L25660001065105 L25660002149691 L25660000523082 L25660001098893 L25660001000489) వనపర్తి -L25660001137671 L25660001130444 । భూపాలపల్లి L25660001051652 L25660001025572 L25660000989434 । కరీంనగర్ -L25660000970329 L25660001101739 L25660001031380 L25660001102097 । బోధన్ -L25660001020741 L25660001163521 వేములవాడ -L25660001079019 L25660000959211 L25660001131722 L25660001148840 L25660001076615 సంగారెడ్డి -L25660001051362 । గద్వాల్ -L25660000956216 L25660001126102 L25660001118337 । నర్సంపేట - L25660000973004 L25660000981098 L25660001144097 L25660001050134 L25660001022687 । ధర్మారం -L25660001000419 L25660001147132 । తొర్రూరు L25660001137421 L25660001100961 L25660001152662 L25660001463856 L25660001146334 L25660001014343 । మోత్కూరు -L25660001085447 । ఘన్‌పూర్ -L25660001086695 L25660001087084 । జోగిపేట -L25660001156605 L25660001174420 L25660001171845 L25660001099201 । హుజురాబాద్ -L25660001057441 L25660001110372 L25660001052840 । నారాయణఖేడ్ -L25660001161575 । మంథని -L25660001095068 L25660001068730 L25660000975510 । చౌటుప్పల్ -L25660001905826 L25660001005240 । మధిర -L25660000982836 L25660001042759 । తల్లాడ -L25660001131522 L25660001123347 । పాల్వంచ -L25660001005240 । మధిర -L25660001000982836

గమనిక: 1. ఒకవేళ భౌతికంగా వేలం విఫలమైతే వెబ్‌లింక్ - https://gold.samil.in ఉపయోగించటం ద్వారా ఇ-వేలం నిర్వహించవచ్చును.
2. ఒకవేళ ప్రతిపాదించబడిన వేలం విఫలమైతే తర్వాతి వేలం కొరకు ఈ నోటీసును ముందస్తు-ప్రకటనగా దయచేసి పరిగణించవలెను.
3. వేలం యొక్క ప్రారంభానికి ముందు అందుబాటులో ఏర్పాటు చేసిన బిడ్ ఫారమ్‌లోని రూఢీ అయిన నియమాలు మరియు నిబంధనలకు లోబడి వేలం ఉంటుంది.

సం/- మేనేజర్
AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

వార్త

తక్షణ కర్తవ్యం నెరవేరిస్తే, తదుపరి కర్తవ్యం ఏమిటో సులువుగా తెలుస్తుంది.

- బైరన్


# సంశయాలకు సమాధానమిదేనా?

సహజ న్యాయ సూత్రాలనేవి అందరికీ వర్తిస్తాయి. కనుక వాటిని కాపాడాల్సింది న్యాయవ్యవస్థే. అదే న్యాయవ్యవస్థకు న్యాయప్రక్రియలో అభాసు పాలు కాకుండా తననుతాను కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా కలిగి ఉంటుంది. న్యాయమూర్తి న్యాయపీఠ మెక్కాక తన పర బేధాలుండవు. న్యాయవ్యవస్థ పుట్టినప్పటి నుంచి న్యాయపీఠంపై ఆసీనులైనవారికి ఎలాంటి కళంకం ఆపాదించకుండా తనను తాను కాపాడుకుంటోంది. ప్రజాస్వామ్యంలో ప్రధాన స్తంభంగా భావించే న్యాయవ్యవస్థపై అపనమ్మకం, అవిశ్వాసం లేకపోయినా సంశయంతో న్యాయమూర్తులను మార్చమని కోరుతుంటారు. న్యాయం కోసం న్యాయస్థానం మెట్లెక్కినట్లే తమకుఎవరు న్యాయం చెప్పాలో కూడా వారే చెబుతున్నారు. సాధారణంగా న్యాయమూర్తులే తమ ముందు ఫలానా కేసు రాకూడదనో, రావద్దనో, తనకు ఆ కేసుతో పరిచయం ఉందన్న పేరుతో, 'నాట్ బిఫోర్‌మి'అని తప్పుకుంటుంటారు. అదీ న్యాయవ్యవస్థ నిజాయితీకి నిదర్శనం. కానీ రాజకీయ నాయకులకు సంబంధించిన కొన్ని కేసులో న్యాయాధీశుల మీద సందేహాలు వ్యక్తపరుస్తూ బెంచిలు మార్పించుకున్న సందర్భాలు మనకు తారసపడుతున్నాయి. తాజాగా రెండు కేసులకు సంబంధించి న్యాయమూర్తుల కొనసాగింపు విషయంలో సోమవారం రెండు నిర్ణయాలు జరిగాయి. ఆ రెండు కేసులూ ప్రధాన రాజకీయ నేతలవే. మద్యం కుంభకోణం కేసు విచారణ నుంచి తనను తప్పుకోవాలని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్ రిక్యూజల్ పిటిషన్‌లో కోరగా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంతశర్మ 'నసేమిరా' అన్నారు. కేసుల్లో బలీయమైన సాక్ష్యాలను బట్టే తీర్పులుంటాయి తప్ప వ్యక్తులను బట్టి న్యాయమూర్తులు నిర్ణయించరన్న ఒకే ఒక న్యాయసిద్ధాంతాన్ని ఆధారంగా న్యాయవ్యవస్థ సామర్థ్యాలను ఒక రాజకీయవేత్త నిర్దేశింప జాలరని ఢిల్లీ హైకోర్టు తీర్పులో పేర్కొంది. ఈ కేసులో కేజ్రీవాల్ పిటిషన్లను జడ్జి తోసిపుచ్చారు. దాదాపు గంటసేపటికి పైగా తన తీర్పులోని ప్రధానాంశాలను ఆమె బహిరంగ కోర్టు హాల్లో వినిపించారు. ఎలాంటి ఆధారాలులేని ఆరోపణలతో కక్షిదారు న్యాయమూర్తి నిజాయితీని అంచనా వేయలేరని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రయత్నాలను తాను కొనసాగనివ్వలేనన్నారు. న్యాయమూర్తిపై వ్యక్తిగత దాడిని ఏకంగా న్యాయవ్యవస్థ మీద దాడిగా అభివర్ణించారు. తాను ఈవిచారణ నుంచి వైదొలగనని స్పష్టంగా చెప్పారు. గతంలో ఇదే కేసు సందర్భంగా జస్టిస్ స్వర్ణకాంతశర్మ పక్షపాత వైఖరితో వ్యవహరించారని అందుకే తన కేసులో ఆమెను తప్పుకోవాలంటూ కేజ్రీవాల్ కోరారు. పక్షపాతంగా వ్యవహరిస్తారనేది నిరాధార అనుమానాన్ని సంతృప్తిపరిచే దిశగా న్యాయమూర్తులు విచారణ నుంచి తప్పించుకోలేరన్నారు. కేవలం సందేహాలు, ఊహాగానాలతో ఓ రాజకీయ నేత న్యాయవ్యవస్థకు నష్టం కలిగించడం అనుమతించలేనన్నారు. రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వ కేసు నుంచి అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచి న్యాయమూర్తి జస్టిస్ సుభాష్ విద్యార్థి తనంతతానే తప్పుకున్నారు. ఒకబిజెపి కార్యకర్త చేసిన పోస్టులు తన కోర్టుపై నిందలు మోపినట్లు అనిపిస్తున్నందున తాను ఈ కేసు నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటిస్తూనే మరో బెంచికి ఈ కేసు విచారణకు ఏర్పాటుచేయాలని ప్రధాన న్యాయమూర్తినికోరారు. కేజ్రీవాల్ పిటిషన్‌కు సంబంధించి న్యాయమూర్తి తన దృఢ వైఖరిని ప్రస్ఫుటింప చేశారు. కేసు నుండి వైదొలగడమంటే అదొక 'ప్రమాదకర ఆనవాయితీ'కి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు గది 'అభిప్రాయాల రంగస్థలం'గా మారకూడదని హైకోర్టు స్పష్టం చేసింది. తీర్పు తనకువిరుద్ధంగానో, ఏకపక్షంగానో ఉందని తేల్చాల్సివస్తే అది ఉన్నత న్యాయస్థానానికే సాధ్యం అవుతుంది. ఈ కోర్టులో తగిన ఉపశమనం కల్పించకపోవచ్చనే కక్షిదారుడిలో అభద్రతా భావం మంచిది కాదన్నారు. తాను కక్షిదారుని డిమాండ్‌కు లొంగితేఎవరినైనా న్యాయవ్యవస్థను కదిలించగలం,మార్పు చేయవచ్చనే సంకేతాన్ని ఇచ్చినట్లు అవుతుంది. ఒక అబద్ధాన్ని కోర్టులో కానీ సోషల్ మీడియాలో కానీ వెయ్యిసార్లు చెప్పినా అదేమీ నిజం కాబోదంటూ జస్టిస్ స్వర్ణకాంత శర్మ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా మరో భిన్నమైన కేసులో న్యాయమూర్తులపై చేసే నిర్లక్ష్యపు నిరాధార ఆరోపణలు న్యాయవ్యవస్థ పునాదులనే దెబ్బతీస్తాయని వాటిని అనుమతించబోమని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ఏదేని న్యాయమూర్తిపై వ్యక్తిగత ఆరోపణలు నిస్సందేహమైన ఆధారాలతో ఉండాలి. బాంబే హైకోర్టు న్యాయమూర్తి ఒక రాజకీయ పార్టీతో సంబంధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలు మంచివి కావని అటువంటి పిటిషన్లపై జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇలాంటి ఆరోపణలు విచారిస్తే ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉండే విశ్వాసాన్ని దెబ్బతీయడమేనని అభిప్రాయపడింది. న్యాయ నిర్ణయాలను హేతుబద్ధతతో విమర్శ చేయడంలో తప్పేమీ లేదని, కానీ తీర్పు చెప్పిన న్యాయమూర్తులపై వ్యక్తిగత వ్యవహారాలపై అబద్ధాల వ్యాప్తి అనుమతించబోమని వ్యాఖ్యానించింది. 'రిక్యూసల్' పిటిషన్‌ల విషయంలో తగు పరిమితులను అర్థం చేసుకోకుండా న్యాయవ్యవస్థ ప్రతిష్టను భంగపరిచే విషయంలో గతంలోనూ కొన్ని సందర్భాల్లో చర్చనీయాంశమయ్యాయి. న్యాయవ్యవస్థలో పారదర్శకత ఆవశ్యకత పెరిగింది. కేసు తీర్పు తమకు అనుకూలంగా ఉండకపోవచ్చునని సందేహాలు తలెత్తినప్పుడు కొంత మంది కక్షిదారులు 'రిక్యూసల్' పిటిషన్‌ను ఒక సాధనం గా ఉపయోగించుకుంటారు. ఇలాంటి వాటి విషయంలో న్యాయమూర్తులు వ్యక్తిగత నైతిక ప్రమాణాలు, సంస్థాగత నిబంధనలు పాటిస్తూ తీసుకునే నిర్ణయాలు స్వాగతించదగినవే.



మంచి కార్యం తలపెట్టిన వాడికి దృఢచిత్తము, సింహబలము వాటంతట అవే సమకూరుతాయి.

థామస్ ఫుల్లర్



అన్నీ మన మేలుకోసమే అని తలిస్తే, ఎలాంటి క్లిష్టపరిస్థితి కూడా మనసును కలతపెట్టలేదు.

జెఫర్‌సన్

## ప్రజావాక్కు



### కాంట్రాక్ట్ ఉద్యోగుల కష్టాలు?

రాష్ట్రంలో వివిధశాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఆశావర్కర్లు, అంగన్‌వాడీసిబ్బంది, వర్క్‌చార్జ్‌డ్, దినసరి వేతన ఉద్యోగుల సమస్యలు సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ యంత్రాంగం నడిచే పునాది వీరేనని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అయినప్పటికీ, వీరి సేవలకు తగిన గుర్తింపు, భద్రత ఇంకా దక్కకపోవడం విచారకరం. 2014లోనే కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలనిమొట్ట మొదటి తెలంగాణ రాష్ట్రకేబినెట్ తీసుకున్న నిర్ణయం ఇప్పటికీ పూర్తిగా అమలు కాలేదు. ఇది ఒక్కరోజులో తీసుకున్న నిర్ణయం కాదు విస్తృతంగా అధ్యయనంచేసి, అన్నికోణాలు పరిశీలించిన తరువాత తీసుకున్న నిర్ణయం. అయినప్పటికీ, అమలు విషయంలో చోటుచేసుకుంటున్న ఆలస్యం అనేక సందేహాలకు తావిస్తోంది. కార్యాలయంలో శాశ్వత ఉద్యోగులతో సమానంగా పని చేస్తూ, తక్కువ వేతనంతో జీవించడం వారి దైనందిన వాస్తవం.

- సురేష్ కాలేరు, హైదరాబాద్

### దైవదర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

దివ్యాంగులు వివిధ దేవాలయాలలో దైవదర్శనం కోసం తగిన ఏర్పాట్లు చేయాలి. ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించాలి. దేవాలయాలలో వికలాంగుల దైవదర్శనం కోసం ప్రత్యేకమైన క్యూ ఏర్పాటు చేయాలి. సత్రాలలో ఉచిత సౌకర్యం కల్పించాలి. ఉచిత లడ్డు ఇవ్వాలి. దేవాలయాల వద్ద వికలాంగుల దైవదర్శనం వసతి కొరకు ప్రత్యేకమైన కౌంటర్‌ఏర్పాటు చేయాలి. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు వికలాంగుల దైవదర్శనం కోసంఆర్థికసహాయం చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### స్వీయ నియంత్రణ అవసరం

జ్ఞానం ఉన్నవాళ్లు కూడా తన భావోద్వేగాలను, కోపాన్ని, ఆలోచనలను నియంత్రించలేకపోతే అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే జీవితంలో విజయం సాధించాలంటే స్వీయనియంత్రణ చాలాఅవసరం. స్వీయ నియంత్రణ కోల్పోయినప్పుడు మనిషి చేసే చర్యలు అనేక ప్రమాదాలకు దారితీస్తాయి. చిన్నవిషయాలకే కోపం రావడం, ఇతరులను దూషించడం, చేయి చేసుకోవడం వంటి చర్యలు సంబంధాలను దెబ్బతీస్తాయి.

- కె.రామారావు, నల్గొండజిల్లా

### ప్రభుత్వాలు సైన్స్‌ను ప్రమోట్ చేయాలి

ఈరోజు ప్రపంచం శాస్త్రీయంగా ఎంతో ముందుకుపోతుంది. ఇతర గ్రహాలలో కాపురం పెట్టేందుకు ఉరకలు వేస్తుంది. మనం మాత్రం ఆటవీకానికి వెళ్దాం అంటూ ఆధ్యాత్మికాన్ని ప్రమోట్ చేయటం విచారకరం. ఆధ్యాత్మికం పేరుతో గుళ్ల కట్టించాలి. ఒక్కోనియోజకవర్గంలో 20,30 గుళ్ల నిర్మించాలి అని రాష్ట్రముఖ్య మంత్రి చంద్రబాబు ప్రకటించటం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధం. హైటెక్ ముఖ్యమంత్రిగా పేరుతెచ్చుకున్న చంద్రబాబు ఈరోజుమోడీతో స్నేహం చేసినందువల్లనో ఏమో భక్తి ఉద్యమాన్ని భుజాన వేసుకున్నట్లుగా కనిపిస్తుంది. ప్రజలను గతంలో జరిగిన అరాచకం నుండి ఉద్ధరిస్తారని, చంద్రబాబును గెలిపించుకున్నారు. అంతేకానీ, గుళ్లను కట్టించేందుకు , మతాన్ని ప్రోత్సహించేందుకు ఎన్నుకోలేదు. ఆ విషయం గమనించాలి. మనది సెక్యులర్ దేశం. ప్రభుత్వ పరంగా మతాన్ని ప్రమోట్ చేయకూడదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### జీతాల కోత విధించాలి

ఈ మధ్య కొన్ని ఐటీ దిగ్గజ సంస్థలు సైతం తమకు లాభాలు తగ్గిపోతున్నాయని వేల మంది ఐటీ వుద్యోగుల్ని ఆగమేఘాల మీద తొలగించి వేస్తున్నాయి. వారికి తగిన పరిహారం కూడా చెల్లిస్తున్నామని సంస్థలు ప్రకటిస్తున్నాయిగాని, సంవత్సరాల తరబడి ఆ కంపెనీ వృద్ధికి సేవచేసి జీవితంలో స్థిరపడుతున్న వేళ యుజ్ అండ్‌త్రో అన్నవిధంగా వున్న పళంగా వారి ఉద్యోగాలు తొలగించటం అన్యాయం. కనుక మనసుంటే మార్గం ఉంటుంది అన్న సామెత వలె గొప్పల కోసం పెద్ద వేతనాలు ఇస్తున్న ఈసంస్థలు తమనష్టాలను తొలగించుకోవాలని భావిస్తే వుద్యోగులను తొలగించే బదులు వారి వేతనాలపై కోత విధించవచ్చు. ఇష్టమైన వుద్యోగులు వుంటారు. ఇష్టం లేని వాళ్ళు మరో చోట ఉద్యోగం చూసుకుంటారు. ఈ నిర్ణయం వల్ల ఎవరికీ నష్టం ఉండదు, ఉభయ తారకంగా వుంటుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### నిరుపేదలకు పౌష్టికాహారం అందించాలి

ప్రభుత్వ ఆసుపత్రులలో, హాస్టల్‌లో గ్యాస్ పేరుతో, నిధులు లేమి పేరుతో నిరుపేద బిడ్డలకు పౌష్టికాహారం అందించకుండా ఉండొద్దు. కచ్చితంగా పౌష్టికాహారం అందించాల్సిందే. ఎక్కడ నిర్లక్ష్యంవహించినా మనం ప్రశ్నించే అవకాశం ఉంది. అది మన హక్కు, మన వాటా. నిరుపేదలకు పౌష్టికాహారం అందించే బాధ్యత ప్రభుత్వాలది. అందరికి అందుబాటులో ఉండేవిధంగా పౌష్టికాహారాన్ని అందించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# కాలుష్యమే మానవ మనుగడకు ముప్పు

**తెలంగాణలోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్ని విడుదల చేయకుండా చూస్తూ, ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది. అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతో పాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరిత హారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్స రాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలునాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్నది. ప్రభుత్వాలు ఎదో చేయాలని మిన్నకుండిపోకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి.**

ఎస్.ఎమ్. కిష్టయ్య

సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. పంచ భూతాలలో ఒకటిగా, భారతీయ సంస్కృతిలో భూమి భూదేవతగా భావించబడి, పూజింపబడడం కనిపిస్తుంది. భూమి పరిరక్షణ కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకోకపోయినా, కనీసం హాని కలిగించకుండా ఉంటే చాలు. ఇందుకోసం అవగాహన అవసరం. అటు పర్యావరణం, వాతావరణంతో పాటు ఇటు జీవన శైలిలోనూ మార్పులతో భూ పరిరక్షణపై అవగాహన కోసం కూడా ప్రత్యేక కార్యక్రమాలు అవసరమవుతున్నాయి. ఈ క్రమంలోంచి వచ్చిందే ప్రపంచ ధరిత్రి దినోత్సవం. ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 22న 'ధరిత్రి దినోత్సవం' జరుపుకుంటున్నారు. 1962లో అమెరికన్ సెనెటర్ నెల్సన్‌కి వచ్చిన ఆలోచనకు ప్రతి రూపమే ఈ ధరిత్రీ దినోత్సవం.1969లో నెల్సన్ మన వాతావరణంలో జరిగే మార్పులనూ వివరిస్తూ మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో మన వంతు ఏమి చెయ్యాలో అందరికీ తెలియ చెప్పడానికి ఒక రోజంటూ ఉంటే బాగుంటుందని అనుకున్నారు. వెంటనే తన ఆలోచనకు రూపకల్పన చేస్తూ తన మిత్రులకు ఒక వార్తాపత్రిక ద్వారా ప్రజలకూ ఈధరిత్రీ దినోత్సవం గూర్చి వివరించారు. 1970 ఏప్రిల్ 22న మొదటి ధరిత్రీ దినోత్సవం జరిగింది. ఆరోజు ఆ దేశంలోని ప్రజలంతా ధరిత్రిని రక్షించుకునేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రమాణాలు చేసారు. ఇలా తొలుత అమెరికాలో ప్రారంభమైన ఈ ఉత్సవం ఆ తర్వాత ప్రపంచ వ్యాపితమైంది. వ్యవసాయం కోసం విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలు భూమిని నిస్సారంగా, నిర్జీవంగా మార్చేస్తున్నాయి. జీవం కోల్పోయిన నేలలో దిగుబడులూ నాసిగానే ఉంటాయి. దీర్ఘకాలంలో దిగుబడులు మరీ తగ్గిపోయిఆహార సంక్షోభాలకు దారితీసే ముప్పు పొంచి ఉందని ఐక్యరాజ్య సమితి ప్రత్యేక ప్రతినిధి ఆలివర్ డి షుట్టర్ గుర్తించారు. పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాల వైపు మళ్లడం తప్ప మరో మార్గం లేదని నివేదించారు. వ్యవసాయంలో రసాయనాలు వాడే విధానాలను ప్రపంచవ్యాప్తం చేయడంలో కీలకపాత్ర వహించింది అమెరికా. ధరిత్రి దినోత్సవం పేరిట పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కూడా అమెరికాలోనే ప్రారంభం కావడం విశేషం. 50ఏళ్ల క్రితం ఏప్రిల్ 22న గేలార్డ్ నెల్సన్ నేతృత్వంలో కాలుష్యకారక విధానాలకు నిరసనగా జనం ఉవ్వెత్తున ఉద్యమించారు. అప్పటి నుంచీ సుస్థిర అభివృద్ధి కోసం ధరిత్రిదినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రపంచ వ్యాప్తంగా 175 కంటే ఎక్కువ దేశాల్లో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అనాలోచిత మానవ చర్యలవల్ల కలుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నిలువరించాలన్న బృహత్తర లక్ష్యంతో ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా మనిషి చేస్తున్న పనుల వల్ల భూగోళం అమితంగా వేడెక్కిపోతోంది. శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా వాడడం వల్ల వాయు కాలుష్యం పెచ్చుమీరుతోంది. పట్టణాలు, నగరాల నుంచి




వెలువడుతున్న వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. వ్యవసాయంలో రసాయనాలు విచ్చలవిడిగా వాడుతూ పదికాలాల పాటు పదిలంగా చూసుకోవాల్సిన భూమిని నిస్సారంగా మార్చుతున్నాం. తరిగిపోయే వనరులకు బదులు, తరగని, పునర్వినియోగించుకోగల వనరుల ఆధారంగా జరిగే అభివృద్ధే సుస్థిరాభివృద్ధి. ఇదే ధరిత్రికి సుస్థిర భవిష్యత్తును చేకూరుస్తుంది. భూమి, నీరు వంటి మౌలిక వనరులను గరిష్ట సామర్థ్యంతో వినియోగించాలి. వినియోగ అనుకూల సామర్థ్యాన్ని పెంచాలి. దూరదృష్టితో తరగని, పునర్వినియోగించుకోగల వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా సౌరశక్తి వినియోగం అధికంగా జరగాలి. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను కనీస స్థాయికి తగ్గించగలగాలి. అడవుల సంరక్షణ, పెంపకం, సుస్థిర యాజమాన్య పద్ధతులు, జీవవైవిధ్య సంరక్షణ జరగాలి. పర్యావరణాన్ని రక్షించటానికి ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు, వివిధ రకాలైన కాలుష్యాలను నియంత్రించటానికి, అదే విధంగా కాలుష్య దుష్ప్రభావాలను తగ్గించటానికి వివిధ చట్టాలను అమలు చేస్తున్నాయి. అదే విధంగా మన దేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈకాలుష్య నివారణ చర్యలకై పలు చట్టాలను రూపొందించి అమలు జరుపుతున్నది. భారత ప్రభుత్వం 1981వ సంవత్సరంలో 'వాయుకాలుష్య చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1986వ సంవత్స రంలో 'పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని కూడా అమలులోకి తెచ్చింది. పరిశ్రమల నుంచి వెలువడే పొగ, బూడిద, విష వాయువులు వంటి వాటిని ఫిల్టర్లతో వడపోసి మాత్రమే వాతావరణంలోకి వదలాలి. ఇటువంటి పరిశ్రమలను, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, అణురియాక్టర్ల వంటి వాటిని జనుల నివాసాలకు దూరంగా కట్టాలి. రైళ్లు, వాహనాలు వంటి వాటికి ఉపయోగించే పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలు కాకుండా జీవ ఇంధనాలు వాడేలా చూడాలి. దీనివలన ఎంతో వాయు కాలుష్యం తగ్గుతుంది. మొత్తం పరిశ్రమలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నాలుగు తరగతులుగా విభజించింది. ఆయా పరిశ్రమల నుండి వెలువడే కాలుష్య కారకాలను అనుసరించి అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఎరుపు వర్గంగాను, మధ్యస్తంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నారింజ వర్గంగాను, తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఆకుపచ్చ వర్గంగా, కాలు ష్యానికి ఆస్కారమివ్వని వాటిని తెలుపువర్గంగా వర్గీకరించింది. తెలంగాణలోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్ని విడుదల చేయకుండా చూస్తూ, ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది. అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతో పాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరిత హారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్స రాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలునాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్నది. ప్రభుత్వాలు ఎదో చేయాలని మిన్నకుండి పోకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. ●

# పాఠశాలల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచాలి

ఎం. దామోదర్

ఆరోగ్యం అనేది మనిషి జీవితానికి మూలాధారం. ధనం, విద్య, అభివృద్ధి ఇవన్నీ ఆరోగ్యంతోనే అర్థవంతమవుతాయి. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బలంగా నిలుస్తుంది. కుటుంబం బలంగా ఉంటేనే సమాజం సుస్థిరంగా ఉంటుంది. సమాజం సుస్థిరంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యం అని మన పెద్దలు చెప్పిన మాట ఇప్పటికీ సత్యమే. నేటి వేగవంతమైన జీవనంలో మనం ఆరోగ్యాన్ని మరిచిపోయి, సౌకర్యాల వెనక పరుగులు తీస్తున్నాం. ముఖ్యంగా మహిళలు కుటుంబ బాధ్యతలు, ఉద్యోగం, పిల్లల సంరక్షణ ఇలా అనేక పాత్రలు పోషిస్తూ తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. గర్భిణీలు, బాల్యం వంటి సున్నిత దశల్లో సరైన పోషణ లేకపోతే భవిష్యత్తు తరాల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది. ఇప్పటి జీవన విధానం మన ఆహారపు అలవాట్లను, నిద్రపాట్లను, శారీరక చలనం (కదలికలను) తగ్గించడం ఆరోగ్య సమస్యలకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో మన ఆరోగ్యంపై చైతన్యం పెంచుకోవడం అత్యవసరం. నేటి సమాజంలో ఆహారం జీవనాధారంగా కాకుండా వినోదంగా మారుతోంది. ఆకలి వేయకపోయినా తినడం, ఒత్తిడిని తగ్గించుకోవడానికి తినడం, అలవాటుగా తినడం వంటి పద్ధతులు పెరుగుతున్నాయి. టీవీ చూస్తూ, మొబైల్ వాడుతూ తినడంవల్ల మనం తినే ఆహారం మీద అవగాహన తగ్గిపోతోంది. ఈ విధమైన అలవాట్లు శరీరానికి కావాల్సిన పోషకాలు అందకుండా, అధిక కేలరీలు తీసుకునే పరిస్థితిని తీసుకొస్తాయి. ఈ సమస్యకు పరిష్కారం మైండ్‌ఫుల్ ఈటింగ్ అంటే తినే సమయంలో ఆహారంపై దృష్టి పెట్టడం, నెమ్మదిగా నమిలి తినడం, తృప్తి కలిగినప్పుడు ఆపడం. పళ్లెంలో ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, ప్రోటీన్లు సమతులంగా ఉండాలి. కానీ నేటి యువత ఎక్కువగా రుచికరమైన, త్వరగా లభించే ఆహారాలవైపు మొగ్గుచూపుతోంది. ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు చిప్స్, బిస్కెట్లు, ఫాస్ట్‌ఫుడ్స్, శీతలపానీయాలు వీటిలో అధికంగా చక్కెర, ఉప్పు, కొవ్వు, రిఫైన్ కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి తాత్కాలిక ఆనందాన్ని కలిగిస్తాయి కానీ దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. వీటి వలన శరీరంలో డోపమైన్ ఉత్పత్తి పెరిగి, మరల మరల అదే రుచిని కోరే అలవాటు ఏర్పడుతుంది. ఇది ఒక రకంగా వ్యసనంగా మారుతుంది. ఇక ఫుడ్ డెలివరీ యాప్‌ల వల్ల




ఇంట్లోనే కూర్చొని ఎప్పుడైనా ఏ రుచినైనా పొందగలిగే పరిస్థితి ఏర్పడింది. ఇది సౌలభ్యం అయినప్పటికీ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లకు అడ్డంకిగా మారుతోంది. ఫుడ్ నాయిస్ అనే పరిస్థితి. ఎప్పుడూ తినాలని అనిపించడం మన జీవనశైలిలో భాగమవుతోంది. నేటి బాలలే రేపటి పౌరులు అనే మాటను మనం తరచూ వింటాం. కానీ ఆ బాలల ఆరోగ్యం గురించి మనం ఎంత శ్రద్ధ చూపుతున్నాం అనే ప్రశ్న ఆలోచనీయమే. నేటి పిల్లలు ఆటపాటలకు దూరమై, డిజిటల్ ప్రపంచంలో మునిగిపోతున్నారు. బయట ఆడుకోవడం తగ్గిపోవడం, శారీర కదలి(చలనం) తగ్గడం, జంక్ ఫుడ్ వినియోగం పెరగడం వల్ల చిన్న వయసులోనే ఊబకాయంసమస్యపెరుగుతోంది. ప్రపంచ స్థాయిలో లక్షలాది పిల్లలు అధిక బరువుతో బాధపడుతున్నారు. భారతదేశంలో కూడా ఈ సమస్య వేగంగా పెరుగుతోంది. పాఠశాలలకు వెళ్లే పిల్లల్లో గణనీయమైన శాతం ప్రాసెస్ చేసిన ఆహారం, చక్కెర పానీయాలు అధికంగా తీసుకుంటున్నారు. ఇది కేవలం బరువు సమస్య మాత్రమేకాదు మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులువంటి దీర్ఘకాలిక వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉంది. చిన్న వయసులోనే వచ్చిన ఊబకాయం పెద్దయ్యాక కూడా కొనసాగుతుంది. అంతేకాకుండా, ఇది పిల్లల మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుంది. ఆత్మవిశ్వాసం తగ్గడం, ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు వస్తాయి. పరిశోధనలు చెబుతున్నట్టు, శారీరక చలనం లేకపోవడం, అసమతుల ఆహారం తీసుకోవడం పిల్లల మేధోసామర్థ్యాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. ఈ పరిస్థితిని మార్చాలంటే తల్లిదండ్రులు ముందుగా తమ అలవాట్లను మార్చుకోవాలి. పిల్లలకుఆరోగ్యకరమైన ఆహారం అందించడం, ఆటపాటలకు ప్రోత్సహించడం, స్క్రీన్ టైమ్‌ను నియంత్రించడం అవసరం. పాఠశాలలు కూడా ఆరోగ్య విద్యను బలోపేతం చేయాలి. ప్రభుత్వాలు జంక్ ఫుడ్ నియంత్రణకు, ఆరోగ్యకరమైన ఆహార ప్రోత్సాహానికి చర్యలు తీసుకోవాలి. ఆరోగ్యం అనేది ఒక్క రోజులో పొందేది కాదు. అది జీవితాంతం కొనసాగించే అలవాట్ల ఫలితం. సమతుల ఆహారం, క్రమబద్ధమైన జీవన శైలి, వ్యాయామం, మానసిక ప్రశాంతత ఇవి ఆరోగ్యానికి ప్రధాన స్తంభాలు. ముఖ్యంగా చిన్నారులలో మంచి అలవాట్లు పెంపొందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చు. ప్రతి కుటుంబం ఒక చిన్న ఆరోగ్య కేంద్రంగా మారాలి. తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలి. పాఠశాలలు ఆరోగ్యంపై అవగాహన పెంచాలి. ప్రభుత్వాలు ప్రజా ఆరోగ్యాన్ని ప్రధాన విధానంగా తీసుకోవాలి. నిశ్చల జీవనశైలికి బదులు చలనం, వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలి. మన ఆరోగ్యాన్ని కాపాడుతూ, రేపటి తరానికి ఆరోగ్య భరోసా ఇవ్వాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన భారత దేశం నిర్మాణం సాధ్యం అవుతుంది. ●

# చట్టసభలలో మహిళల స్థానం ఎక్కడ?

మిద్దె సురేష్

దాదాపు మూడు దశాబ్దాల కల కలగానే మిగిలిపోనుందా అనే సందేహం మహిళలకే కాదు స్త్రీల ఉన్నతికి పాటు పడే వారందరి మదిలో మెదులుతున్న ప్రశ్న. 131 రాజ్యాంగ సవరణ మహిళా బిల్లు ఆమోదం పొందకపోవడంపై రకరకాల అనుమానాలు ఉత్పన్నం అవుతున్నాయి. మహిళా బిల్లు వీగిపోవడం ఇప్పుడు కొత్తేం కాదు. సుమారు ఆరు ఏడుసార్లు అయింది. ఎన్డీయేకూటమి ఏమో మహిళా బిల్లుకు డీమేలిటేషన్ కలపడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని విపక్ష నేతలు వ్యతిరేకించి ఓటు వేశారని అర్థమైంది. పార్లమెంట్ ఈ బిల్లుకు అనుకూలంగా 298ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు రావడంతో ఆమోదానికి అవసరమైన మూడింట రెండు వంతు 352 మెజార్టీ దక్కలేదు. 2/3 మెజార్టీకి 54 ఓట్లు తక్కువ పడ్డాయి. మహిళా బిల్లు ఎన్డీయే కుట్రలో భాగమని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎందుకంటే ఈ బిల్లు 2011 జనాభా లెక్కల ప్రకారం డీమిలీటేషన్‌తో ముడిపెట్టి ఓటింగ్ పెట్టడమే తప్పిదమని, కేంద్రం చాణక్యనీతికి మించి అత్యుత్సాహం చూపుతుందని బలంగా వాదిస్తున్నారు ఇండియా కూటమి నేతలు. ఓబీసీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రిజర్వేషన్ పై కూడా స్పష్టత లేదు. కావునా విపక్షాలు మద్దతు తెలు పలేదు. మహిళా బిల్లును వ్యతిరేకించిన వారిని దేశ ప్రజలు క్షమించరని, మహిళలను ఓటు అడిగే నైతిక హక్కు లేదం టుంది ఎన్డీయే కూటమి. మహిళా బిల్లుపై ఎవ్వరికీ ఎంత భాధ్యత ఉంది అనేది భవిష్యత్తులో తేలనుంది. ఎవరి వాద నలు ఎలా ఉన్న మహిళలు చట్టసభలలోకి వెళ్లడం వారి హక్కు. ఇకనైనా మహిళలపై గౌరవంతో వీలైనంత త్వరగా మహిళా బిల్లు ఆమోదానికై కలిసి కట్టుగా పని చేయాలి. మహిళా బిల్లుకు చట్టబద్ధతకు ఎన్డీయే కూటమి ఆమోదించేలా ఒత్తిడి పెంచాల్సిన బాధ్యత విపక్షాలపై ఉంది. ఎవ్వరి పాత్ర వారు సమర్థవంతంగా నిర్వహించి చిత్తశుద్ధి కాపాడు కుంటారో ఆ పార్టీలను మహిళలోకం గుర్తిస్తుందని మారువ రాదు. దేశంలో కొన్ని రాష్ట్రాలు స్వయంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చిన వారి అధికారులను కూడా తమ ఇంట్లో వారు అధికార దర్పం చాటుకుంటున్నారు. మహిళ ప్రజా ప్రతినిధులకు పూర్తి స్వేచ్ఛలేదనే చెప్పవచ్చు. సమాన హక్కులతో పాటు చట్టసభల రిజర్వేషన్ కల్పించినప్పుడే మహిళలకు న్యాయం సంపూర్ణ జరుగుతుంది. కేంద్రప్రభుత్వం కూడా నిస్వార్థంగా మహిళా బిల్లును ఆమోదం తెలిపేలా చేసి ఉంటేమహిళల దృష్టిలో కేంద్రంపై ప్రత్యేకమైన ఆదరణ ఉండేదేమో. రాజకీయ దూరదృష్టితో మహిళా బిల్లుకు కావాలనే సంపూర్ణ మద్దతు తెలుపడం లేదా అనే ఆలోచన మేధావులు, రాజకీయ విశ్లేషకులు, విద్యావంతులలో వస్తుంది. ఎందుకంటే జనాభా, కులాల ప్రాతిపదికన రిజర్వేషన్‌అమలు చేయాలి అంటున్నాము.



చట్టసభలలో కూడా యాభైశాతం జనాభా ఉన్న మహిళలకు రిజర్వేషన్ ఎక్కడ ఉంది. వారికి రావాల్సిన వాటా హక్కు ఇవ్వాలి కదా. ఎందుకు జాప్యం చేస్తున్నారో ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఏదిఏమై నప్పటికీ మహిళా బిల్లు రావాలి. ఎందుకంటే శాసనాల నిర్మాణాల, అభివృద్ధిలో మాహిళల పాత్ర ఉండాలి. ఈ సృష్టిలో నింగి నుండి నేల వరకు మహిళా మణులు సేవలు అందిస్తున్నారు. రాజకీయాలలో మాత్రం మహిళలకు రావాల్సిన ముప్పైమూడు శాతం పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 1/3 వంతు సీట్లు రిజర్వేషన్ అమలు చేయాలి కానీ మహిళా బిల్లు సుదీర్ఘ కాలంగా ఆమోదం పొందలేక పోయింది. చివరగా మహిళలు చైతన్యం అవుతే తప్ప బిల్లు ముందుకు సాగదు. మహిళలు ఉద్యోగ విధులు నిర్వహించడమే కాకుండాఇంట్లో వారికి సేవలు అందిస్తూ సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్నారు అందుకే స్త్రీ అంటే అబల కాదు సబల కావాలంటూ వీర వనితలను ఆదర్శంగా చూపెడు తాం. అలాంటిది దేశ రాజకీయాల్లో ఆశించిన ప్రాధాన్యత లేకపోవడం గమనార్హం. ఎందుకంటే స్వాతంత్ర్య పోరాటం మొదలుకుని సామాజిక ఉద్యమాల వరకు శంఖారావం పూరించిన ఘనత స్త్రీలదే అని చరిత్ర తెలుపుతుంది. స్త్రీలు ఏకమై కదం తొక్కుతూ ఉప్పెనలా కదులుతేనే మహిళ బిల్లు ఆమోదానికి అడుగులు పడతాయి. మహిళలను గౌరవించుకుంటూ ప్రతి ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ఘనంగా నిర్వహిచుకుం టూ మహిళలో చైతన్యం రావాలని నినదిస్తూ మహిళ బిల్లుపై అధికార, ప్రతిపక్షాలు మాటలు కోటలు దాటుతాయి. ఆచరణలోకి వచ్చే సరికి శూన్యం. రాజకీయ పార్టీలు రాజకీ యాలకు అతీతంగా మహిళల అభ్యున్నతి ముఖ్యమని భావించినప్పుడే మహిళా బిల్లు ఆమోదం పొందే అవకాశం ఉంది. ప్రపంచ ఉద్యమాలలో మహిళ పాత్రనే కూడాకీలకమైంది, మహిళలు వారి హక్కుల కోసం ప్రశ్నించే గళంతో నినదించి పోరాడిన సందర్భాలు చూశాం. అదేఒరవడితో మహిళా బిల్లుకై ఒక్కటై పోరాడాలి. 1975లో ఐక్యరాజ్య సమితి మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగాప్రకటించి వారిహక్కుల కోసం పని చేస్తుంది, ప్రతి ఏటా మహిళల సాధికారతకై ఒక థీమ్ తీసుకువస్తూ వారి అభివృద్ధిని ప్రోత్సాహిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పురుషులకు దీటుగా పోటిపడి అవార్డులు, రివార్డులు సాధిస్తున్నా వారి హక్కులను కాలరాస్తున్నాం. పూర్వంనుండి గత దశాబ్దం క్రితం వరకు మాహిళలను ప్రధానంగా పట్టి పీడించిన కొన్ని రుగ్మతలు బాల్య వివాహాలు, దేవదాసి, సతీ సహగమనం, నిరక్షరాస్యత వంటివి వారివెనుకబాటుకు కారణమైనవని గతం తెలుపుతుంది. దశాబ్దాల కాలంతర్వాత మహిళలు చైతన్యం అవుతూ సమాజంలో ముందుకువెళ్తున్న తరుణంలో మహిళా రిజర్వేషన్ వారికి తోడ్పాటు అందిస్తే రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రగతి సాధిస్తారు. ఒక్కప్పుడు మహిళ అంటే వంట గదికే పరిమితం అనే ఆంక్షలను తెంచుకుని నేడు దేశ అభివృద్ధిలో మహిళలదే పై చెయ్యి ఉంది. మహిళ అంటే ఒక శక్తిగా భావిస్తూ మహిళా బిల్లుకు జనమంతా జాగృతమై మద్దతు తెలుపుదాం. మహిళల పురోగతికి కృషిచేసిన మహనీయుల ఆశయాలను గౌరవిస్తూ మహిళ సంక్షేమం, అభివృద్ధి చైతన్యాన్ని కాంక్షిస్తూ మహిళా బిల్లుకై ఏకమై ఉద్యమిద్దాం. ●

# ప్రధాని మోడీపై ప్రివిలేజ్ మోషన్

- దాఖలు చేసిన కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్
- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు నోటీసులు అందజేత



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** ప్రధానమంత్రి నరేంద్రమోడీపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేశారు. ప్రధానమంత్రి జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రతిపక్ష ఎంపీల ఓట్లను, ఉద్దేశాలను ప్రశ్నించారని, ఇది పార్లమెంటరీ నిబంధనలను ఉల్లంఘించడమేనని పేర్కొంటూ ఈ మేరకు మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ప్రివిలేజ్ నోటీసును సమర్పించారు. అలాగే ఓం బిర్లాకు లేఖ రాశారు. ఏప్రిల్ 18న ప్రధానమంత్రి టెలివిజన్‌లో జాతిని ఉద్దేశించి ప్రసంగించారని వేణుగోపాల్ తన లేఖలో పేర్కొన్నారు. తన దాదాపు 29 నిమిషాల ప్రసంగంలో, మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్ష పార్టీలు అడ్డుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. ఆయన ఎంపీల ఓటింగ్ సరళిని కూడా ప్రశ్నించారు. వారి నిర్ణయాల వెనుక ఉన్న ఉద్దేశ్యాలపై వ్యాఖ్యానించారు. వేణుగోపాల్ రూల్ 222 కింద ఈ నోటీసును దాఖలు చేశారు. ఈ విషయాన్ని లోక్‌సభ ప్రివిలేజెస్ కమిటీకి నివేదించాలని, ప్రధానమంత్రిపై చర్యలు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. స్పీకర్‌కు రాసిన లేఖలోని నాలుగు కీలకాంశాలను కెసి వేణుగోపాల్ లేవనెత్తారు. 1. ఇలాంటి ప్రకటనలు ఎన్నికైన ఎంపీల స్వాతంత్రం, సమగ్రతపై ప్రశ్నలను లేవనెత్తుతాయి, పార్లమెంట్ గౌరవం, అధికారాన్ని బలహీనపరుస్తాయి. 2. రాజ్యాంగం ఎంపీలకు స్వతంత్రంగా వ్యవహరించే హక్కును ఇస్తుంది. ప్రధానమంత్రితో సహా ఎవరూ వారి ఓటును లేదా ప్రవర్తనను ప్రశ్నించలేరు. 3.పార్లమెంటులో ఒక ఎంపీ ఒక నిర్దిష్ట పద్ధతిలో ఎందుకు మాట్లాడారో లేదా ఓటు వేశారో వివరించడం తప్పు. ఇది సభ హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడం, ధిక్కరించడం. 4.ఈ బిల్లును మహిళా రిజర్వేషన్ పేరుతో ప్రవేశపెట్టారు, కానీ ఇది డీలిమిటేషన్‌కు సంబంధించిన నిబంధనలను కూడా మార్చడానికి ప్రయత్నించింది. ఈ కారణంగా ప్రతిపక్షం దీనిని వ్యతిరేకించింది.

# మోడీ ఉగ్రవాది.. కాదు, అలా అనలేదు!



చెన్నైలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ చీఫ్ ఖర్గే - బిజెపి 'విస్తరణ కార్యాలయం' లా ఉన్నదని ఆరోపణ - అన్నా డిఎంకెతో బిజెపి పొత్తుపై విమర్శలు

**చెన్నై, ఏప్రిల్ 21:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎఐఎడిఎంకె- బిజెపి కూటమిని విమర్శిస్తూ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై 'ఉగ్రవాది' వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో రాజకీయ దుమారం చెలరేగింది. చెన్నైలో మంగళవారం ఉదయం విలేకరుల సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ, బిజెపితో పొత్తు పెట్టుకోవాలన్న ఎఐఎడిఎంకె నిర్ణయాన్ని ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. అన్నాదురై ఫొటోతో ఓట్లు అడిగే ఎఐడిఎంకె వాళ్లు మోడీతో చేతులు ఎలా కలిపారు? మోడీ ఒక టెర్రరిస్ట్. ఇడి, ఐటి, సిబిఐ వంటి సంస్థలను మోడీ తన చెప్పుచేతల్లో ఉంచుకున్నారు. డీలిమిటేషన్ బిల్లును కూడా ప్రధాని తన ఖాతాలో వేసుకోవాలనుకున్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించడం లేదని, అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బిజెపి)కి ఒక "విస్తరణ కార్యాలయం"లా ప్రవర్తిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తీవ్రంగా ఉల్లంఘిస్తున్నారని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు ఎన్నికల ప్రక్రియలోని నిష్పక్షపాతాన్ని దెబ్బతీస్తాయని, ఎన్నికల నిబంధనలను మరింత కఠినంగా అమలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై, కాంగ్రెస్ ఈ చట్టానికి స్థిరంగా మద్దతు ఇస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. అయితే, ఈ బిల్లును నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. "కాంగ్రెస్ గతంలో మహిళా రిజర్వే షన్ల బిల్లును ఆమోదించి, మొత్తం 543 లోక్‌సభ స్థానాల్లో దీనిని అమలు చేయాలని డిమాండ్ చేసింది. మేము వ్యతిరేకించింది బిల్లును కాదు, దానితో పాటు నియోజకవర్గాల పునర్విభజనను తీసుకురావాలనే ప్రయత్నాన్ని మాత్రమే" అని ఆయన అన్నారు. ఈ బిల్లుపై ప్రతిపక్షాల వైఖరి గురించి బిజెపి నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ) తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని ఆయన ఆరోపించారు. చట్టానికి మద్దతు కూడగట్టేందుకు, పార్లమెంట్ సభ్యులను ప్రలోభపెట్టి ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగాయని ఖర్గే ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రం "డబ్బు బలం, కండబలం, దర్యాప్తు సంస్థలను వాడుకుంటోంది" అని కాంగ్రెస్ అధినేత ఆరోపించారు. ఇలాంటి పద్ధతుల లక్ష్యం ప్రతిపక్ష పార్టీలను బలహీనపరచి, అధికారాన్ని పటిష్టం చేసుకోవడమేనని ఆయన స్పష్టం చేశారు. గత కొన్నేళ్లుగా ప్రజలకు మేలు చేయ డంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ, ఖర్గే ప్రధానమంత్రి పదవీకాల పనితీరును కూడా విమర్శించారు. సామాజిక న్యాయం, లౌకికవాదం, రాష్ట్ర హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్-డిఎంకె కూటమి కట్టుబడి ఉందని, తమిళనాడు ఓటర్లు ఆ కూటమికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. రాహుల్ గాంధీ ఈ విలువలకు ప్రతినిధి అని కూడా ఆయన పేర్కొన్నారు. ఖర్గే వ్యాఖ్యలను బిజెపి తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానమంత్రిని, దేశ ప్రజలను అవమానించేలా ఉన్న ఈ ప్రకటనను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ "సిగ్గుచేటు" అని అభివర్ణించి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అర్థవంతమైన చర్చలో పాల్గొనకుండా వ్యక్తిగత దూషణలకు పాల్పడటం ద్వారా కాంగ్రెస్ రాజకీయ చర్చల స్థాయిని దిగజార్చుతోందని ఆరోపిస్తూ, బిజెపి ఐటి సెల్ అధిపతి అమిత్ మాల్వీయా కూడా కాంగ్రెస్‌ను విమర్శించారు. ఖర్గే వ్యాఖ్యలపై రాజకీయ దుమారం చెలరేగింది. బిజెపి నాయకుల నుంచి వెంటనే తీవ్ర ప్రతిస్పందనలు వచ్చాయి. వ్యతిరేకతను ఎదుర్కొన్న ఖర్గే, ప్రధానమంత్రి రాజకీయ ప్రత్యర్థులను "బెదిరిస్తున్నారని" లేదా "భయపెడుతున్నారని" సూచించే ఉద్దేశంతో తాను ఆ వ్యాఖ్యలు చేశానని తర్వాత స్పష్టం చేశారు. అన్నాదురై ఫొటోతో ఓట్లు అడిగే ఎఐడిఎంకె వాళ్లు మోడీతో చేతులు ఎలా కలిపారు? మోడీ ఒక టెర్రరిస్ట్. ఇడి, ఐటి, సిబిఐ వంటి సంస్థలను మోడీ తన చెప్పుచేతల్లో ఉంచుకున్నారు.

డీలిమిటేషన్ బిల్లును కూడా ప్రధాని తన ఖాతాలో వేసుకోవాలనుకున్నారు. అందుకే నేను ఆయనను టెర్రరిస్ట్ అని అన్నాను. ఆయన పార్టీకి న్యాయం, సమానత్వంపై నమ్మకం లేదు. అలాంటి పార్టీతో ఎఐడిఎంకె పొత్తు పెట్టుకుంది. అంటే.. వీరంతా కలిసి ప్రజాస్వామ్యాన్ని బలహీనం చేస్తున్నారు.

## ఆరునెలల్లోగా గూర్ఖా సమస్యను పరిష్కరిస్తాం..

### తప్పుడు కేసులన్నీ ఎత్తివేస్తాం.. బెంగాల్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

**డార్జిలింగ్, ఏప్రిల్ 21:** పశ్చిమబెంగాల్‌లో ప్రభుత్వాన్ని బీజేపీ ఏర్పాటు చేయనుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. ముఖ్యమంత్రి మమతాబెనర్జీకి ఉద్వాసన చెప్పే సమయం ఆసన్నమైందని చెప్పారు. కుర్సెయోంగ్‌లో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, డార్జిలింగ్‌లో గూర్ఖా కమ్యూనిటీ చిరకాల సమస్యలకు సత్వర పరిష్కారం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన 6 నెలల్లోనే గూర్ఖాల సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారాన్ని అందిస్తాం. గత టీఎంసీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు గూర్ఖాల ఆందోళనలను పట్టించుకోవడంలో విఫలమయ్యాయని అమిత్‌షా అన్నారు. గూర్ఖాల చరిత్రను అణిచివేసేందుకు మమతా దీదీ ప్రయత్నించారని, గూర్ఖాలకు జరుగుతున్న అన్యాయాలకు ముగింపు పలికే సమయం వచ్చిందని అన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, టీఎంసీ మన కొండప్రాంతాలను రక్తంతో పెయింట్ వేశారని, గూర్ఖాలకు జరిగిన అన్యాయాలకు నరేంద్ర మోడీ నాయకత్వంలో తెరపడుతుందని చెప్పారు. గూర్ఖా సోదరులపై వందలాది తప్పుడు కేసులు పెట్టారు. వాటన్నింటినీ జూలై 31వ తేదీలోగా ఉపసంహరిస్తాం. గూర్ఖా ఉద్యమాన్ని వాళ్లు అణిచివేశారు. మేము ఆ కేసులన్నీ ఉపసంహరిస్తాం. ఇక నిరసనలకు తావులేని విధంగా సమస్యలను పరిష్కారిస్తామని అమిత్‌షా భరోసా ఇచ్చారు. సందేశ్‌ఖాలీ వంటి ఘటనలను అమిత్‌షా ప్రస్తావిస్తూ, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మహిళలపై నేరాలు పెరిగాయని, బీజేపీ అధికారంలోకి రాగానే ఆ నేరాలకు బాధ్యులైన వారందిరినీ జైళ్లకు పంపిస్తామని అమిత్‌షా చెప్పారు. కుర్సెయోంగ్, కుల్తి, సల్బోని, ఛాందిపూరూర్ తదితర కీలక ప్రాంతాల్లో అమిత్‌షా మంగళవారంనాడు సుడిగాలి ప్రచారం సాగించారు.కంద్ర మంత్రి అమిత్ షా తన ప్రసంగంలో ఎక్కడా నేరుగా గోర్ఖాల్యాండ్ కానీ ప్రత్యేక రాష్ట్రం గురించి కానీ ప్రస్తావించలేదు. కానీ డార్జిలింగ్ లోక్‌సభ స్థానం ప్రస్తుతం బీజేపీ ఆధీనంలో ఉన్నది. 2009 నుంచి అక్కడ ఆ పార్టీయే గెలుస్తోంది.

## మహిళా కోటాపై ఇదీ మా నిబద్ధత

- ప్రధాని మోడీకి 2017లో సోనియా లేఖ
- 2018 జులై 16న రాహుల్‌గాంధీ మరో లేఖ
- తక్షణమే మహిళా బిల్లు ఆమోదించాలని విజ్ఞప్తి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** మహిళా కోటాను అమలు చేయాలన్న తమ పదేపదే డిమాండ్లపై నరేంద్ర మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని కాంగ్రెస్ మంగళవారం ఆరోపించింది. డీలిమిటేషన్ నిబంధనను చేర్చి ఈ అంశాన్ని ఆలస్యం చేసేందుకు ఇటీవల ప్రయత్నించినప్పటి వరకు, ఈ విషయంపై పార్టీ సీనియర్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ రాసిన లేఖలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించింది. 2017 సెప్టెంబర్ 20న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సోనియా గాంధీ రాసిన లేఖ కాపీని పంపిణీ చేస్తూ, కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేష్ ఇలా అన్నారు. "2017లో, అప్పటి కాంగ్రెస్ అధ్యక్షురాలి హోదాలో సోనియా గాంధీ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం ప్రధాని నరేంద్ర మోడీకి కూడా లేఖ రాశారు. "కాంగ్రెస్ పార్టీ వైఖరి దృఢంగా, మార్పులేనిదిగా ఉంది. ఈ డిమాండ్‌పై నిద్రపోయినది మోడీ ప్రభుత్వమే, ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజనకు ముడిపెట్టి దానిని ఆలస్యం చేయడానికి ప్రయత్నించింది" అని ఆయన అన్నారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు ఓటమికి కాంగ్రెస్‌ను నిందించే ప్రయత్నాలను తిప్పికొట్టే క్రమంలో, అప్పటి పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కూడా 2018 జులై 16న ఈ విషయంపై ప్రధానికి లేఖ రాశారని రమేష్ 'ఎక్స్'లో తెలిపారు. ఆ లేఖలో రాహుల్ గాంధీ ఇలా రాశారు. "రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందేలా మీ మద్దతు కోరుతూ ఈ లేఖ రాస్తున్నాను. మీ అనేక బహిరంగ సభల్లో మహిళా సాధికారత పట్ల, వారిని ప్రజా జీవితంలో మరింత అర్థవంతంగా భాగస్వాములను చేయడం పట్ల మీకున్న అభిరుచి గురించి మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదానికి మీ బేషరతు మద్దతును అందించడం కంటే మహిళల అభ్యున్నతి పట్ల మీ నిబద్ధతను ప్రదర్శించడానికి ఇంతకంటే మంచి మార్గం ఏముంటుంది?" అని ఆయన రాశారు. "ప్రజలలో అవగాహన కల్పించి, వారి మద్దతు కూడగట్టేందుకు, కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లుకు మద్దతుగా 32 లక్షలకు పైగా భారతీయ మహిళల సంతకాలను సేకరించింది. ఈ సంతకాలను మీకు అప్పగిస్తూ, మహిళా రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందేలా మీ మద్దతును వినయపూర్వకంగా కోరుతున్నాము. తద్వారా మహిళలు 2019 సార్వత్రిక ఎన్నికలలో,

అలాగే ఈ ఏడాది చివర్లో జరిగే రాష్ట్ర ఎన్నికలలో మరింత అర్థవంతంగా పాల్గొనగలరు" అని ఆయన అన్నారు. "ఎనిమిదేళ్ల తర్వాత కూడా, డీలిమిటేషన్‌కు ముడిపెట్టి రిజర్వేషన్ల అమలును ఆలస్యం చేయాలని చూస్తున్న ప్రధానమంత్రి, ఈ డిమాండ్‌పై ఇంకా చర్యలు తీసుకోలేదు" అని రమేష్ అన్నారు.

## మంటల్లో పశ్చిమాసియా

### ఇరాన్ చమురు గమ్యస్థానం అమెరికానే: ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** అమెరికా-ఇరాన్ మధ్య రెండో విడత చర్చలపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇరాన్ చమురుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. ఆ దేశానికి చెందిన వందలాది చమురు నౌకలు అమెరికా వైపు వస్తున్నట్లు తెలిపారు. 'తమ చమురును అమెరికా తీసుకోవడానికి వీలుగా ఇరాన్ నాయకత్వమే నౌకలపై ఒత్తిడి తెచ్చింది. ఈ నౌకల గమ్యస్థానం టెక్సాస్, లూసియానా, అలాస్కా అయ్యే అవకాశం ఉంది' అని ట్రంప్ రాసుకొచ్చారు. అయితే, దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఆయన వెల్లడించలేదు. ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా గెలవనుందని ట్రంప్ పేర్కొన్నారు. అదే సమయంలో యుద్ధంపై తప్పుడు కథనాలు రాస్తోన్న అమెరికాకు చెందిన కొన్ని వార్తా సంస్థలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా సైనిక కార్యకలాపాలు చాలా బాగా సాగుతున్నాయంటూ ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. యుఎస్ దళాల పనితీరును అధ్యక్షుడు ప్రశంసించారు. ఒప్పందం కుదిరే వరకు ఇరాన్ నౌకల రాకపోకలపై దిగ్బంధనం కొనసాగుతోందని ఉద్ఘాటించారు. దిగ్బంధనంతో ఆ దేశానికి రోజుకు 500 మిలియన్ డాలర్లు నష్టమన్నారు. ఇదిలా ఉండగా.. పాకిస్థాన్ వేదికగా తమతో చర్చలకు ఇరాన్ వస్తుందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవేళ చర్చలకు రాకపోతే వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఓ ఇంటర్వ్యూలో హెచ్చరికలు చేశారు.

## మణిపూర్ మళ్లీ హింసాత్మకం.. భారీ ఎత్తున నిరసన ర్యాలీలు



**ఇంఫాల్, ఏప్రిల్ 21:** మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల జరిగిన వేర్వేరు హత్యలకు నిరసనగా రెండు ప్రధాన సంఘాలు పిలుపునిచ్చిన బంద్‌లతో రాష్ట్రంలోని లోయ, కొండ ప్రాంతాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. విద్యాసంస్థలు, మార్కెట్లు, ప్రజా రవాణా సేవలు నిలిచిపోయాయి. ఇంఫాల్ లోయలోని పలు ప్రాంతాల్లో నిరసనకారులు ధర్నాలు నిర్వహించారు. బిష్ణుపూర్ జిల్లాలో ఏప్రిల్ 7న జరిగిన బాంబు పేలుడు ఘటనలో నిద్రలో వున్న ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల చిన్నారి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు నిరసనగా మహిళా సంఘం మైరా పైబీలు ఐదు రోజుల ఆందోళనకు పిలుపునిచ్చింది. ఈ నిరసనల సందర్భంగా సీఆర్పీఎఫ్ క్యాంపుపై కొందరు దాడి చేయగా, భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు పౌరులు మరణించారు. మరోవైపు, ఈనెల 18న ఉఖ్రుల్ జిల్లాలో పౌరుల కాన్వాయ్‌పై మిలిటెంట్లు జరిపిన దాడిలో మాజీ సైనికోద్యోగి సహా ఇద్దరు మృతి చెందారు. దీనికి నిరసనగా యునైటెడ్ నాగ కౌన్సిల్ కొండ ప్రాంతాల్లో మూడు రోజుల సంపూర్ణ బంద్‌ను ప్రారంభించింది. ఈ రెండు ఘటనలతో రాష్ట్రంలో తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ హింసాత్మక ఘటనలపై న్యాయవాదులు కూడా నిరసన తెలిపారు. బాధ్యులను పట్టుకోవడానికి కూంబింగ్ ఆపరేషన్లు ముమ్మరం చేయాలని, కాల్పుల ఘటనపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు కేసులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కు అప్పగించింది. శాంతిభద్రతల పునరుద్ధరణలో కేంద్రం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. తక్షణమే చర్యలు చేపట్టి, బాధితులకు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేసింది.



## ఉదయనిధి స్టాలిన్ అఫిడవిట్‌పై ఐటిశాఖ అభ్యంతరం!

**చెన్నై, ఏప్రిల్ 21:** డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ ఎన్నికల అఫిడవిట్‌పై ఆదాయపన్ను శాఖ ఆరోపణలు చేసింది. రెడ్ గెయింట్ మూవీస్‌లో 7.36 కోట్లు పెట్టబడి పెట్టినట్లు 2021 ఎన్నికల అఫిడవిట్‌లో ఉదయనిధి స్టాలిన్ పేర్కొన్నారని, కానీ 2026 ఎన్నికల అఫిడవిట్‌లో ఆ అంశాన్ని ప్రస్తావించలేదని మద్రాసు హైకోర్టుకు ఆదాయపన్ను శాఖ తెలిపింది. అయితే ఆ కంపెనీలో ఉదయనిధి స్టాలిన్ భార్య పేరుపై సుమారు 2.63 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు తాజా ఎన్నికల అఫిడవిట్‌లో ఉన్నట్లు ఆదాయపన్ను శాఖ వెల్లడించింది. కానీ ఈ అంశాన్ని గత అఫిడవిట్‌లో ప్రస్తావించలేదని ఇన్‌కం ట్యాక్స్ చెప్పింది. ఎన్నికల అఫిడవిట్లు, ఆదాయ రికార్డుల్లో చాలా తేడా ఉన్నట్లు కౌంటర్ అఫిడవిట్ దాఖలైన కేసులో ఆదాయపన్ను శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. బ్యాంకు రుణాల అంశంలోనూ తేడా ఉన్నట్లు ఐటీశాఖ పేర్కొన్నది. బ్యాంకుల నుంచి 10 కోట్ల రుణం తీసుకున్నట్లు 2026 అఫిడవిట్‌లో ఉందని, కానీ 2021 అఫిడవిట్‌లో 11.06 కోట్ల రుణం తీసుకున్నట్లు ఉందని ఐటీశాఖ పేర్కొన్నది. కానీ కంపెనీ రికార్డుల ప్రకారం మాత్రం సుమారు 18 కోట్లు రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. గణాంకాల అంశంలో గందరగోళం ఉందని, ట్యాక్స్ రిటర్న్ను ఐటీఆర్2 ఫార్మాట్ కింద మళ్లీ ఫైల్ చేయాలని ఆదాయపన్నుశాఖ చెప్పింది.

## హార్ముజ్‌లో రవాణా పునరుద్ధరించండి : జిన్‌పింగ్



**బీజింగ్, ఏప్రిల్ 21:** ప్రస్తుతం హార్ముజ్ జలసంధి విషయంలో తీవ్ర ప్రతిష్టంభన నడుస్తోంది. అమెరికా, ఇరాన్ రెండు దేశాలు పట్టువదలకుండా భీష్మించుకొని కూర్చోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పందించారు. హార్ముజ్ జలసంధిలో రవాణాను పునరుద్ధరించాలని ఇరు దేశాలు యుద్ధాన్ని వీడి శాంతి బాట పట్టాలని హితవు పలికారు. ప్రస్తుతం యుద్ధం విషయంలో చైనాపై అమెరికా అనుమానం వ్యక్తం చేస్తోంది. యుఎస్ నిఘా ఏజెన్సీలు ఇరాన్‌కు చైనా ఆయుధాల తరలిస్తోందని సమాచారం అందించాయి. వాటిలోనూ మ్యాన్‌పాడ్ (భుజంపై మోసుకెళ్లగలిగే ఆయుధాలు) తరలింపు చేపడుతోందని, వీటితోనే అమెరికా క్షిపణులపై ఇరాన్ దాడి చేయగలిగిందని పేర్కొన్నాయి. అయితే దీనిని చైనా ఖండించింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ తొలిసారిగా హార్ముజ్ విషయంలో స్పందించారు. ఈ మేరకు సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇరు దేశాలు శాంతి కోసం వివాదాలను, రాజకీయ, దౌత్యమార్గాల్లో పరిష్కరించుకోవాలని, తక్షణమే సమగ్ర కాల్పుల విరమణ జరగాలని జిన్‌పింగ్ కోరినట్లు బీజింగ్ కథనాలు వెల్లడించాయి. హార్ముజ్ జలసంధి తెరిచి ఉండటం అంతర్జాతీయ సమాజంతోపాటు ఎంతో ప్రయోజనకరమని కోరినట్లు తెలుస్తోంది.

### ఓట్లలెక్కింపు వరకూ స్ట్రాంగ్‌రూమ్‌లు తెరవద్దు

#### ఎన్నికల సంఘం ఆదేశాలు

**తిరువనంతపురం, ఏప్రిల్ 21:** కేరళలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల కమిషన్ మంగళవారంనాడు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఓట్ల లెక్కింపు ముందువరకూ ఎట్టి పరిస్థితుల్లోనూ స్ట్రాంగ్ రూమ్‌లు తెరవరాదని ఆదేశాలిచ్చింది. కోజికోడ్‌లోని పెరంబ్ర నియోజకవర్గంలో ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్‌రూమ్‌ను తెరిచారని, పాలక్కాడ్‌లోని నెన్మర నియోజకవర్గంలో మరో స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచేందుకు ప్రయత్నించారని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కేరళ చీఫ్ ఎలక్టోరల్ అధికారి రతన్ యు కేల్కర్ తాజా ఆదేశాలు జారీ చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌లు కానీ, సీల్‌వేయని రూములు కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవవద్దని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ సమగ్రత, పారదర్శకత, భద్రతను పరిరక్షించేందుకు అధికారులంతా ఈ సూచనలను పాటించాలని కోరారు. ఏ ఒక్క స్ట్రాంగ్ రూమ్‌ను తెరవలేదని కోజికోట్ జిల్లా యంత్రాంగం వివరణ ఇచ్చింది. పోలింగ్ రికార్డుల వెరిఫై, అప్‌డేట్ కోసం సీల్ చేయని మెటీరియల్ రూమ్‌ను అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో తెరిచినట్టు జిల్లా ఎన్నికల అధికారిగా కూడా ఉన్న కలెక్టర్ స్నేహిల్ కుమార్ సింగ్ తెలిపారు. బిల్డింగ్ మొదటి అంతస్తులోని సీల్ వేసిన గదిలో ఈవీఎంలు, వీవీపాట్‌లు ఉన్నాయని, కేంద్ర పరిశీలకులు, అభ్యర్థుల ఏజెంట్ల పర్యవేక్షణలో ఉన్న ఈ సీల్డ్ గదిని ఎవరూ తెరవలేదని చెప్పారు. 140 నియోజకవర్గాలున్న కేరళ అసెంబ్లీకి పోలింగ్ ఏప్రిల్ 9న జరిగింది. మే 4న ఫలితాలు వెలువడతాయి.


## ఈశాన్యరాష్ట్రాలను వణికించిన భూకంపం



**ఇంఫాల్, ఏప్రిల్ 21:** ఈశాన్య రాష్ట్రాలను మంగళవారం 5.2 తీవ్రతతో సంభవించిన భూకంపం వణికించింది. మంగళవారం ఉదయం మణిపూర్ కేంద్రంగా భూకంపం సంభవించింది. ఆ భూకంపం ప్రభావంతో మణిపూర్‌తోపాటు నాగాలాండ్, అస్సాం , మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్‌రాష్ట్రాల్లోనూ భూమి కంపించింది. తెల్లవారుజామున ప్రజలంతా నిద్రలో ఉండగా ఈ ఘటన జరగడంతో జనం భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 5:59 గంటలకు ఈ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత 5.2గా నమోదైంది. భూకంప కేంద్రం మణిపూర్‌లోని కామ్‌జాంగ్ జిల్లాలో భూమికి 62 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

## ఇరాన్ నౌకలో క్షిపణి రసాయనాలున్నాయ్..

### అమెరికా రిపబ్లికన్ లీడర్ నిక్కీ హేలీ



**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. హార్మ్యాజ్ జలసంధిలో అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఉల్లంఘించి ప్రయాణిస్తున్న ఇరాన్ నౌకను అమెరికా నౌకాదళం స్వాధీనం చేసుకుంది. చైనా నుంచి వస్తున్న ఈ నౌకలో క్షిపణుల కోసం ఉద్దేశించిన రసాయన సామగ్రి ఉందని రిపబ్లికన్ పార్టీ నేత, భారత సంతతికి చెందిన నిక్కీ హేలీ సంచలన ఆరోపణలు చేశారు. ఈ వారాంతంలో హార్మ్యాజ్ జలసంధిలో అమెరికా పట్టుకున్న నౌక, చైనా నుంచి ఇరాన్‌కు వెళ్తోంది. ఇందులో క్షిపణుల కోసం రసాయన సామగ్రి ఉంది. ఆగమని పదేపదే హెచ్చరించినా అది ఆగలేదని నిక్కీ హేలీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇరాన్ పాలనకు చైనా మద్దతిస్తోందన్న వాస్తవాన్ని ఇకపై విస్మరించలేమని ఆమె వ్యాఖ్యానించారు. అమెరికా దళాలు టౌస్కా అనే ఇరాన్ జెండా ఉన్న కంటైనర్ షిప్‌ను గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఇరాన్‌కు చెందిన చాబహార్ పోర్ట్ సమీపంలో అదుపులోకి తీసుకున్నాయి. ఈ నౌక ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ షిప్పింగ్ లైన్స్ (ఐఆర్ఐఎస్ఎల్) సమూహానికి చెందింది. అమెరికా చర్యను ఖిసాయుధ దోపిడీఖిగా ఇరాన్ అభివర్ణించింది. దిగ్బంధనాన్ని ఎత్తివేసే వరకు చర్చలకు హాజరుకాబోమని స్పష్టం చేసింది. ఈ నౌకలో సైనిక, పౌర అవసరాలకు వాడే ద్వంద్వ వినియోగ వస్తువులు ఉండవచ్చని అమెరికా భద్రతా వర్గాలు ప్రాథమికంగా అంచనా వేస్తున్నాయి. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి సహాయం చేస్తోందన్న ఆరోపణలతో అమెరికా ఇప్పటికే 2019లో ఐఆర్ఐఎస్ఎల్ సంస్థపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.

# మోయెర్స్ గురుద్వారాలో రెండు సిక్కువర్గాల ఘర్షణ

**11 మందికి తీవ్ర గాయాలు**

**మోయెర్స్(జర్మనీ), ఏప్రిల్ 21:** జర్మనీలోని మోయెర్స్ నగరంలో ఉన్న ఓ గురుద్వారాలో రెండు వర్గాల మధ్య జరిగిన హింసాత్మక ఘర్షణలో కనీసం 11 మంది గాయపడ్డారు. గురుద్వారాలో ఆధిపత్యం, నిధుల నియంత్రణ వంటి అంశాలే ఈ ఘర్షణకు దారితీసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రార్థనా మందిరంలో రెండు గ్రూపుల మధ్య మాటామాటా పెరిగి అది కాస్తా తీవ్ర ఘర్షణకు దారితీసింది. దాదాపు 40 మంది ఈ గొడవలో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు కత్తులు, కిర్పాన్ల వంటి పదునైన ఆయుధాలతో దాడి చేసుకున్నారు. కొందరు పెప్పర్ స్ప్రే కూడా ఉపయోగించారు. ఘర్షణకు సంబంధించిన భయానక దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ప్రత్యేక వ్యూహాత్మక విభాగాలు సహా భారీ ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కొత్త డైరెక్టర్ల బోర్డు ఎన్నిక, గురుద్వారా నిధులపై నియంత్రణ వంటి విషయాల్లో మాజీ, ప్రస్తుత బోర్డు సభ్యుల మధ్య కొంతకాలంగా విభేదాలు ఉన్నాయని, అవే ఈ దాడికి కారణమై ఉండవచ్చని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇది పక్కా ప్రణాళికతో జరిగిన దాడి. ప్రార్థనలు మొదలవడానికి ముందే దాడి చేసిన వారు పెప్పర్ స్ప్రే చల్లారు. వారిలో ఒకరు తుపాకీతో కాల్పులు జరపగా,

మరికొందరు కత్తులతో దాడి చేశార ని ఓ వ్యక్తి వివరించారు. గాయపడిన వారికి అక్కడికక్కడే వైద్య సిబ్బంది చికిత్స అందించారు. ఎవరి ప్రాణానికీ ప్రమాదం లేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఒక అనుమానితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ఘటనా స్థలంలో లభించిన తూటా కేసింగ్‌ల ఆధారంగా అది బ్లాంక్‌ఫైరింగ్ పిస్టల్ అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. తుపాకీని ఇంకా స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. ఈ ఘటనపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ విభాగం దర్యాప్తు చేస్తోంది.

## 2023 మహిళా బిల్లును కేంద్రం అమలుచేయాలి: ఎర్రబెల్లి స్వర్ణ

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మహిళా రిజర్వేషన్ను 2023 చట్టం ప్రకారం ప్రస్తుత 543 లోక్‌సభ సీట్లలోనే అమలు చేయాలని, వెంటనే పార్లమెంట్‌ను నియోజకవర్గాల పునర్విభజనతో సంబంధం లేకుండా బిల్లును తీసుకొని రావాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలంటూ మంగళవారం గాంధీభవన్ లో మహిళా ఆరక్షణ్ బిల్ ఆజ్ కరో అభి కరో అనే నినాదంతో పోస్ట్‌కార్డుపై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టి ప్రధానమంత్రి ఆఫీస్‌కి పంపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ పార్లమెంట్ 2023 సెప్టెంబర్‌లో ఏకగ్రీవంగా ఆమోదించిన "నారీ శక్తి వందన్ అధినియమ్ 2023"ను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. మహిళా రిజర్వేషన్ కోసం కొత్త జనగణన, డీలిమిటేషన్ పేరుతో కాలయాపన చేయకుండా 2023 చట్టాన్ని ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లకు వర్తింపజేసి, 2029 సార్వత్రిక ఎన్నికల నుండే 33 సీట్లు మహిళలకు కేటాయించాలని డిమాండ్ చేయాలని అన్నారు. మహిళా రిజర్వేషన్‌ను డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం దక్షి ... ది, ఈశాన్య, చిన్న రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్ర. కుల గణన లేకుండా ఎన్నికల మ్యాపును మార్చే ప్రయత్నాన్ని మేము అంగీకరించమని అన్నారు. ఆనమేయాలపై చేసే నియోజకవర్గ పునర్విభజన చేపట్టడం సమాఖ్య స్ఫూర్తికి, రాజ్యాంగానికి వ్యతిరేకమని అన్నారు. 2023 మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ప్రస్తుత సీట్ల ప్రకారం అమలు చేసేందుకు కేంద్రం ఏసవరణలు తీసుకొచ్చినా ఇండియా కూటమి పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. 33 రిజర్వేషన్‌లో ఎస్సీ, ఎస్టీ మహిళలతో పాటు ఓబీసి మహిళలకు కూడా సబ్‌కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం లేని మహిళా రిజర్వేషన్ అసంపూర్ణమనీ ఆమె అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారత విషయంలో మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనీఆరోపించారు. మాటలు చెప్పి మోసం చేయడం, "తమాషా" చేయడం మానేసి, ఆమోదం పొందిన చట్టాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. 2023 చట్టం కోసం ఎంతో మంది ఐదు,పదేళ్ళ ఏళ్ళ వేచి చూడాల్సిన అవసరం లేకుండా పొరవ పాలకపార్టీ బిజెపి తీసుకోవాలి. దేశ మహిళల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రస్తుత 543 సీట్లలో 181 సీట్లను మహిళలకు కేటాయించి 2029 ఎన్నికలను నిర్వహించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామనీ,బిజెపి స్వార్థం కోసమే మహిళా బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టిందని2023 సెప్టెంబర్‌లోనే నారీ శక్తి వందన్ అధినియమ్ ఆమోదం పొందినా, దాన్ని వెంటనే అమలు చేయకుండా జనగణన, డీలిమిటేషన్ పేరుతో 10 ఏళ్ల వాయిదా వేయడం బిజెపి దురుద్దేశాన్ని బయటపెడుతోందనీ విమర్శించారు. కుల గణన జరిగితే ఓబీసి ల వాస్తవ సంఖ్య బయటపడుతుందని, సామాజిక న్యాయం కోసం డిమాండ్ పెరుగుతుందని బిజెపి భయపడుతోంది. అందుకే కుల గణన లేకుండా డీలిమిటేషన్ చేసి, ఎన్నికల మ్యాపును తనకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

# 'మహిళా ఆరక్షణ్ బిల్ ఆజ్ కరో, అభి కరో' పోస్ట్‌కార్డు ఉద్యమం



మంగళవారం గాంధీభవన్‌లో 'మహిళా ఆరక్షణ్ బిల్ ఆజ్ కరో, అభి కరో' నినాదంతో పోస్ట్‌కార్డుపై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టిన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

## మేఘాలయ పర్యటనకు మంత్రి సీతక్క
### అక్కడి అంగన్‌వాడీ సేవలపై అధ్యయనం

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మేఘాలయ రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆ రాష్ట్రంలో పర్యటించనున్నారు. మేఘాలయకు పర్యటనకు బుధవారం ఆమె వెళ్లనున్నారు. స్టేట్ టు స్టేట్ భాగస్వామ్య కార్యక్రమంలో భాగంగా రెండు రోజులపాటు అక్కడి కార్యక్రమాలను పరిశీలించనున్నారు. ఈ పర్యటనలో మహిళా శిశు అభివృద్ధిరంగంలో మేఘాలయ అమలు చేస్తున్న పలు పలు కార్యక్రమాలను అధ్యయనం చేయనున్నారు. ముఖ్యంగా మిషన్ 1000 డేస్, ఎర్లి చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ (ఇసిడి) కార్యక్రమాలు, అంగన్‌వాడి కేంద్రాల అభివృద్ధి తదితర అంశాలను పరిశీలించనున్నారు. మహిళా శిశు సంక్షేమంపై ఎసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, ఇతర సాంకేతిక భాగస్వామ్య సంస్థలు నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. ఈ పర్యటనలో తెలంగాణ మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ శృతి ఓజా కూడా మంత్రితోపాటు పర్యటించనున్నారు. మేఘాలయలో అమలవుతున్న కార్యక్రమాల ద్వారా అంగన్‌వాడి కేంద్రాలను కేవలం పోషకాహారం పంపిణీ కేంద్రాలుగా కాకుండా, పిల్లల సమగ్ర అభివృద్ధికి వేదికలుగా మార్చుతున్నారు. మాతా శిశు ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్యను కలగలిపిన సమగ్ర విధానంతో ఆ రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు పొందింది. తల్లిదండ్రులకు శిశు సంరక్షణ, పోషణపై అవగాహన పెంపు, రియల్‌టైమ్ మానిటరింగ్ కోసం డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థల వినియోగం, సంప్రదాయ అంగన్‌వాడి కేంద్రాలను హ్యాపినెస్ సెంటర్లుగా మార్చడం వంటి చర్యలు మంచి ఫలితాలిస్తున్నాయి. గర్భిణీలు, శిశువులకు పోషకాహారం అందజేయడంతోపాటు స్థానిక మహిళా సంఘాలు, సంక్షేమ, వైద్య, విద్య, గ్రామీణాభివృద్ధిశాఖల సమన్వయంతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేఘాలయ రాష్ట్రం అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను తెలుసుకుని, తెలంగాణలో అంగన్వాడీ సేవలను బలోపేతం చేసే లక్ష ్యంతో మంత్రి సీతక్క ఆ రాష్ట్ర పర్యటంలో పర్యటించాలని నిర్ణయించారు.

**బిఆర్ఎస్ హయాంలో నెలల తరబడి**
**రైతు బంధు ఆలస్యం: మంత్రి సీతక్క**

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టిదని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఆలస్యంగా రైతు భరోసా నిధులను విడుదల చేస్తున్నారని జగిత్యాల సభలో మాజి సిఎం కెసిఆర్ విమర్శించడం సరికాదన్నారు. వాస్తవానికి గత కెసిఆర్ ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగానే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తేల్చి చెప్పారు.ఈ విషయమై మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్ ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. బిఆర్ఎస్ హయాంలోనూ ఏనాడు రైతులకు సకాలంలో పంట పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయలేదన్నారు. 2018ల6 161 రోజులు, 2022-23లో యాసంగిలో 148 రోజులపాటు రైతుబంధు పంపిణీ చేశారని దుయ్యబట్టారు.



## యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలి
### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై విస్తృత అవగాహన కల్పించాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌జిల్లా అధికారులను ఆదేశించారు. యువత భవిష్యత్తు దృష్ట్యా వెనుకబడిన వర్గాలకు చెందిన యువకులు, యువతులు ప్రభుత్వం అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, స్వయం ఉపాధి పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వెల్ఫేర్ వీక్‌లో భాగంగా మంగళవారం జిల్లా స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలో భారీ స్థాయిలో జిల్లా స్థాయి నైపుణ్యాభివృద్ధి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శిక్షణ విభాగం, నైపుణ్యాభివృద్ధి సంస్థలు, బ్యాంకులు, విద్యాసంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు సమన్వయంతో పాల్గొనాలని సూచించారు. ప్రతి శాఖ తమ పరిధిలో అమలవుతున్న శిక్షణ కార్యక్రమాలు, అర్హతలు, ఎంపిక విధానం, ఉపాధి అవకాశాలను స్పష్టంగా ప్రజలకు వివరించాలన్నారు. శిక్షణ పొందిన యువత విజయ గాథలను ప్రదర్శించి, ఇతరులకు ప్రేరణ కల్పించాలన్నారు. ప్లేస్‌మెంట్ అవకాశాలు, పరిశ్రమల అవసరాలు, భవిష్యత్ నైపుణ్యాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమ స్థలంలోనే స్పాట్ రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించి, నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. అందిన దరఖాస్తులను డిజిటల్ డేటాబేస్‌గా రూపొందించి, అభ్యర్థుల అర్హతలకు అనుగుణంగా తక్షణ శిక్షణకు అనుసంధానం చేయాలన్నారు. మహిళా యువత, గ్రామీణ యువత, దివ్యాంగులు ప్రత్యేకంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాల అనంతరం సమగ్ర నివేదికను ఈనెల 27లోపు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

# కెసిఆర్ వచ్చేదిలేదు.. హైడ్రాను ఎత్తేసేది లేదు
### ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** కెసిఆర్ అధికారంలోకి తిరిగి వచ్చేది లేదు, హైడ్రా ఎత్తేసేది లేదు బిఆర్ఎస్ బతికి బట్టకట్టలేదనీ,బిఆర్ఎస్ రావాలని ఎవరూ కోరుకోవడం లేదనీ ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. మంగళవారం సిఎల్‌పి మీడియా సెంటర్ లో మాట్లాడతూ హైదరాబాద్ లో హైడ్రా 50 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడిందనీ గణాంకాలతో వివరించారు. కెసిఆర్ పదేళ్లలో అనేక హమీల ఎగ్గొట్టాడని దళిత సిఎం మూడెకరాలు భూమి వంటి అనేకం ఆయన ఖాతాలో ఉన్నాయని చెప్పారు.మంచి చేస్తున్న మా సీఎం పైన ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదనీ పెద్ద మనిషిగా కెసిఆర్ గౌరవం పోగొట్టుకోవద్దనీ హితవు చెప్పారు 2023 లో చుట్టు ఉన్న వాళ్ల కెసిఆర్ ను ముంచుతారని వాళ్ల మాటలు వింటే భవిష్యత్తులో మరో గుండు సున్నా వస్తుంది జాగ్రత్త అని హెచ్చరించారు. విషపూరిత పదజలాన్ని కెసిఆర్ వాడకపోవడం మంచిదనీ మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బదనాం చేయాలని కెసిఆర్ విషం చిమ్మాడిన ఆరోపించారు. కెసిఆర్ నోటి నుంచి చురకలు రావడంతో అలిశెట్టి ప్రభాకర్ ఆత్మ ఘోషిస్తుందనీ అన్నారు. కెసిఆర్ చేత పార్టీ లో అవమానించ బడిన వారి లిస్టు రాస్తే రామాయణం అంత ఉంటుందనీ అన్నారు. విజయశాంతి, ఈటెల రాజేందర్ , నాగం జనార్దన్ రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి , రవీంద్రనాయక్ లాంటి వాళ్లను కెసిఆర్ అవమానించాడనీ చెప్పారు.తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన వాళ్లతో కెసిఆర్ కనీసం మాట్లాడలేదు,ఆయనకు మనుషుల విలువ తెలియదనీ విమర్శించారు.

మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీళ్ల ఇవ్వకపోతే ఓట్లు అడగనని కెసిఆర్ ఆ నాడు చెప్పాడు.. నా నియోజకవర్గంలో మిషన్ భగీరథ పైన బహిరంగ చర్చకు నేను సిద్ధమా అని ఆయన ప్రశ్నించారు. నా నియోజకవర్గంలో ఒక గ్రామంలో ఇంటింటికి నీళ్ల ఇచ్చినట్లు నిరూపిస్తే నేను రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాల్ చేశారు . గొర్రెల స్కాం, లిక్కర్ స్కాం, చేపల స్కాం, దళిత బంధు స్కాం..కెసిఆర్ ప్రభుత్వం అంటేనే స్కాంలు, స్కీంలు.. అమరవీరుల స్థూపంతో సహా అన్నింట్లో అవినీతి చేశారనీ ఆరోపించారు. 20 సార్లు దండం పెట్టినా నాకు పార్టీ సభ్యత్వం కూడా ఇవ్వలేదనీ జీవన్ రెడ్డి ఆయన వద్ద నీకు మూడునాళ్ల ముచ్చటే గా మిగులుతోందని జోస్యం చెప్పారు. .హైదరాబాద్‌లో 28 వేల అక్రమ కట్టడాలు న్నాయి, వాటిని కూల్చి వేస్తామని అధికారంలో ఉన్నప్పుడు కెసిఆర్ స్వయంగా చెప్పారనీ గుర్తుచేశారు.మూసీ నది ప్రక్షాళన చేయడం మీకు ఇష్టంలేదా నల్లగొండ జిల్లా రైతులు మురికి కూపంలో ఉండాలా అని ప్రశ్నించారు.

## జీవన్‌రెడ్డి పెద్ద ఫ్యూడల్, గాలివీస్తే గెలిచే నాయకుడు: కవ్వంపల్లి సత్యనారాయణ

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** జీవన్‌రెడ్డి ఒక పెద్ద ఫ్యూడల్ అడ్లూరి లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడయ్యాక కనీసం ప్రెస్‌మీట్ పెట్టనివ్వ లేదని, మంత్రి అయ్యాక కనీసం సన్మాన కార్యక్రమం కూడా జీవన్‌రెడ్డి పెట్టనివ్వలేదని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణ ఆరోపించారు. జీవన్‌రెడ్డి అనేకసార్లు టికెట్ ఇచ్చి ఆర్థిక సహాయం చేసినా గెలవలేదనీ ఆరోపించారు. గాలివస్తే గెలిచే నాయకుడు జీవన్ రెడ్డి అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని, సిఎం రేవంత్ రెడ్డి పైన మాట్లాడితే సహించం అని హెచ్చరించారు. కబ్జా కోరుల పైన హైడ్రా యుద్ధం చేస్తోందనీ తెలిపారు. ధరణి పేరు మీద భూముల చెరపట్టారనీ దీనితో హైడ్రా అంటే కెసిఆర్ కుటుంబానికి భయం, వణుకు అన్నారు. కెసిఆర్ జీవితం అంతా అబద్దాలే,దళిత సిఎం దళిత మూడెకరాలు, నిరుద్యోగభృతి, ఇంటికో ఉద్యోగం ఇలా కెసిఆర్ అనేక మోసాలు చేశాడనీ తెలిపారు. కెసిఆర్ చేసిన అప్పుల ఊబిలో తెలంగాణ ఉందనీ ఆవేదనచెందారు. 2018 లో ఓట్ల రోజు కెసిఆర్ రైతు బంధు ఇచ్చాడు, రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చింది, కొనుగోలు సెంటర్లు పెట్టింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ఆయన అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. రైతులకు కోసం కేసిఆర్ చేసిందిఏమీలేదు అని అన్నారు. తరుగు పేరుతో 10 కిలోలు తీసినా పట్టించుకోలేదు కెసిఆర్ నియంత్రత్వాన్ని ప్రజలు చవిచూశారనీ తెలిపారు. ధర్నాచౌక్ ఎత్తివేసిన విషయాన్ని మరిచిపోవద్దనన్నారు. ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచి నాదెండ్ల భాస్కర్ రావుతో జతకట్టిన చరిత్ర జీవన్ రెడ్డిదన్నారు. 40 యేళ్ల కాంగ్రెస్ సొమ్ము తిన్నాడు జీవన్‌రెడ్డి ఒక్క లీడర్‌ను కూడా తయారుచేయలేదు. జగిత్యాల నాయకులు, కార్య కర్తలను ఎదగనివ్వలేదు ఎస్సీ సెల్ కమిటీని రద్దు చేస్తున్నామని త్వరలో కొత్త కమిటీని ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు.



## సిఎం రేవంత్‌రెడ్డితో సురేష్ బత్తిని భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 21:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని జూబ్లీ హిల్స్ నివాసంలో ఆదాయపు పన్ను (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సురేష్ బత్తిని మంగళవారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు పలువురు ఉన్నతాధికారులు కూడా కలిశారు. ఆదాయపు పన్ను ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా ఇటీవలే నియమితులయ్యారు.

## టిజిఆర్‌జెసి ఎంట్రన్స్‌టెస్ట్‌కు 76,173 దరఖాస్తులు
### 27న హాల్‌టికెట్లు విడుదల.. మే 3న పరీక్ష

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జనరల్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలతోపాటు, 93 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాల యాలు (కేజీబీవీ)ల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే టిజి ఆర్‌జేసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజిఆర్‌జేసీ సెట్)-2026కి 76,173 దరఖాస్తులు వచ్చాయి. ఇందుకు సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 27 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలంగాణ గురుకుల సొసైటీ సెక్రటరీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 3న పరీక్షను నిర్వహించనున్నారు. టిజిఆర్‌జేసీ సెట్- 2026 ద్వారా 35 తెలంగాణ గురుకుల (రెసిడెన్షియల్) జూనియర్ కాలేజీల్లో, 93 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, (ఇంగ్లీషు మీడియం. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో) ప్రవేశము కొరకు పరీక్షను నిర్వహించనున్నట్టు తెలిపారు. 2026 మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులు. 35 గురుకుల కాలేజీల్లో 3000 సీట్లు అందుబాటులో ఉండగా.. 93 కేజీబీవీల్లో 3700 సీట్లు అందుబాటులో ఉన్నట్టు సెక్రటరీ తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, హనుమకొండ, ఖమ్మం, నల్గొండ, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో, అభ్యర్థులకు 320 సెంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని, పరీక్ష తేదీకి ఒకరోజు ముందుగానే వెళ్లి చూసుకోవాలని సూచించారు. మే 3న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగనుందని రమణకుమార్ ప్రకటనలో తెలిపారు.

## జీవన్‌కు కెసిఆర్ చేతిలో భంగపాటు తప్పదు
### నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి ఎద్దేవా

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రావణుడి చేతిలో విభీషణుడు భంగపడ్డట్లు జీవన్ రెడ్డి కూడా కెసిఆర్ చేతుల్లో మోస పోవడం ఖాయమంటూ నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి జోస్యం చెప్పారు. మంగళవారం మల్లు రవి విడియో సందేశ ప్రకటన విడుదల చేస్తూ కాంగ్రెస్ పై కెసిఆర్ జీవన్ రెడ్డి లు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కెసిఆర్‌కు నమ్మించి మోసం చేయడం వెన్న తో పెట్టిన విద్య అని జీవన్‌రెడ్డిని జాగ్రత్తగా ఉండాలని హితవు చెప్పారు. కెసిఆర్ వలన ఏమి ఉపయోగం లేదని ఎన్నికల్లో ప్రూవ్ అయిందనీ తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారనీ చెప్పారు. కెసిఆర్ ఎన్ని మాటలు మాట్లాడిన ప్రజా ప్రభుత్వానికి ఏమి కాదనీ ధీమా వ్యక్తంచేశారు.42 ఏండ్లు జీవన్ రెడ్డి కాంగ్రెస్ లో అనేక పదవులు అనుభవించి ఇప్పుడు కాంగ్రెస్ ను విమర్శించారనీ దుయ్యబట్టారు. తాను చెప్పినట్లు కాంగ్రెస్ వినలేదని కాంగ్రెస్ ను వీడి పోయిండనీ అన్నారు. 42 ఏండ్ల వ్యక్తి గత ప్రతిష్టను జీవన్ రెడ్డి దిగజార్చుకుండని విమర్శించారు. లెఫ్ట్ భావాలు ఉన్న జీవన్ రెడ్డి లో బిఆర్ఎస్‌లో చేరడం దురదృష్టకరమనీ తెలిపారు. కాంగ్రెస్ గురించి జీవన్ రెడ్డి ఎన్ని సార్లు మాట్లాడితే అన్ని సార్లు ఆయనను ఆయన తిట్టుకున్నట్లే అని చెప్పారు.

## హారీశ్‌రావు బిజెపిలో చేరడం ఖాయం: ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** జగిత్యాల సభ రోజునే కెటిఆర్‌కు జ్వరం వస్తది,హరీష్ రావు ఢిల్లీ పోతడు ఇదంత చూస్తే బిఆర్ఎస్‌లో ఎవరికి ఎవరు పడని పరిస్థితి నెలకొందని హరీష్‌రావు బిజెపిలో చేరుడు ఖామని అనిపిస్తోందని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ చెప్పారు. మంగళవారం సిఎల్‌పి కార్యాల యంలో విలేఖరులతో మాట్లాడుతూ హరీష్ రావు బండారం బయటపడేసరికి కొత్త కథలు చెపుతున్నాడనీ ఎద్దేవా చేశారు. ఢిల్లీ టూర్‌తో దొరకడంతో కప్పిపుచ్చుకునేందుకు ఇప్పుడు కాళేశ్వరం కథలు చెపుతున్నాడనీ అపహాస్యాం చేశారు. కోర్టు తీర్పు వచ్చిన తర్వాత అప్పీల్ కు పోతారు, కాని ముందే ఎందుకు హడావుడి చేస్తున్నారనీ అనుమానం వ్యక్తం చేశారు. కెసిఆర్ బహిరంగ పేరు తో ఒక వైపు డ్రామాలు చేస్తుంటే మీరు బిజెపి కథలు మొదలు పెట్టారనీ అన్నారు. కాళేశ్వరాన్ని నిపుణుల కమిటీ పరిశీలనకు వచ్చిన రోజే మీరు జీవన్ రెడ్డి జాయినింగ్ కార్యక్రమం పెట్టారనీ ఆరోపించారు. కెసిఆర్ రేంజ్ ఫామ్ హౌస్ రేంజ్ మాత్రమే అని వివరించారు.రెండున్నర యేళ్లలో మూడు సార్లు మాత్రమే బయటకు వచ్చే రేంజ్ అని అన్నారు. ఆ రేంజ్ ను తన్నే మా రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారనీ చెప్పారు. హరీష్ రావును సిద్దిపేటలో కూడా గెలవనిమని తెలంగాణ ప్రజలు చెపుతున్నారనీ తెలిపారు. 2029 వరకు బిఆర్ఎస్ లోనే ఉంటానని చెప్పే దమ్ము హరీష్ రావుకు ఉందా అని ప్రశ్నించారు. ఢిల్లీ రహస్యం బయటపెడే సరికి కెసిఆర్ పొగిడే కార్యక్రమం హరీష్ రావు చేస్తున్నడనీ అన్నారు. రేవంత్ రెడ్డి అనే సామాన్యుడు ముఖ్యమంత్రి కావడం వెనుక కఠోర శ్రమ ఉందనీ అన్నారు..బకాసురుడిలా పాపాలు చేస్తే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని బండకేసి కొట్టారనీ చెప్పారు. కెసిఆర్ భవిష్యత్తులో బిజెపితో కలిసి పోతాడనీ చెప్పారు.హరీష్ రావు మీద ఎన్నో కేసులు న్నాయనీ ఆయన కూడా బిజెపిలో చేరతాడనీజోస్యం చెప్పారు. హరీష్ రావు దొంగతనాల చిట్టా తెలంగాణ ప్రజల దగ్గర ఉందనీ అన్నారు. తెలంగాణలో మీ బతుకులు ఏమిటో ముందు తెలుసుకోండనీకవిత ప్రశ్నలకు కనీసం సమాధానం చెప్పు ముందు అని అన్నారు.

## కెజిబివిల నుంచి 8 మంది జెఇఇ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక
### పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్‌నికోలస్

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)కి చెందిన 8 మంది విద్యార్థినులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కి ఎంపికయ్యారు. విద్యార్థినులు సాధించిన ఈ విద్యా విజయాన్ని ప్రకటించడానికి సంతోషిస్తున్నట్టు పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. జేఈఈ మెయిన్ సెషన్లలో తమ ప్రతిభ ద్వారా మొత్తం 8 మంది విద్యార్థినులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని,ఇది వెనుకబడిన వర్గాల బాలికలలో నాణ్యమైన విద్యను ప్రోత్సహించడంలో ఒక ముఖ్యమైన మైలురాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 283 అప్‌గ్రేడ్ చేయబడిన కేజీబీవీల్లో 93 సంస్థలు యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (వైఎల్ఎల్‌వోఈ)గా ఎంపిక చేసినట్టు తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ వంటి ప్రముఖ సంస్థలలో ప్రవేశం లక్ష ్యంగా పెట్టుకున్న అభ్యర్థులకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ తరగతుల ద్వారా కేజీబీవీల్లో జేఈఈ (ఐఐటి) కోసం ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. నిపుణులైన అధ్యాపకుల మార్గదర్శనంలో క్రమబద్ధమైన స్టడీ మెటీరి యల్స్ ను అందిస్తూ క్రమం తప్పని మాక్ టెస్టులతో విద్యార్థినుల పనితీరును విశ్లేషించనున్నట్టు తెలిపారు. గ్రామీణ వెనుకబడిన ప్రాంతాల లోని బాలికా విద్యార్థులను జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలలో పోటీపడేలా శక్తివంతం చేయడమే లక్ష ్యంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్టు తెలిపారు.

## కల్వకుంట్ల దొంగలను జైళ్లలో పెడతాం
### స్వార్థ రాజకీయాలకు దిగజారి మాట్లాడుతున్న జీవన్: ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్




**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:**కల్వకుంట్ల దొంగలను చర్లపల్లి లేదా చంచల్ గూడ జైళ్లలో పెడుతామని, జీవన్‌రెడ్డి జగిత్యాలలో ఎవరిని చివరికి తన కొడు కులను కూడా రాజకీయంగా తనకు ప్రత్యామ్నాయంగా ఎదగకుండా అడ్డు కొన్నాడని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ తెలిపారు. సిఎల్‌పి కార్యాయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ జీవన్ రెడ్డి అంటే గౌరవం ఉండేది కాని స్వార్థ రాజకీయాల కోసం నీచాతి నీచంగా దిగజారి మాట్లాడుతున్నాడనీ ఆవేదన వ్యక్తంచేశారు.జీవన్ రెడ్డి కాంగ్రెస్ పద్నాలుగుసార్లు బి ఫారం ఇచ్చి గౌర వించినా స్వార్థం కోసం ప్రజా ప్రభుత్వం పైన జీవన్ రెడ్డి తీరు బాధాకరమనీ వాపోయారు. తెలంగాణ ప్రజలకు జీవన్ రెడ్డి, కెసిఆర్ వల్ల ఒరిగేది ఏమీ లేదన్నారు. బిఆర్ఎస్ చాప్టర్ తెలంగాణలో ముగిసిందనీ కెసిఆర్ బినామీలు, బిఆర్ఎస్ నాయకులు ఆక్రమించిన భూములను హైడ్రా స్వాధీనం చేసుకుంటుందనీ తెలిపారు. అందుకే హైడ్రా ను జీర్ణియించుకోలేక కడుపు మంటతో కెసిఆర్ మాట్లాడుతున్నాడనీ ఆరోపించారు. కాంగ్రెస్‌ను విమర్శించే ముందు జీవన్‌రెడ్డి ఆత్మ పరిశీలన చేసుకోవాలనీ కోరారు. జీవన్ రెడ్డికి రాజకీయంగా అవకాశం ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ.. పాలు తాగి కన్నతల్లి రొమ్ము గుద్దినట్లు జీవన్ రెడ్డి తీరు ఉందనీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ బి ఫామ్ ఇవ్వకపోతే జీవన్ రెడ్డి ఎక్కడ ఉండేదనీ,ఎన్నో సార్లు ఓడిపోయినా పార్టీ టికెట్ ఇచ్చిందనీ తెలిపారు. మాజీ పిసిసి అధ్యక్షుడు పొన్నాల లక్ష్మ య్య బిఆర్ఎస్‌లో చేరడంతో ఆయనను తెలంగాణ ప్రజలు మరిచిపోయారనీ అన్నారు.

# ఎంపిటిసి, జెడ్పీటిసి ఎన్నికలకు సిద్ధం కండి
### కార్యకర్తలు, నాయకులకు మంత్రి రాజనర్సింహ పిలుపు

**సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయంతో పనిచేస్తే కాంగ్రెస్ పార్టీకి విజయం ఖాయమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, మెదక్ పార్లమెంట్ పార్టీ అభ్యర్థి నీలం మధు, పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ తదితరులు హాజరయ్యారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వం, పార్టీ కలిసి సమన్వయంతో ముందుకువెళ్తేనే విజయం సాధిస్తామన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలిచామని, మున్సిపల్ ఎన్నికల్లో సైతం అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్నామన్నారు. అయిన ప్పటికీ జిల్లాలో ఇంకా నాయకుల మధ్య సమన్వయం రావాల్సిన అవసరం ఉంద న్నారు. ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాల ను చేపట్టినా, ఆ సందేశాన్ని, స్ఫూర్తి ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తల పైనే ఉంటుందన్నారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇవ్వాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటి నుండే సన్నద్ధం కావాలి, పార్టీ నాయకుల మధ్య వర్గ పోరు ఉండొద్దన్నారు. నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉండటం సహజమే.. కానీ వర్గ పోరు వల్ల పార్టీకి నష్టం జరుగు తుంద న్నారు. డెబ్బై వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, ఇప్పటివరకు కేవలం ఆరోగ్య శాఖలోనే దాదాపు ఇరవై వేల ఉద్యోగాలు ఇచ్చామని వివరిం చారు. లక్ష ఇరవై వేల కోట్ల రూపాయలు ను రైతు బంధు రూపం లో రైతులకు అందించామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని గ్రామగ్రామాన విజయ వంతంగా అమలవుతోందన్నారు. జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ ఆసుపత్రులలో మరో 50 పడకలు అదనంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. భవిషత్తులో జహీరాబాద్‌లో పీజీ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. సింగూరు ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం. 200 కోట్లతో సింగూరు ప్రాజెక్టు ను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని సెపరేట్‌గా బిల్లు పెడితే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతి స్తుందన్నారు.

డీలిమిటేషన్ ఉన్నా లేకున్నా మరోసారి రేవంత్ రెడ్డి నాయక త్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పిలునిచ్చారు. నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ఎలా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలా గెలిచాం, మన బలాబలాలు, లోపాల పై చర్చించుకోవాలి అన్నారు. వచ్చే ఎంపీటీసి, జెడ్పీటిసి ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలలని అన్నారు. మూడేళ్లకుపైగా మండలస్థాయిలో పనిచేసిన వారికి, జిల్లా స్థాయిలో పదవులు ఇచ్చి, వారి స్థానంలో మండలంలో కొత్తవారిని నియమించాలని సూచించారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపి ఇతర నాయకులు



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 396

**హైదరాబాద్ (బేగంపేట), ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన 215వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 396 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీ రాజ్ గ్రామీణా భివృద్ధిశాఖ కు సంబంధించి 135 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 46 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 136 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి 2 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 77 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణీ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ డా. జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏసీపీ ఉమేందర్, ఎన్ఆర్ఐ సలహా మండలి వైస్‌చైర్మన్ మంద భీంరెడ్డి, ప్రవాసీ ప్రజావాణీ సమన్వయకర్త బొజ్జా అమరేందర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు



# బెంగాల్ తొలివిడత, తమిళనాడు ప్రచారానికి తెర

## 234 తమిళ స్థానాలు, 152 బెంగాల్ సీట్లకు రేపే పోలింగ్

### అతిరథ, మహారథుల జాతకాలకు పరీక్ష

### మే 4న ఓట్ల లెక్కింపు

**చెన్నై, కోల్‌కత్తా, ఏప్రిల్ 21:** హోరాహోరీ ప్రచారం కొనసాగిన తమిళనాడు, బెంగాల్‌లో తొలి విడత ఎన్నికల ప్రచార గడువు ముగిసింది. భారీ ర్యాలీలు, రోడ్ షోలతో మారుమోగిన మైకులు మంగళవారం సాయంత్రం 6 గంటల తర్వాత మౌనం వహించాయి. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్‌లో తొలి విడతలో 152 సీట్లకు ఈ నెల 23న పోలింగ్ జరగనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. తమిళనాడులో ఉన్న మొత్తం 234 శాసనసభ స్థానాలకు ఒకే విడతలో ఈనెల 23న పోలింగ్ జరగనుంది. మొత్తం 4 వేల 23 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సుమారు 5.73 కోట్ల మంది ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వయోవృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం ఎన్నికల సంఘం ఇప్పటికే ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించింది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు, వేలాది పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేసారు. మే 4న ఓట్లు లెక్కించి ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. రాష్ట్రంలో ప్రధానంగా రెండు బలమైన కూటముల మధ్య పోటీ నెలకొంది. ఈ ఎన్నికల బరిలో డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, ఎన్డీయే కూటమి అమీతుమీ తెల్చుకోనున్నాయి. వీటితో పాటు నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం కూడా తన సత్తచాటడానికి సిద్ధమైంది. తమిళనాడులో అధికార డిఎంకెపార్టీ మొత్తంగా 164 స్థానాల్లో పోటీ చేస్తోంది. ఇందులో భాగంగా కొలత్తూరు నుంచి ముఖ్యమంత్రి స్టాలిన్ బరిలో ఉన్నారు. డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ (చెపాక్‌తిరువల్లికేణి), సెంథిల్ బాలాజీ (కోయంబత్తూరు సౌత్) సహా ఇతర మంత్రులు పోటీ చేస్తున్నారు. ఎన్డీఏ కూటమి నుంచి అన్నాడీఎంకే అగ్రనేత ఎడప్పాడి కె. పళనిస్వామి (ఎడప్పాడి), బీజేపీ నేతలు ఎల్.మురుగన్, తమిళసై సౌందరరాజన్ బరిలో ఉన్నారు. విజయ్ నేతృత్వంలోనిటివికె మొత్తం 234 స్థానాల్లో పోటీ చేస్తుండగా, పెరంబూర్, తిరుచ్చి తూర్పు నుంచి విజయ్ పోటీ చేస్తున్నారు. బెంగాల్ శాసనసభ ఎన్నికల తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 152 అసెంబ్లీ నియోజకవర్గాల్లో హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారం ముగిసింది. ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. మొత్తం 1,478 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 16 జిల్లాల్లో పోలింగ్ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6.82 కోట్ల మంది ఓటర్లు ఉండగా మొదటి విడత ఎన్నికల్లో సుమారు 3.5 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

# సివిల్ సర్వెంట్లకు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 21:** జాతీయ సివిల్ సర్వీసుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దేశానికి అంకిత భావంతో, చిత్తశుద్ధితో సేవలందిస్తున్న సివిల్ సర్వెంట్లందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నిజాయితీ, క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల అచంచల నిబద్ధతతో వారు నిర్వర్తిస్తున్న బాధ్యతలు దేశ అభివృద్ధి, పురోగతికి దృఢమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం విధానాల రూపకల్పన, అమలులో సివిల్ సర్వెంట్లు పోషిస్తున్న కీలక పాత్రను కొనియాడుతూ, వారి నిరంతర సేవ సమాజానికి స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి అభినందించారు.



# తమిళనాడులో డిఎంకె కూటమిదే విజయం: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్21:** తమిళనాడులో డిఎంకే, కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడు శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసిసి పరిశీలకుడు, మాజీ ఎంపీ మధు యాష్కీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిసి రాణిపేట జిల్లా షోలింగర్ నియోజకవర్గంలో నీకారిక్కల్ , వీరనట్టుర్, అరియూర్, అయిపేడు ప్రాంతాల్లో మంగళవారం విస్తృతంగా పర్యటించి, కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. తమిళ ప్రజలు అభివృద్ధి, లౌకికవాదానికే పట్టం కడతారని చెప్పారు. ఆత్మగౌరవానికి తమిళ ప్రజల మద్దతు చెబుతారని ఆకాంక్షి ంచారు. ఎం.కె. స్టాలిన్ నాయకత్వంలోని ప్రభుత్వం భారీ మెజారిటీతో తిరిగి అధికారాన్ని కైవసం చేసుకోబోతోందని భట్టి విక్రమార్క చెప్పారు. మహాలక్ష్మి ్మ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతిలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎన్నికలవేళ ఇచ్చిన హామీలే కాకుండా, ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తున్నామని తెలిపారు.

# అదనపు మక్క కొనుగోలు కేంద్రాలు

### తక్షణ ఏర్పాటుకు మంత్రి తుమ్మల ఆదేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మొక్కజొన్న పంట కొనుగోలుకు అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. భారీ ఎత్తున మక్కలు కొనుగోలు కేంద్రాలకు వస్తున్నందున అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 200 కేంద్రాల ద్వారా మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయి. సేకరించిన మొక్కజొన్నను గోదాములకు వేగంగా తరలించాలని మార్క్‌ఫెడ్ అధికారులను మంత్రి ఆదేశించారు. తమ పంటను అమ్మేందుకు రైతులు భారీ ఎత్తున కేంద్రాలకు వస్తుండడంతో రద్దీ నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులకు ఇబ్బంది కలుగకుండా మంత్రి తుమ్మల చొరవ తీసుకున్నారు. రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద పడిగాపులుగాయకుండా ఉండేందుకు వీలుగా ఎక్కడికక్కడ అదనంగా కొత్తగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశాలు జారి చేశారు. రైతుల సౌకర్యార్థం అవసరమైన ప్రతి చోట తక్షణమే మక్క కొనుగోలు కేంద్రాలను విస్తరించడం ద్వారా కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయొచ్చన్నారు. అకాల వర్షాల ముప్పు పొంచి ఉన్నందున కొనుగోలు చేసిన మొక్కజొన్నను ఎప్పటికప్పుడు సురక్షి త ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు.

# అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో పెట్టుబడులను ప్రోత్సహించండి

### తెలంగాణ అత్యంత అనుకూలం.. అవకాశాలు పుష్కలం

### ఇటలీ రాయబారికి మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేలా ఇటలీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధులను ఆయన కోరారు. ఇటలీ దేశ రాయబారి ఆంటోనియో బార్టోలి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంగళవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఏయే రంగాల్లో తెలంగాణ – ఇటలి కలిసి పని చేసేందుకు అవకాశాలున్నాయనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. నేడు ఐరోపాలోనే అత్యంత బలమైన ఎగుమతి ఆధారిత, ఉత్పాదక రంగం కలిగిన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఇటలీ కొనసాగుతుందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. మెషీనరీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఆటోమోటివ్ సిస్టమ్స్, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలలో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. తెలంగాణను గ్లోబల్ మ్యాను ఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, అనుసరిస్తున్న వ్యూహాలను, పాలసీలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. భారత్ – ఇటలీ మధ్య బలపడుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతమిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండస్ట్రీ 4.0, రోబోటిక్స్, స్మార్ట్ మ్యాను ఫ్యాక్చరింగ్, క్లీన్ మొబిలిటీ, రెన్యూవబుల్ ఎనర్జీ తదితర రంగాల్లో ఇటలీ మార్గదర్శకం తెలంగాణ బ్రాండ్‌ను మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటలీకి నమ్మకమైన భాగస్వామిగా ఉండేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ ఇన్నోవేషన్ ఎకోసిస్టం మరింత బలోపేతమయ్యేలా టిహబ్, విహబ్, జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైజెస్ పార్కు, యూనివర్సిటీలు, పరిశోధన సంస్థలతో ఇటలీ కంపెనీలు, నిపుణులు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చొరవ చూపాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఈ సమావేశం తొలి అడుగు మాత్రమేనని, రాబోయే రోజుల్లో తెలంగాణకు



నమ్మకమైన భాగస్వామిగా మారుతాం, కీలక రంగాల్లో కలిసి పని చేస్తామని ప్రత్యేక వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం అని ఇటలీ రాయబారి ఆంటోనియో బార్టోలి పేర్కొన్నారు.

**మెడికల్ డివైజెస్ ఉత్పాదనకు అత్యాధునిక మౌలిక సదుపాయాలు: మంత్రి శ్రీధర్‌బాబు**

అత్యాధునిక వైద్య పరికరాల తయారీకి తెలంగాణాలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.

మెడికల్ డివైసెస్ పార్క్, జీనోమ్ వ్యాలీలో తక్షణం ఉత్పత్తి ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఉన్నాయని వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో తనను కలిసిన నెదర్లాండ్స్ మెడిటెక్ పారిశ్రామికవేత్తలు, యూనివర్సిటీల పరిశోధకులతో ఆయన మాట్లాడారు. వైద్య సంబంధ పరిశోధనలు, కృత్రిమ మేథ అభివృద్ధి, పరికరాల ఉత్పత్తికి తెలంగాణా అత్యంత అనుకూలమని ఆయన వివరించారు. ఔషధాల ఉత్పత్తి, నూతన ఆవిష్కరణలు, వ్యాక్సిన్ల తయారీలో తమ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి వ్యాపించిన సమయంలో ఇక్కడి బయోటెక్ కంపెనీలు 120 దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఆధునిక వైద్య పరికరాల ఉత్పత్తిలో తెలంగాణాను కేంద్ర స్థానం (హబ్)గా తీర్చిదిద్దేందుకు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తోందని తెలిపారు. విద్యుత్తు, నీరు, భూమి సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని వివరించారు. వైద్య రంగంలో కృత్రిమ మేథ వినియోగించే విషయంలో చక్కని అవకాశాలున్నాయని చెప్పారు.

# తెలంగాణ నుంచి 8 కొత్త రైళ్లు ప్రకటించిన రైల్వే శాఖ

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హర్షం

### ప్రధాని, రైల్వే మంత్రికి ధన్యవాదాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం భాగ్యనగరంలోని వివిధ స్టేషన్ల నుంచి 8 కొత్తరైళ్లను ప్రకటించింది. కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి చొరవతో వచ్చిన ఈ కొత్తరైళ్లు వీక్లీ ట్రైన్స్‌గా ప్రయాణికులకు సేవలందిచనున్నాయి. హైదరాబాద్ నుంచి తిరుపతి, తిరుచానూరు (ఆంధ్రప్రదేశ్), శ్రీగంగానగర్, జైపూర్ (రాజస్థాన్), భువనేశ్వర్ (ఒడిశా)లకు రెగ్యులర్ ట్రైన్స్ నడపాలని డిమాండ్లు వచ్చిన నేపథ్యంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ విషయంపై రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌తో చర్చించారు. ఈ నేపథ్యంలో.. హైదరాబాద్ నగరంలోని కాచిగూడ, చర్లపల్లి, హైదరాబాద్ (నాంపల్లి) స్టేషన్ల నుంచి పలు ప్రాంతాలకు కొత్త రైళ్లను నడపాలని రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతి, తిరుచానూరు వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకోసం 5 రైళ్లు కొత్తగా అందుబాటులోకి రానున్నాయి. దీంతోపాటుగా భువనేశ్వర్, జైపూర్, శ్రీగంగానగర్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు లబ్ధి చేకూరనుంది. ఈ నిర్ణయం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ధన్యవాదములు తెలియజేశారు.

కొత్త సర్వీసులు బయలుదేరే సమయం, వారం, గమ్యస్థానం:

17607/17608 నెంబరుతో కాచిగూడ నుంచి ప్రతి గురువారం రాత్రి 9.30కు తిరుచానూరు (ఆంధ్రప్రదేశ్) వెళ్లే వీక్లీ స్పెషల్ ట్రైన్ 15 మే, 2026 నుంచి ప్రారంభం కానుంది.

17601/17602 నెంబరుతో కాచిగూడ నుంచి ప్రతి శనివారం రాత్రి 10 గంటలకు శ్రీగంగానగర్ (రాజస్థాన్) వెళ్లే వీక్లీ స్పెషల్ ట్రైన్ 14 జూలై, 2026 నుంచి ప్రారంభం కానుంది.

17047/17048 నెంబరుతో చర్లపల్లి నుంచి ప్రతి బుధవారం సాయంత్రం 6.55 గంటలకు తిరుచానూరు వెళ్లే వీక్లీ స్పెషల్ ట్రైన్ 7 మే, 2026 నుంచి ప్రారంభం కానుంది.

17441/17442 నెంబరుతో చర్లపల్లి నుంచి ప్రతి బుధవారం రాత్రి 9.20 గంటలకు తిరుపతి వెళ్లే వీక్లీ స్పెషల్ ట్రైన్ 14 మే, 2026 నుంచి ప్రారంభం కానుంది.

17443/17444 నెంబరుతో చర్లపల్లి నుంచి ప్రతి శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు తిరుపతి వెళ్లే వీక్లీ స్పెషల్ ట్రైన్ 15మే, 2026 నుంచి ప్రారంభం కానుంది

17059/17060 నెంబరుతో ప్రతి ఆదివారం రాత్రి 9.15 గంటలకు చర్లపల్లి నుంచి తిరుచానూరు వెళ్లే వీక్లీ స్పెషల్ ట్రైన్ 11 మే, 2026 నుంచి ప్రారంభం కానుంది.

17067/17068 నెంబరుతో ప్రతి సోమవారం సాయంత్రం 6.10 నిమిషాలకు చర్లపల్లి నుంచి భువనేశ్వర్ (ఒడిశా) వెళ్లే వీక్లీ స్పెషల్ ట్రైన్.. 5 మే, 2026 నుంచి ప్రారంభం కానుంది.

17079/17080 నెంబరుతో ప్రతి శుక్రవారం రాత్రి 7.50 గంటలకు నాంపల్లి నుంచి జైపూర్ (రాజస్థాన్) వెళ్లే వీక్లీ స్పెషల్ ట్రైన్ కూడా త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ రైలు ప్రారంభ తేదీని దక్షి ణ మధ్య రైల్వే త్వరలోనే ప్రకటించనుంది.

# ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలను ఖండించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్రమోడీని కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ఉగ్రవాది (టెర్రరిస్ట్) అని సంబోధించడాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఓ జాతీయ పార్టీ అధ్యక్షుడిగా, సుదీర్ఘ రాజకీయ అనుభవం గల నాయకుడైన ఖర్గే బాధ్యాతాయుతమైన ప్రధానమంత్రి పదవిలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. ఖర్గే ప్రధానిపై పదే పదే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుండటం. ఆ పార్టీలో నెలకొన్న నైరాశ్యాన్ని బట్టబయలు చేస్తోంది. ఉగ్రవాదాన్ని అణిచివేయడంలో అహోరాత్రులు శ్రమిస్తున్న మోడీని ఉగ్రవాదిగా సంబోధించే ముందు ఉగ్రవాదులతో తమ పార్టీ నాయకులు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన విషయాన్ని మల్లికార్జున ఖర్గే గుర్తుపెట్టుకుంటే బాగుండేది అన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో కశ్మీర్ వేర్పాటువాద ఉగ్రవాది యాసిన్ మాలిక్‌తో చర్చలు జరిపిన విషయం ఖర్గేకు గుర్తులేదా? ప్రధానమంత్రిని ఉద్దేశించి మాట్లా డుతున్నప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలు మిమ్మల్ని క్షమించరని అన్నారు.

## నాణ్యత, తక్కువ ధరతోనే బొగ్గు సంస్థల మనుడగ

### కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

నాణ్యాతా ప్రమాణాలు పాటిస్తూ తక్కువ ధరకు బొగ్గు విక్రయించినట్లయితేనే బొగ్గు సంస్థలకు మనుగడ ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశవ్యాప్త బొగ్గు గనుల పనితీరుపై మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ భారతదేశాన్ని ఇంధన రంగంలో స్వయం సమృద్ధి దిశగా ముందుకు తీసుకెళుతున్న నేపథ్యంలో ప్రతీ ప్రభుత్వ సంస్థ కూడా బొగ్గు నాణ్యాతా ప్రమాణాలు పాటిస్తూ పోటీ మార్కెట్లో నిలదొక్కుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు గాను సింగరేణి సంస్థ కూడా ఉత్పత్తి వ్యయం తగ్గించుకొని, నాణ్యాతా ప్రమాణాలు పెంచుకొని ముందుకు సాగాలని సూచించారు. దేశంలోని బొగ్గు వినియోగదారులు తమకు నచ్చిన చోట, నచ్చిన గ్రేడు బొగ్గును పొందే విధంగా నేషనల్ కోల్ ఎక్స్చేంజ్ ద్వారా బొగ్గు అమ్మకపు విధానాన్ని ప్రవేశపెట్టడం జరుగుతుందని చెప్పారు.

# సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న బ్యాంకుల అధికారులపై చర్యలు తీసుకోవాలి

### ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాను కోరిన సిటీకొత్వాల్ సజ్జనార్

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా పెరిగిపోతున్న సైబర్ నేరాలలో నేరగాళ్లకు, మ్యూల్ ఖాతాదారులకు సహకరిస్తున్న బ్యాంకుల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సిటీ కొత్వాల్ సజ్జన్నర్ ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాను కోరారు. ఇదే విషయమై చర్చించేందుకు సజ్జనార్ మంగళవారం సంజయ్ మల్హోత్రాను నగరంలోని ఆర్‌బిఐ కార్యాలయంలో భేటీ అయ్యారు. కమిషనర్ వెంట నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్) శ్రీనివాస్ కూడా వున్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల పెరుగుదల, మ్యూల్ ఖాతాదా రులకు బ్యాంకుల సిబ్బంది సహకరిస్తు న్న ఘటనలపై ఒక లేఖ అందజేశారు. అమాయకుల పేర్లతో బ్యాంకుల్లో నేరగాళ్లు ఖాతాలు తెరుస్తుండగా వీటికి అక్కడి అధికారులు, సిబ్బంది సహ కరించడం సరైంది కాదని సజ్జన్నర్ ఆర్‌బిఐ గవర్నర్‌కు తెలిపారు. బ్యాంకు ఖాతాలను తెరుస్తున్న సమయంలో కెవైసి ధృవీకరణకు సంబంధించి జ రుగుతున్న అక్రమాలు, నిర్లక్ష్యం గురించి సజ్జన్నర్ ఆర్‌బిఐకి కులంకుశంగా వివరించారు. ఈ విషయంలో అన్ని బ్యాంకులకు కఠిన ఆదేశాలు ఇవ్వా లని ఆయన కోరారు. ఆర్‌బిఐ నిబంధనలు అనేక బ్యాంకుల్లో అమలవడం లేదని తమ పరిశీలనలో తేలిందని సజ్జనార్ తెలిపారు. మహారాష్ట్రలోని నాసిక్ ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకులో కమిషన్ల కోసం ఒక కెవైసి పరిశీలకుడు తన తోటి ఉద్యోగి లాగిన్ వివరాలను అక్రమంగా వాడుకుని మ్యూల్ ఖా తాలను సృష్టించాడని, ఇది బ్యాంకింగ్ భద్రతా వైఫల్యానికి పరాకాష్టగా కమిషనర్ తెలిపారు. ప్రైవేటు బ్యాంకుల్లో ఇలాంటి నేరాలు ఎక్కు వగా జరు గుతున్నాయని ఈ విషయంలో కచ్చితంగా వ్యవహరిం చాలని ఆయన కోరారు. అనేక బ్యాంకులు మ్యూల్ ఖాతాల విషయంలో చూసీచూడనట్లుగా వుంటు న్నాయని, వీనివల్ల ప్రజల సొమ్ముకు బ్యాంకుల్లో భద్రత లేకుండా పోతుం దని సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. మ్యూల్ ఖాతాల విషయం లో నేరగాళ్లకు సహకరించిన బ్యాంకుల సిబ్బందిని శాశ్వతంగా బ్లాక్ లిస్టులో వుంచితే ఈ తరహా నేరాలను నివారించ వచ్చని ఆయన తెలిపారు. మ్యూల్ ఖాతాలతో పాటు అక్రమ లావాదేవీలపై వెంటనే గుర్తించేందుకు సాంకేతక వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీసుల తో నిరంతరం సమీక్ష సమావేశాలు నిర్వహించడం వల్ల ఫలితాలు వుంటాయని సజ్జన్నర్ తెలిపారు. సజ్జన్నర్ లేఖకు ఆర్‌బిఐ గవర్నర్ సానుకూలంగా స్పందించారు.



సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న బ్యాంకుల అధికారులపై చర్యలు తీసుకునే విషయమై ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో మాట్లాడుతున్న సిటీ కొత్వాల్ సజ్జనార్. చిత్రంలో క్రైం అండ్ సిట్ అదనపు సిపి శ్రీనివాస్



# తెలంగాణలో పెట్టుబడులకు నార్వే కంపెనీలను ప్రోత్సహించండి

### నార్వే ఉన్నతస్థాయి ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** తెలంగాణ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో పెట్టుబడులకు స్వర్గధామమని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో రాష్ట్రంలో కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసేలా నార్వే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని కోరారు. మంగళవారం ఆ దేశ రాయబారి మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణ – నార్వే దేశాల మధ్య ద్వైపాక్షి క సహకారాన్ని పెంపొందించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమగ్రంగా చర్చించింది. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలను, ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీలను, పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలు, అవకాశాలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. క్లీన్ ఎనర్జీ, సుస్థిర మౌలిక సదుపాయాల కల్పన, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఆఫ్‌షోర్ విండ్, క్లైమేట్ ఇన్నోవేషన్, గ్రీన్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక వ్యవస్థలలో నార్వే గ్లోబల్ లీడర్‌గా కొనసాగుతుందని కొనియాడారు.

# ఎట్టకేలకు కదిలిన కెఆర్‌ఎంబి

### శ్రీశైలం ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ, విద్యుదుత్పత్తిపై ఆరా

### కేటాయింపుల మేరకే నీటిని వినియోగించుకోవాలని స్పష్టం

### డ్యామ్‌ను సందర్శించిన కెఆర్‌ఎంబి ఛైర్మన్

### పలు కీలక అంశాలతో కేంద్ర జలశక్తి శాఖకు త్వరలో నివేదిక

**హైదరాబాద్, ఎప్రిల్ 21, ప్రభాతవార్త:** శ్రీశైలం కుడిగట్టు విద్యుత్ కేంద్రంలో ఎపి ఇష్టారాజ్యంగా విద్యుదుత్పత్తి చేస్తూ జలాశయాన్ని ఖాళీ చేస్తోందని తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలపై కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఎట్టకేలకు స్పందించింది. ఎపి ఇప్పటికే శ్రీశైలం నుంచి కేటాయింపులకు మించి 125 టిఎంసిల నీటిని తరలించిందని కెఆర్‌ఎంబి ఛైర్మన్‌కు తెలంగాణ నీటిపారుదలశాఖ కొద్దిరోజుల క్రితం కీలకమైన లేఖ రాసింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో కనీస నిల్వ మట్టానికి ఎగువన మిగిలి ఉన్న 80 టిఎంసిల నిల్వలు పూర్తిగా తెలంగాణ వాటా హక్కు జలాలేనని తేల్చి చెప్పింది. ఈ నీటిని వినియోగించుకోకుండా ఎపిని నియంత్రించాలని, జలవిద్యుదుత్పత్తి కొనసాగించకుండా ఆదేశించాలని కోరింది. అయితే తొలుత తెలంగాణ అభ్యంతరాలపై తామేమి చేయలేమని చేతులెత్తేసిన కెఆర్‌ఎంబి ... ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం జాతీయ స్థాయిలో కేంద్ర జలశక్తి శాఖపై తీవ్ర ఒత్తిడి తేవడంతో కెఆర్‌ఎంబి ఛైర్మన్ సుబ్రాంగ్ షూ బిశ్వాస్ మంగళవారం శ్రీశైలం డ్యామ్‌ను సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జలాశయానికి సంబంధించి కుడి, ఎడమ విద్యుదుత్పత్తి కేంద్రాలను, డ్యాంలో ప్రస్తుత నీటి నిల్వతోపాటు ప్రాజెక్టు ప్రధాన గేట్లు, ఆపరేటింగ్ రోప్స్, ఇన్నర్ గ్యాలరీలతోపాటు అప్రోచ్ రోడ్ల పరిస్థితిని తనిఖీ చేశారు.

నీటి వినియోగంపై పరస్పర సహకారంతో సమస్యలు పరిష్కరించుకోవాలని ఇరు రాష్ట్రాలకు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అధికారులతో కలిసి జల వినియోగం, నిల్వలు, విడుదలలపై సమీక్ష నిర్వహించారు.

ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో నీటి నిల్వలు పరిమితంగా ఉన్న నేపథ్యంలో ముఖ్యంగా తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రెండు రాష్ట్రాలు నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని, ఇరు రాష్ట్రాల అవసరాల మేరకు ఇరు రాష్ట్రాల ప్రాజెక్టు అధికారులు సమన్వయంతో నీటిని విడుదలచేయాలని సూచించారు.

నీటి వినియోగంపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ప్రాజెక్టు అధికారులకు సూచించారు. ప్రాజెక్టు నిర్వహణలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు, డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించిన మరమ్మతులపై సుదీర్ఘంగా పలు కీలక అంశాలపై చర్చించారు.

శ్రీశైలం డ్యామ్ భద్రత విషయంలో రాజీ పడొద్దని, ఏవైనా మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కృష్ణా బోర్డు నిబంధనల ప్రకారం నీటి వినియోగం ఉండాలని, ఇరు రాష్ట్రాలు సమన్వయంతో తాగు, సాగునీటి అవసరాలను తీర్చుకోవాలని సూచించారు. డ్యామ్ నిర్వహణ బాధ్యతలపై నెలకొన్న కొన్ని సందిగ్ధతలను తొలగించే దిశగా ఈ సమీక్ష సాగినట్టు సమాచారం. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న వరద ప్రవాహం, జలాశయంలో ఉన్న నీటి మట్టంపై కూడా ఛైర్మన్ ఆరా తీశారు.

రాబోయే కాలంలో ప్రాజెక్టు పటిష్టత కోసం కేంద్రం నుంచి అందే సహకారం, బోర్డు తీసుకోవాల్సిన చర్యలపై ఒక నివేదిక సిద్ధం చేయాలని ఛైర్మన్ నిర్ణయించారు.

ఈ పర్యటనలో తేలిన అంశాలను కేంద్ర జలశక్తి శాఖకు కెఆర్‌ఎంబి నివేదించే అవకాశం ఉంది. మొత్తంగా శ్రీశైలం ప్రాజెక్టును కెఆర్‌ఎంబి ఛైర్మన్ సందర్శించడంతో ఎపి, తెలంగాణ మధ్య కృష్ణా జలాల వినియోగంపై కీలక నిర్ణయాలకు దారి తీసే అవకాశముందని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

కృష్ణా జలాల వినియోగంపై ఎపి, తెలంగాణ మధ్య విభేదాలు కొనసాగుతున్న వేళ కెఆర్‌ఎంబి ఛైర్మన్ శ్రీశైలం పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

# బహిరంగ సభల్లో కెసిఆర్, రేవంత్‌రెడ్డిలో స్పష్టంగా కనిపిస్తోన్న భయం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** జగిత్యాలలో బిఆర్‌ఎస్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాంగ్రెస్ సభలో కెసిఆర్, రేవంత్ రెడ్డి మాటల్లో భయం స్పష్టంగా కనిపిస్తుందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ఒకరు నేను మళ్లీ అధికారంలోకి వస్తాను అంటున్నారు, మరొకరు ఇవ్వాల్టి పరిస్థితి మారుతుంది అంటున్నారు. కానీ జగిత్యాల, భూపాలపల్లి సభల్లో ఇద్దరు నేతలు కూడా బిజెపిని టార్గెట్ చేయడం వాళ్లలో ఉన్న భయాన్ని స్పష్టంగా బయటపెడుతుందన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బిజెపి ప్రభుత్వమే అన్న వాస్తవం వాళ్లను కలవరపెడుతుందని అని ఆయన పేర్కొన్నారు. కేంద్రం మోటార్లకు మీటర్లు పెట్టమంటే అడ్డుకున్నామని కెసిఆర్ అబద్ధాలు చెబుతున్నారు. మీ పాలనలో లక్షల కోట్ల అప్పులు పెట్టిన విషయంపై చర్చకు సిద్ధమా? అలాగే సిఎం రేవంత్ రెడ్డి, మీరు చెప్పే లెక్కలపై కూడా నేను బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నాను. కెసిఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు కలిసి రాష్ట్రాన్ని పీల్చి పిప్పచేశాయంటూ ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీల్లో లోపాలు జరిగాయని మేం గతంలోనే ప్రశ్నించామని, విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశామన్నారు. కానీ రేవంత్ సర్కార్ ఇప్పటికీ పూర్తిస్థాయి విచారణ చేయడం లేదన్నారు. కెసిఆర్, రేవంత్ మధ్య పరస్పర రక్షణ రాజకీయాలు నడుస్తున్నాయని రాంచందర్ రావు ఆరోపించారు. బిజెపి పెరుగుదలను చూసి ఓర్చుకోలేక ఈ రెండు పార్టీలు నాటకాలు ఆడుతున్నాయి.

# విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం

● విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ

**విజయవాడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** పాఠశాలలకు వేసవి సెలవుల ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎండకాలం దృష్ట్యా విద్యార్థుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. నీటి వనరుల వద్ద ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా కౌన్సెలింగ్ సెషన్లు నిర్వహించాలని స్పష్టం చేసింది. కాల్వలు, చెరువులు, నదులు వంటి నీటి ప్రాంతాలకు పెద్దల పర్యవేక్షణ లేకుండా విద్యార్థులు వెళ్లకూడదని హెచ్చరించింది. అలాగే తెలియని నీటి ప్రాంతాల్లో ఈతకు దిగకూడదని స్పష్టం చేసింది. ప్రమాద పరిస్థితుల్లో ఇతరులను రక్షి ంచేందుకు స్వయంగా ప్రయత్నించకుండా వెంటనే పెద్దలకు సమాచారం ఇవ్వాలని సూచించింది. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు జారీ చేసింది. తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం వంటి ఆరోగ్య జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని పేర్కొంది. హీట్ స్ట్రోక్ లక్షణాలు, వాటి నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించింది. రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించేలా విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని విద్యాశాఖ సూచించింది. అలాగే స్క్రీన్ టైమ్ తగ్గించి క్రీడలు, పుస్తక పఠనం వంటి ఉపయోగకరమైన కార్యక్రమాల్లో పాల్గొనాలని, ప్రోత్సహించాలని సూచించింది. తల్లిదండ్రులకు కూడా భద్రతా సూచనలు తెలియజేయాలని పాఠశాలలకు ఆదేశాలు ఇచ్చింది. పాఠశాలల్లో భద్రతా సూచనలను బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని సూచించింది. కాల్వలు, చెరువుల సమీపంలో ఉన్న పాఠశాలలు మరింత అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. జిల్లా విద్యాధికారులు మండల విద్యాధికారులు ద్వారా కచ్చితమైన పర్యవేక్షణ జరగాలని, అన్ని సూచనలు అమలు చేయాలని ఆదేశించింది. వేసవి సెలవులకు ముందు 100శాతం విద్యార్థులకు కౌన్సెలింగ్ పూర్తిచేయాలని స్పష్టం చేసింది. అమలులో ఏ విధమైన నిర్లక్ష్యం జరిగినా కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ

## బెదరించడానికే ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసారు

● ఏపి సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి

**విజయవాడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎంప్లాయిస్‌ను బెదిరించడానికే తనను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసారని ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ఆరోపించారు. తనను ఉద్యోగం నుంచి తొలగించడాన్ని అన్యాయమైన చర్యగా పేర్కొన్నారు. ఇది కేవలం ఉద్యోగులను అణివేసేందుకు చేస్తున్న చర్య అని అభియోగించారు. ఉద్యోగులను రాజకీయంగా వాడుకున్న చరిత్ర చంద్రబాబుదేనని అన్నారు. తాను ఎలాంటి ఎన్నికల ప్రచారం చేయలేదని గతంలో అధికారులే రిపోర్ట్ ఇచ్చారని, తనను తొలగించడం తప్పని ప్రతి ఐఏఎస్ అధికారికి తెలుసని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల కోసం కూటమి ప్రభుత్వం ఏం చేసిందని ఆయన నిలదీశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 15వ తేదీ దాటినా జీతాలు రావడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు.

## ప్రశ్నించే వారిని భయపెడుతోంది: జగన్

**విజయవాడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగులు తమ హక్కుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే నేరమా అని ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రశ్నించారు. నిష్కారణంగా ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి తొలిగించడం అన్యాయన్నారు. ఆయనకు న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డిని సర్వీసు నుంచి తొలగించడంపై వైసీపీ అధినేత జగన్ తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు వైసిపి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగినందుకే ప్రభుత్వం కక్ష సాధించిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు భయంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.

## విజయవాడలో మునిసిపల్ కార్మికుల ధర్నా

**విజయవాడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం నగరపాలక సంస్థ కార్మికులు విధులను విరమించి విజయవాడ అలంకారీ సెంటర్ దగ్గరలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. మున్సిపల్ కార్మికులందరూ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ (సిఐటియు) నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో ఈ ఆందోళన చేసారు. ఈ ధర్నాకు నగర అధ్యక్షుడు టి.ప్రవీణ్ అధ్యక్షత వహించారు. సి.పి.ఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు ధర్నాకు మద్దతుగా మాట్లాడుతూ కార్మికులకు మార్చి నెల జీతం ఇవ్వకపోగా చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా అన్నా క్యాంటీన్‌కు రూ.76 లక్షలు ఇచ్చారని అన్నారు. రోడ్డు ఊడ్చే మున్సిపల్ కార్మికులకు జీతాలు వేయడానికి చేతులు రాలేదని మండిపడ్డారు. కార్మికులు పస్తులు పడుకుంటే ప్రభుత్వం పండగ చేసుకుంటుందని, అందుకనే రాబోయే కాలంలో కార్మికులకు జీతాలు చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

## మాజీ మేయర్ బ్యాంకు ఖాతాలో నగదు మాయం
## నిందితుడు గుర్తించిన సైబర్ క్రైమ్ పోలీసులు

**విజయవాడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ మాజీ మేయర్ జంధ్యాల శంకర్ బ్యాంకు ఖాతాల నుంచి నగదు మాయం కేసు దర్యాప్తులో నిందితుడి గుట్టు బయటపడింది. నగదు కొల్లగొట్టిన నిందితుడ్ని సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి సిమ్‌లు విక్రయిస్తుంటాడు. అయితే తన వద్ద ఉన్న ఒక నెంబరు నచ్చి ఆ సిమ్‌ను నేరుగా తన మొబైల్‌లో యాక్టివేట్ చేసుకున్నాడు. ఆ తర్వాత వెంటనే అతనికి సంక్షి ప్త సందేశాలు రావడం మొదలయ్యాయి. ఓ బ్యాంకు ఖాతాకు ఈ నెంబరు లింక్ కావడమే ఇందుకు కారణం. ఖాతాలో నగదు జమ అయినప్పుడల్లా యాక్సిస్ బ్యాంకు నుంచి ఎస్ఎంఎస్‌లు వచ్చేవి. పెద్ద మొత్తంలో డబ్బు క్రెడిట్ అవుతున్నట్లు ఆ సందేశాల ఆధారంగా గుర్తించాడు. వీటిని చూసి అతనికి ఓ ఆలోచన వచ్చింది. వెంటనే అమలులో పెట్టాడు. విజయవాడలోని యాక్సిస్ బ్యాంకు ఖాతా అని తెలుసుకుని మొబైల్ యాప్‌లో అర్జీ పెట్టి, హైదరాబాద్‌కు మార్చుకున్నాడు. అక్కడి నుంచి పలు పట్టణాల్లోని శాఖలకు మార్చాడు. చివరకు కశ్మీర్‌కు బదిలీ చేయించుకున్నాడు. ఎకౌంట్‌లోని సొమ్మును అతని భార్య ఖాతాకు రూ.5 లక్షలు, సొంత ఖాతాకు రూ.12 లక్షలు, మిగిలిన వాటిని బంధువుల ఖాతాలకు బదిలీ చేశాడు. అందులోని రూ.20 లక్షల సొమ్మును నాలుగు ఖాతాలకు తరలించాడు. విజయవాడ పూర్వ మేయర్ జంధ్యాల శంకర్ సతీమణి బ్యాంకుకు వెళ్లగా అసలు విషయం బయటపడింది. ఆ ఖాతా కశ్మీర్‌కు బదిలీ అయిందని అందులోని సొమ్మును ఎవరో డ్రా చేశారని తెలిసింది. ఈ ఖాతాకు లింక్ అయిన ఫోన్ నెంబరును చాలా నెలలు రీఛార్జి చేయకపోవడంతో అది డీయాక్టివేట్ అయింది. ఈ సిమ్ హైదరాబాద్‌లోని ఏజెంట్ వద్దకు విక్రయాల కోసం వచ్చింది. ఖాతాలో నగదు మాయంపై విజయవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా స్టేట్‌మెంట్లను తీసుకున్నారు. వీటిని పరిశీలించగా హైదరాబాద్‌కు చెందిన సిమ్ ఏజెంట్, అతని బంధువుల ఖాతాల వివరాలు వచ్చాయి. ఆ వ్యక్తిని పోలీసులు పిలిపించి విచారించగా తానే నగదు మళ్లించానని ఒప్పుకున్నాడు. డబ్బు తిరిగి ఖాతాదారుడికి

# ఎన్‌డియే వస్తేనే.. తమిళనాడుకు పునర్వైభవం

● కర్ణాటక-తమిళనాడు వివాదాలకు చెక్ పెట్టేలా గంగా-కావేరి అనుసంధానంపై ప్రస్తావన

● అభివృద్ధి మంత్రం, సుపరిపాలనే లక్ష్యంగా సిఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారం

● మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై డిఎంకె తీరును ప్రశ్నించిన ముఖ్యమంత్రి



**విజయవాడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** తమిళనాట ఎన్డీఏ కూటమి పక్షాన ఏపి సిఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ముగిసింది. తమిళనాడులో రెండు రోజుల పాటు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బిజీ షెడ్యూల్‌తో పలు కీలక ప్రాంతాలను ఎన్డీఏ తరపున ప్రచారం చేశారు. సోమ, మంగళవారాల్లో కోయంబత్తూర్, కృష్ణగిరి, విరుద్ నగర్, మధురై, చెన్నై జిల్లాల్లో పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభలు, రోడ్ షోలు, స్థానిక వ్యాపారవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్డీఏ అభ్యర్థులకు మద్దతు కూడగట్టారు. కోయంబత్తూర్ నార్త్, కోయంబత్తూర్ సౌత్, సింగనల్లూర్, కౌండం పాళాయం, సూలూర్, థలి, అన్నా నగర్, టీ నగర్, విల్లివాక్కం, సాత్తూర్, కోవెల్‌పట్టి నియోజకవర్గాల ఎన్డీఏ అభ్యర్థులు ఏపి సిఎం నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్నారు.

ఈ ప్రచారంలో ముఖ్యంగా అభివృద్ధిలో తమిళనాడు వెనుకబాటు, అవినీతి, క్షీ ణించిన శాంతి భద్రతలు వంటి అంశాలపై ఆయన దృష్టి సారించారు. అలాగే తమిళనాడుకు ఎన్డీఏ అవసరాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి సాధిస్తున్నామని, అదే విధంగా ఎన్డీఏకు అవకాశం ఇస్తే తమిళనాడు కూడా వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్య మంత్రి ఆయా సభల్లో వివరించారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధి, గూగుల్, ఆర్సెల్లార్ మిట్టల్ సహా వివిధ ప్రముఖ కంపెనీల నుంచి వచ్చే పెట్టుబడులకు కేంద్రం ఇస్తున్న చేయూతే కారణమని ముఖ్యమంత్రి వివరించారు. తమిళనాడుకు పునర్ వైభవం రావాలంటే ఎన్డీఏకే సాధ్యమవుతుందని ప్రతీసభలో సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక డిలిమిటేషన్ ప్రక్రియలో జనాభాతో సంబంధం లేకుండా 50 శాతం సీట్ల పెంచుతామన్న కేంద్ర ప్రతిపాదనను తమిళులకు అర్థమయ్యేలా వివరించారు. జనాభా ఆధారంగా జరిగే డిలిమిటేషన్ వల్ల దక్షి ణాది రాష్ట్రాలకు కలిగే నష్టాన్ని కూడా వివరిస్తూ మాట్లాడారు. డీఎంకే, కాంగ్రెస్ పార్టీల విధానాల వల్ల మహిళలకు, దక్షి ణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లిందని ప్రతి సభలోనూ సీఎం ప్రస్తావించారు.

ప్రతి సభలోనూ తమిళంలో మాట్లాడి ప్రజలను ఆకట్టుకున్న సీఎం చంద్రబాబు.... స్థానిక భావోద్వేగాలను గౌరవిస్తూ ప్రచారం నిర్వహించారు. ఇక తమిళనాడుకర్ణాటక రాష్ట్రాల మధ్య నిత్యం ఉండే నీటి తగాదాలకు ఫుల్ స్టాప్ పెట్టాలంటే నదుల అనుసంధానమే మార్గమనే అంశాన్ని ఏపీ సీఎం వివరించారు. దీనికి గంగాకావేరి నదుల అనుసంధానమే మార్గమని.ఇది జరగాలంటే ఎన్డీఏకు ఓటేయాలని కోరారు. తమిళనాడులో ఎన్డీఏ అధికారంలోకి వస్తే.. అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టవచ్చని, అలాగే చాలా సమస్యలకు శాశ్వత పరిష్కారం కూడా లభిస్తుందని సీఎం వివిధ సభల్లో వివరించారు. ఇక చెన్నైకు తెలుగు గంగ ప్రాజెక్ట్ ద్వారా మంచినీటి సరఫరా వంటి అంశాలను గుర్తుచేస్తూ రెండు రాష్ట్రాల మధ్య సహకారాన్ని ప్రస్తావించారు. అన్నదమ్ముల్లా కలిసి ఉందామని, కలిసి అభివృద్ధి చెందుదామని సీఎం చంద్రబాబు చెప్పారు. అలాగే తెలుగు తమిళ ప్రజల అనుబంధం, ఎన్టీఆర్‌ఎంజీఆర్ స్నేహం, దేశాభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న కృషిని సీఎం చంద్రబాబు ప్రచార సభల్లో వివరించారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు, డిలిమిటేషన్ అంశాలపై డీఎంకే వైఖరిని తీవ్రంగా విమర్శించిన ఏపీ సీఎం, మహిళలకు అన్యాయం చేసిన పార్టీలను ప్రజలు తిరస్కరించాలన్నారు. మహిళలను ఓడించిన డీఎంకేను

# చంద్రబాబు విజన్‌ను విశ్వవ్యాప్తం చేయండి

"అజేయుడు" పుస్తకాన్ని ఆవిష్కరణ సభలో రచయుతలకు మంత్రి పార్థసారధి పిలుపు



**విజయవాడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ జర్నలిస్ట్ టీడీ ప్రసాద్ "అజేయుడు" పేరిట రచించిన పుస్తకాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆవిష్కరించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థ సారథి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో కొనసాగుతున్న ఆంధ్రపదేశ్ అభివృద్ధిలో భాగస్వాములు కావడం మనందరి అదృష్టం అన్నారు. 76 ఏళ్ల వయస్సులోనూ రాష్ట్ర అభివృద్ధి కోసమే తపిస్తున్న చంద్రబాబుపై ఎంత సాహిత్యం వచ్చినా, ఎన్ని పుస్తకాలు రాసినా తక్కువే అన్నారు. చంద్రబాబు విజన్ ప్రపంచానికే ఆదర్శమని దానిని విశ్వవ్యాప్తం చెయ్యవలసిన బాధ్యత పాత్రికేయులు, రచయితలపై ఉందన్నారు. వెటరన్ జర్నలిస్టుగా ప్రసాద్ ముఖ్యమంత్రి పై మంచి రచనలు చేయడం ముదావహమన్నారు. సహ రచయితగా వ్యవహరించిన సీనియర్ ఫ్రీలన్స్ జర్నలిస్ట్ డాక్టర్ రవి కుమార్ బొప్పన ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వ పటిమపై మంచి వ్యాసాలను రచించి ఈ పుస్తకం లో ప్రచురింప చేశారని మంత్రి కితాబు ఇచ్చారు. కార్యక్రమంలో కనదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మాజీ సభ్యుడు సతీష్, కృష్ణ జిల్లా పరిషత్ సీఈఓ డాక్టర్ జె అరుణ, సీనియర్ తెలుగు దేశం నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### అధికారం, ఆస్తుల కోసం వైఎస్సార్‌సీపీ ఎంతకైనా దిగజారుతుంది

అధికారం, ఆస్తుల కోసం వైఎస్సార్‌సీపీ ఎంతకైనా దిగజారుతుందని మంత్రి పార్థసారథి అన్నారు. వైఎస్సార్‌సీపీ విధానం విధ్వంసం, భయాందోళనలు, హత్యా రాజకీయాలు చేయడమేనని, ఈ విషయం వివేకా హత్య నుంచి దస్తగిరి హత్య వరకు పరిశీలిస్తే అర్థమవుతోందని మంత్రి పార్థసారథి అన్నారు. హత్యలు చేయిస్తారు.. పరామర్శించి మొసలి కన్నీరు కారుస్తారని ఆరోపించారు. అవినాష్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, తాడేపల్లి పెద్దలకు దస్తగిరి ?అత్యంత సన్నిహితుడని, పులివెందులలో జరిగే మంతనాల్లో దస్తగిరి తప్పనిసరిగా ఉంటారని మంత్రి పార్థసారథి అన్నారు. దస్తగిరితో సంబంధం లేదని కడప జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలు చెప్పగలరా? అని మంత్రి పార్థసారథి ప్రశ్నించారు. దస్తగిరిని చంపిన వ్యక్తులకు నిత్యానందరెడ్డి ఎందుకు ఆశ్రయమిచ్చారో సమాధానం చెప్పాలని మంత్రి పార్థసారథి అన్నారు.




# సమస్యలన్నీ పరిష్కరిస్తాం

● ప్రజల నుంచి వినతులు స్వీకరించిన రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ కెఎస్.జవహర్

**అనంతపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో మంగళవారం అన్ని షెడ్యూల్ కులముల సంఘాల నాయకులు, ప్రజల నుంచి వినతులను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ కెఎస్.జవహర్ స్వీకరించారు. ఈ సందర్భంగా నవభారత నిర్మాత, భారతరత్న డా. బిఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్, తదితరులు నివాళి అర్పించారు. జవహర్ మాట్లాడుతూ షెడ్యూల్ కులముల సంఘాల నాయకులు ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించేలా ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు బిక్షం మేకల, డాక్టర్ ప్రకంటి గౌతమ్ రాజు, రామాంజినమ్మ, రాష్ట్ర షెడ్యూల్ కులముల కమీషన్ ఉప సంచాలకులు బి.జీవపుత్ర కుమార్, డిఆర్ఓ ఏ.మలోల, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి ఖుష్బూ కొఠారి, తదితరులు పాల్గొన్నారు.

# మచ్చా దత్త రెడ్డి అద్భుత బ్యాటింగ్

● నార్త్ జోన్ బౌలర్లపై వీరోచిత బ్యాటింగ్

● 25 బాల్స్‌కి 67 పరుగులు 5 సిక్సర్లు 9 ఫోర్లు




**అనంతపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాకు చెందిన మచ్చా దత్త రెడ్డి నార్త్ జోన్ బౌలర్లపై విరుచుకుపడి గ్రౌండ్ నలమూడుల సిక్సర్లు ఫోర్‌లతో వర్షం కురిపించారు. కేవలం 27 బంతుల్లో 5ఐదు సిక్సర్లు 9 ఫోర్ లతో 67 పరుగులు సాధించి అనంతపురం జిల్లా జట్టుకు ఘన విజయం సాధించి పెట్టారు. నార్త్ జోన్ జట్టుపై అనంతపురం జిల్లా జట్టు ఘన విజయం సాధించి మొదటి విజయాన్ని నమోదు చేసింది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయ నగరంలోని ఆంధ్ర క్రికెట్ నార్త్ జోన్ క్రికెట్ అకాడమీలో జరుగుతున్న సీనియర్ ట్వంటీ జోనల్ క్రికెట్ పోటీలలో అనంతపురం జిల్లా జట్టు నార్త్ జోన్ జట్టుపై ఘన విజయం సాధించింది మంగళవారం ఉదయం టాస్ గెలిచిన అనంతపురం జట్టు మొదట బ్యాటింగ్ ఎన్నుకుంది 20 ఓవర్లలో 215 పరుగులు చేసి ఆరు వికెట్లు కోల్పోయారు అందులో మచ్చ దత్తరెడ్డి అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో అనంతపురం జట్టు భారీ స్కోరు చేసింది. అనంతపురం బ్యాట్స్మెన్లు రోహిత్ రోషన్ 49 పరుగులు గిరినాథ్‌రెడ్డి 12 పరుగులుఅర్జున్ టెండూల్కర్ 20 పరుగులు వినయ్ కుమార్ 19 పరుగులు రాజకుల్లాయప్ప 28 పరుగులు సాధించారు. 216 పరుగుల విజయలక్ష్మితో బరిలోకి దిగిన నార్త్ జోన్ జట్టు బ్యాటింగ్ వైఫల్యంతో ఓటమి చేయ చూసింది. అనంతపురం జట్టు బౌలర్లు ప్రమోద్ కుమార్ ఐదు వికెట్లు వినయ్ కుమార్ ఒక వికెట్ కామెంట్ గిర్నాథరెడ్డి ఒక వికెట్ తీసుకొని జట్టు విజయానికి కృషి చేశారు. అనంతపురం జట్టు సీనియర్ 20 20 జోనల్ పోటీలలో మొదటి విజయం నమోదు చేసింది.

# రేపే ఎపి ఈసెట్ పరీక్ష

● ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించం

● జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు



**అనంతపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త బ్యూరో:** ఎపి ఈసెట్ 2026 పరీక్ష గురువారం జరగనుందని ఎపి ఈసెట్ చైర్మన్, జెఎన్‌టియుఏ విసి సుదర్శన్ రావు పేర్కొన్నారు. జెఎన్‌టియుఏ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏపి ఈ సెట్ పరీక్షలకు 95 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో ఒకటి హైదరాబాద్‌లో, 94 రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఏపి ఈ సెట్ పరీక్షలు రాసేందుకు 33,751 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో అత్యధికంగా కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగానికి 11,924 మంది, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ విభాగానికి 9305 మంది దరఖాస్తు చేసుకోగా బయోటెక్నాలజీకి ఒక్క దరఖాస్తు కూడా రాలేదన్నారు. పరీక్షలు 23వ తేది ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో జరుగుతాయన్నారు. ఉదయం 9:00గంటలకు, మధ్యాహ్నం 2:00 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయని, అయితే వీలైనంత ముందుగానే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించే ప్రసక్తి ఉండదని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. సమావేశంలో జెఎన్‌టియుఏ రిజిస్ట్రార్ కృష్ణయ్య, సెట్ కన్వీనర్ దుర్గా ప్రసాద్, కో కన్వీనర్ భానుమూర్తి, పిఆర్‌ఓ ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు సమర్థవంతంగా సేవలందించాలి



**సచివాలయం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** సివిల్ సర్వెంట్స్ రూల్ ఆఫ్ లాకు లోబడి తన విధులను సమర్థవంతంగా సేవలు అందించేందుకు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో 18వ సివిల్ సర్వీసెస్ దినోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిపాలన వ్యవస్థకు సివిల్ సర్వెంట్లు వెన్నెముక వంటి వారని వీరి అంకితభావాన్ని, నిరంతర కృషిని గౌరవిస్తూ ప్రతి ఏడాది ఏప్రిల్ 21న జాతీయ పౌర సేవల దినోత్సవం నిర్వహిస్తున్నారని దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే అధికారులను ప్రోత్సహించడం ఈ రోజు ముఖ్యఉద్దేశ్యమని సిఎస్ సాయిప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఆర్పి సిసోడియా, సునీత, ఎం.టి.కృష్ణబాబు, ముఖ్య కార్యదర్శులు జె.శ్యామలరావు, వినయ్‌చంద్, ఎస్.యువరాజ్, హారిజవహర్ లాల్, సిఎం కార్యదర్శులు ప్రద్యుమ్న, కార్తికేయ మిశ్ర, పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖాధిపతులు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు

**విజయవాడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ సివిల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సివిల్ సర్వెంట్లకు శుభాకాంక్షలు తెలిపారు. సమర్థవంతమైన, పారదర్శక, పౌర కేంద్రీకృత పాలనను అందించడంలో వారి బాధ్యతను ఈ రోజు గుర్తుచేస్తుందని ఆయన అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి పౌరుడికి అభివృద్ధి ఫలాలు చేరినప్పుడే పాలనకు సార్థకత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. "సివిల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా దేశంలోని సివిల్ సర్వెంట్లందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. పరిపాలనను సమర్థవంతంగా, పారదర్శకంగా, పౌర కేంద్రంగా నడిపించడంలో మీరు మోస్తున్న గొప్ప బాధ్యతను ఈ రోజు మనందరికీ గుర్తుచేస్తుంది. ఈ సంవత్సరం మనం ఎంచుకున్న థీమ్, "వికసిత్ భారత్: పౌర కేంద్రక పాలన, అట్టడుగు స్థాయి వరకు అభివృద్ధి". ఇది మన ముందున్న ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశిస్తోంది. అభివృద్ధి అనేది కేవలం విధానాలకే పరిమితం కాకూడదు. అది ప్రతి ఇంటికి, ప్రతి పౌరుడికి సకాలంలో, సమర్థవంతంగా చేరినప్పుడే దానికి సార్థకత చేకూరుతుంది. క్షేత్రస్థాయిలో ప్రజలకు మేలు చేసే స్థిరమైన ఫలితాలపైనే మన పరిపాలనా వ్యవస్థ నిజమైన బలం ఆధారపడి ఉంటుందన్నారు.


## తాబేళ్ల సంరక్షణ కోసం సమన్వయ కమిటీ

**విజయవాడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర తాబేళ్ల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. వీటి పరిరక్షణ చర్యలను సమర్థవంతంగా పర్యవేక్షి ంచేందుకు ఒక రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తూ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. గతేడాది డిసెంబర్ 17న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం, అన్ని తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తాబేళ్ల సంరక్షణ కోసం ప్రత్యేక యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర అటవీ దళాల అధిపతి (పీసీసీఎఫ్) సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం, కమిటీ ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ జీవో ఆర్టీ నెం. 45ను విడుదల చేసింది. ఈ కమిటీకి రాష్ట్ర చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మత్స్యశాఖ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. వీరితో పాటు అటవీ శాఖ, కోస్టల్ సెక్యూరిటీ గ్రూప్, కోస్ట్ గార్డ్ ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు. ముఖ్యంగా, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకునేందుకు మెకనైజ్డ్ బోట్ల యజమానుల సంఘం, సంప్రదాయ మత్స్యకార సంఘాల ప్రతినిధులకు కమిటీలో స్థానం కల్పించారు. వీరితో పాటు తాబేళ్ల సంరక్షణలో అనుభవం ఉన్న ట్రీ ఫౌండేషన్, టర్టిల్ యాక్షన్ గ్రూప్ వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ), సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్‌ఆర్‌ఐ) నుంచి నిపుణులను సభ్యులుగా నియమించారు. పర్యావరణ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని పీసీసీఎఫ్‌ను ఆదేశించారు.

## పరీక్షా పర్వ్ 8.0 వేడుకలు విద్యార్థుల్లో సానుకూల దృక్పథం

**విజయవాడ, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ప్రతినిధి:** పరీక్షల సమయంలో విద్యార్థుల్లో కలిగే ఒత్తిడిని దూరం చేసి, వారిలో సానుకూల దృక్పథాన్ని నింపడమే లక్ష్యంగా జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నిర్వహిస్తున్న "పరీక్షా పర్వ్ 8.0" వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీ ఎస్ సూర్యనారాయణ రాజు పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ "పరీక్షా పే చర్చ" స్ఫూర్తితో ఏటా నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా పరీక్షలను భయంగా కాకుండా ఒక పండుగలా

# అన్న క్యాంటీన్ల నిర్వహణలో నాణ్యత పెంచాలి: సిఇఓ



**శ్రీకాకుళం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఐదు అన్న క్యాంటీన్లను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అన్న క్యాంటీన్ల సీఈవో పోతుల వంశీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్న క్యాంటీన్ల అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.కుర్మారావుతో కలిసి ఆయన మాట్లాడారు. అన్న క్యాంటీన్ల పనితీరు, భోజన నాణ్యతపై నిరంతరం ప్రజాభిప్రాయాన్ని సేకరించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. క్యాంటీన్లలో భోజనం చేసేందుకు వచ్చే సామాన్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నోడల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆముదాలవలస పురపాలక కమిషనర్ టి.రవి, శ్రీకాకుళం నగరపాలక సంస్థ, వివిధ పురపాలక సంఘాల అడ్వైజరీ కమిటీ సభ్యులు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వడదెబ్బకు గిరిజన మహిళకు అస్వస్థత

● డోలి సహాయంతో గ్రామస్తులు ఆస్పత్రికి తరలింపు

**సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా), ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలో మంగళవారం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో కుసిమి పంచాయతీ గేద్దగూడ గ్రామానికి చెందిన సవర తిక్కమ్మ వడదెబ్బ తగిలి అస్వస్థకు గురైంది. దీంతో గ్రామస్తులు డోలి సహాయంతో జజ్జువ గ్రామం వరకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి పాలకొండ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్య నిమిత్తం వైద్యులు శ్రీకాకుళం రిఫర్ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సీతంపేట మన్యంలో మంగళవారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుందని జాగ్రత్తలు పాటించాలని ముందస్తుగా వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేశారు. గెద్ద గుడా గ్రామానికి చెందిన తిక్కమ్మ తీవ్ర అస్వస్థకు గురైంది. ఉపాధి హామీ పనుల్లో మజ్జిగ, తాగునీరు మందులు, టార్పలిన్‌లు అందుబాటులో ఉంచాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ఆ విధంగా ఎక్కడ అమలు కావడం లేదని ఉపాధి వేతనదారులు ఆరోపిస్తున్నారు.

## సమ్మర్ కిడ్స్ జలకాలాటలలో..

వేసవి వచ్చిందంటే చాలు.. పాఠశాలల గడియారాలు మోనంగా మారిపోతాయి, పుస్తకాల సువాసన కాస్త తగ్గిపోతుంది, కానీ వీధుల్లో నవ్వుల శబ్దం రెట్టింపు అవుతుంది. ఈ కాలం అసలైన యజమానులు 'సమ్మర్ బాయ్స్' తమ చిన్నచిన్న ప్రపంచాల్లో పెద్ద పెద్ద ఆనందాలను వెతుక్కుంటూ తిరిగే కుర్రాళ్లు.

ఉదయం సూర్యుడు కాస్త మెల్లగా పైకి ఎగిసి వస్తుండగానే, వీరు ఇప్పటికే బయట ఉంటారు. ఎవరి చేతిలోనో బ్యాట్, ఇంకొకరి దగ్గర పాడైపోయిన టెన్నిస్ బాల్.. అంతే, వారి క్రికెట్ స్టేడియం రెడీ. రోడ్డు మధ్యలో స్టంప్స్ వేసి, ఒక సిక్స్ కొట్టగానే "అవుట్" అనే రూల్స్తో ఆడే ఆ ఆటల్లో ఓ ప్రత్యేక మజా ఉంటుంది. అక్కడ అంతర్జాతీయ నియమాలు అవసరం లేదు స్నేహమే ఒక్కటే నియమం.

మధ్యాహ్నం వేడి పెరిగినప్పుడు, చెట్టు నీడలే వీరి ఏసీ గదులు. మామిడి చెట్టు కింద కూర్చొని పచ్చి మామిడికాయలు తింటూ, ఉప్పు మిర్చి పొడి చల్లి ఆస్వాదించే ఆ రుచిని ఏ ఫైవ్ స్టార్ హోటల్ కూడా ఇవ్వలేదు. కొందరు చెరువుల దగ్గరకి వెళ్లి ఈత కొడతారు, మరికొందరు ఇంటి మేడపై కూర్చొని గాలిపటాలు ఎగరేస్తారు.





సాయంత్రం సమయం అయితే మరింత సందడి. గిల్లీదండా, కబడ్డీ, లగోరి.. ఒక్కో ఆట ఒక్కో జ్ఞాపకం. ఈ కుర్రాళ్లకు మొబైల్ ఫోన్లు అవసరం లేదు. వారి ఆటలే వారి ఎంటర్టైన్మెంట్. చీకటి పడే వరకు నవ్వులు, అరుపులు ఆగవు. కానీ "సమ్మర్ బాయ్స్" అంటే కేవలం ఆటలే కాదు. ఈ కాలంలోనే వాళ్ల జీవితాన్ని కూడా నేర్చుకుంటారు. ఓటమిని అంగీకరించడం, గెలుపును పంచుకోవడం, స్నేహాన్ని నిలబెట్టుకోవడం. చిన్న చిన్న గొడవలు పడతారు, వెంటనే మళ్ళీ కలిసిపోతారు. అదే వారి నిజమైన బలం.

ఇప్పటి డిజిటల్ యుగంలో ఈ దృశ్యాలు కొంచెం తగ్గుతున్నా, ఇంకా కొన్ని ఊళ్లలో, కొన్ని వీధుల్లో ఈ సమ్మర్ బాయ్స్ జీవిస్తున్నారు. వారి నవ్వుల్లో వేసవి అసలు అర్థం దాగి ఉంది. వేసవి ముగిసిన తర్వాత పాఠశాలలు మళ్లీ మొదలవుతాయి. కానీ ఈ కుర్రాళ్ల జ్ఞాపకాలలో ఈ సెలవులు ఎప్పటికీ నిలిచిపోతాయి. ఎందుకంటే వేసవి వారి బాల్యానికి ఉన్న అత్యంత అందమైన అధ్యాయం. ●

## ఐఏఎస్ అన్న రాజం తొలి మజిలీ



భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన 1951లో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్)లో చేరిన మొట్టమొదటి మహిళ అన్న రాజం మల్హోత్రా (వివాహపూర్వం జార్జ్). ఆమె 1950లో పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి భారతదేశపు మొట్టమొదటి మహిళా ఐఏఎస్ అధికారిణిగా గుర్తింపు పొందారు. ఆమె తన మొదటి నియామకంగా తిరుపత్తూరు సబ్ కలెక్టర్గా నియమితులయ్యారు. ఆ పదవిని చేపట్టిన మొదటి మహిళగా నిలిచారు. తనను తాను మహిళా సాధికారతకు ప్రతీకగా ఎప్పుడూ భావించుకోలేదు. తాను కేవలం తన పనిని చక్కగా చేయాలనుకుంటున్నానని ఆమె తరచుగా చెప్పేవారు. అయినప్పటికీ, అలా చేయడం ద్వారా, ఆమె వ్యవస్థనే మార్చారు. లెక్కలేనంత మంది మహిళా అధికారులు ఆమెను అనుసరించడానికి మార్గం సుగమం చేశారు. ఆ తర్వాత, ఆమె మద్రాసు ప్రభుత్వంలోని వివిధ శాఖలలో అండర్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ పదవులను నిర్వహించారు. భారత ప్రభుత్వంలో, ఆమె ఆర్థిక మంత్రిత్వ శాఖ, వ్యవసాయ మంత్రిత్వ శాఖ, విద్యా, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ మొదలైన ముఖ్యమైన మంత్రిత్వ శాఖలలో పనిచేశారు. తన సర్వీసు కాలంలో ఏడుగురు ముఖ్య మంత్రులు, ఎనిమిది మంది ప్రధానమంత్రులతో కలిసి పనిచేసిన ఘనత ఆమెకు ఉంది. నవశేవా పోర్ట్ ట్రస్ట్ ఛైర్పర్సన్గా ఆమె పదవీకాలంలో, దానిని భారతదేశపు మొట్టమొదటి కంప్యూటరీ కరించిన ఓడరేవు (పోర్టు)గా మార్చడంలో మల్హోత్రా కీలక పాత్ర పోషించారు. ముంబాయిలోని పశ్చిమ తీర ప్రాంతంలో గల నవశేవా పోర్ట్ (జవహర్లాల్ నెహ్రూ పోర్ట్, జేఎన్పీఏ) భారత దేశంలోనే అతిపెద్ద కంటైనర్ పోర్ట్. మహిళలకు వృత్తిపరమైన అవకాశాలు చాలా తక్కువగా ఉండే ఆ కాలంలో, అన్నా చెన్నైలోని అకౌంటెంట్ జనరల్ కార్యాలయంలో "అప్పర్ డివిజన్ క్లర్క్ (యుడిసి)"గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. కాగా 1950లో, ఇంజనీరైన ఆమె బంధువు ఒకరు సివిల్ సర్వీసెస్ పరీక్ష దరఖాస్తు పత్రాన్ని ఇంటికి తీసుకువచ్చేంత వరకు, సివిల్ సర్వీసుల్లో చేరాలనే ఆలోచన ఆమెకు ఏమాత్రం లేదు. సివిల్స్ పరీక్ష దరఖాస్తు కోసం చెల్లించాల్సిన రు.140 కూడా ఆ రోజుల్లో ఒక సాధారణ కుటుంబమైన వారికి, భారీ మొత్తంగా అని పించడంతో ఆమె స్నేహితురాలి తల్లి ఒకరు సాయమందించారు. యూపీఎస్సీ ఛైర్మన్ నేతృత్వంలో, నలుగురు ఐసిఎస్ అధికారులతో కూడిన ఇంటర్వ్యూ బోర్డు కూడా ఆమెను పరిపాలనా సేవలో చేరవద్దని నిరుత్సాహపరిచింది. మహిళలకు మరింత అనువైనవిగా వారు భావించే ఫారిన్ సర్వీస్ లేదా ఇతర సెంట్రల్ సర్వీసెస్లో చేరేందుకు ఆమెకు సూచించారు. అయితే కష్టపడి సాధించిన దానిని అంత సులభంగా వదులుకునే నైజం లేని అన్నా రాజం మాత్రం 'పురుషులు పరిపాలనా విధులు నిర్వహించగలిగినప్పుడు, స్త్రీలు ఎందుకు నిర్వహించలేరు?' అని ఆమె ఎదురు ప్రశ్నించారు. ఆమె ముందు నిలిచిన ప్రతి అడ్డంకి కూడా ఆమె ప్రగతిని నిలిపే అడ్డు గోడగా కాకుండా, అధిరోహించే నిచ్చెన మెట్లుగా మారాయి. అప్పటి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి చక్రవర్తుల రాజగోపాలాచారి సహా ప్రభుత్వ ఉన్నతాధికారులు ఒక మహిళను క్షేత్రస్థాయి పదవికి ప్రత్యేకించి జిల్లా సబ్కలెక్టర్ బాధ్యతలు అప్పగించడం పట్ల సందేహం వెలిబుచ్చినట్లు పలు నివేదికలు సూచిస్తున్నాయి. అయితే, గుర్రపు స్వారీ, రైఫిల్, రివాల్వర్ షూటింగ్ , మేజిస్ట్రేట్ అధికారాల వినియోగంలో శిక్షణ పొందిన ఆమె మాత్రం దీనిని అంగీకరించడానికి నిరాకరించారు. అప్పుడు హోం మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా ఉన్న సర్దార్ పటేల్ ఆమెకు అండగా నిలిచి ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్లో చేరడానికి తన సంపూర్ణ మద్దతు ఇచ్చారు. మహిళల ప్రవేశానికి వీలు కల్పించేలా సివిల్ సర్వీసెస్ను సంస్కరించిన ఘనత పటేల్కే దక్కుతుంది. చివరికి ఆమె పంతం నెగ్గి మద్రాసు రాష్ట్రంలోని తిరుపత్తూరు సబ్కలెక్టర్గా నియమితులయ్యారు. ఎట్టకేలకు, వివాహం చేసుకుంటే సేవలను రద్దు చేస్తామన్న షరతుతో కూడిన ఉత్తర్వుతో ఆమె నియామకం జరిగింది. ఆమె దానిని సవాలు చేయనప్పటికీ, ఆ వివక్షాపూరిత నిబంధనను అధిగమించి, చివరికి తన బ్యాచ్మేట్ అయిన ఆర్.ఎన్. మల్హోత్రాను 1975లో ఆయన అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) లో బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు వివాహం చేసుకున్నారు. సివిల్ సర్వెంట్గా ఆమె సుదీర్ఘ ప్రయాణంలో, ఆమె అధిగమించిన అనేక అడ్డంకులలో ఆ బోర్డు మొట్టమొదటి మజిలీ మాత్రమే. అత్యంత బాధ్యతాయుతమైన అధికార హోదాలను సమర్థవంతంగా నిర్వహించడంలో అన్నా రాజం మల్హోత్రా తన తర్వాతి తరాల మహిళలకు మార్గాలను సుగమం చేశారు. భారతదేశపు మొట్టమొదటి మహిళా ఐఏఎస్ అధికారిణి అయిన అన్నాకు తన ఉద్యోగం పట్ల అచంచలమైన అంకితభావం ఉండేది. పురుషాధిక్య వ్యవస్థలో ఆమె ప్రశాంతమైన సంకల్పం, కఠోర శ్రమ ప్రత్యేకంగా నిలిచాయి. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత, అప్పటి మద్రాసు రాష్ట్రానికి కేటాయించబడిన ఆమెకు మొదటి నియామకంగా రాష్ట్ర సచివాలయంలో ఒకపదవిని ప్రతిపాదించారు. పురుషాధిక్యం కొనసాగుతున్న ఆ రోజులలో ఆమె తరచుగా ఏకైక మహిళా అధికారిణిగా ఉండేవారు. మరింత ఆశ్చర్య కరంగా ఆ రోజులలో మహిళా అధికారులకు వసతి కల్పించడానికి అదనపు మౌలిక సదుపాయాలు లేదా ప్రోటోకాల్లు ఏవీ ఉండేవి కావు. మూడు దశాబ్దాలకు పైగా ఆమె రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలో అనేక కీలక పదవులను నిర్వహించారు. భారత ప్రభుత్వానికి కార్య దర్శిగా పనిచేసిన మొట్టమొదటి మహిళగా కూడా ఆమె ఘనత సాధించారు. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా, భారత ప్రభుత్వం 1989లో ఆమెను దేశంలోని అత్యున్నత పౌరపురస్కారాలలో ఒకటైన పద్మభూషణ్తో సత్కరించింది. 1996లో పదవీ విరమణ చేసిన ఆమె 2018లో 91 ఏళ్ల వయసులో కన్నుమూశారు.

▪ యేచన్ చంద్ర శేఖర్

## చక్కెర వ్యాధికి మధుర ఫలంతో చెక్!

మేలిమి బంగారు ఛాయల మిసిమి పండ్లంటే ఏమిటో తెలుసా!

అదేనండి మామిడి పళ్లు. అవి ఇప్పుడు మధురఫల రసాలే అయినా మధురానుభూతిని ఇచ్చే రసఫలాలు కూడా. ఎండ తీవ్రత తట్టుకోలేక గ్రీష్మతాపాన్ని భరించలేని కాలంలో 'మామిడి' మధుర సంతర్పణ చేస్తుంది. కానీ ఇలాంటివి ఇప్పుడు అందరికి తినే యోగ్యత ఉండదు. అదేనండి ఊబకాయులకు నిషిద్ధమన్నమాట. మామిడి తినీ తినగానే ఊబకాయుల్లో చక్కెర స్థాయిలు ఇట్టే పెరిగిపోతాయట. ఇదొక అధ్యయనం ద్వారా తెలిసిన విషయాలు. రోజూ మామిడిని తింటేనే ఈ తిప్పలు. ఎప్పుడైనా తింటే పర్వాలేదన్నమాట. కానీ దీని ప్రభావంపై ఓక్లహమా యూనివర్సిటీ పరిశోధకులు చేసిన పరిశోధనల్లో మామిడితో గ్లూకోజు అదుపులో ఉంటుందని తేల్చారు. అలా అని 'పండ్ల బుట్టలు లాగించేస్తే ఏమవుతుందో మరికొన్ని అధ్యయనాలు కాస్త భిన్నంగానే చెప్పాయి. ప్రతి పది గ్రాముల మామిడి తాండ్రను కొంతమంది చేత తినిపించి పన్నెండు వారాల తర్వాత పరిశీలిస్తే గ్లూకోజు మోతాదులో గణనీయంగా తగ్గాయట. మామిడిలోని పాలీఫెనాల్స్ రొమ్ము కేన్సర్, కేన్సర్ రహిత కణాల్లో వాపులను అదుపు చేస్తున్నట్లు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ●



## వేసవిలో సిలిండర్తో జాగ్రత్త



వేసవిలో గ్యాస్ సిలిండర్ను సురక్షితంగా ఉపయోగించడానికి కొన్ని జాగ్రత్తలు..

సిలిండర్ను నేరుగా ఎండలో పెట్టకండి. చల్లని, గాలి తిరిగే ప్రదేశంలో ఉంచండి.

స్టవ్ దగ్గర వేడి ఎక్కువగా ఉండే ప్రదేశంలో సిలిండర్ను పెట్టవద్దు. సిలిండర్ దగ్గర దహన పదార్థాలు (పేపర్, ప్లాస్టిక్, ఆయిల్ మొదలైనవి) పెట్టకండి. రెగ్యులేటర్, పైప్ లీక్ అవుతుందేమో తరచుగా చెక్ చేయండి. గ్యాస్ వాసన వస్తే వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేసి, కిటికీలు తలుపులు తెరచి గాలి వెళ్లేలా చేయండి. ఎలక్ట్రిక్ స్విచ్లు ఆన్/ఆఫ్ చేయకండి, అగ్గి వెలిగించకండి. సిలిండర్ను ఎప్పుడూ నిలువుగా ఉంచాలి. పిల్లలు సిలిండర్ దగ్గర ఆడకుండా జాగ్రత్త పడండి. ఈ జాగ్రత్తలు పాటిస్తే వేసవిలో గ్యాస్ సిలిండర్ను సురక్షితంగా ఉపయోగించవచ్చు. ●

## వామ్మో.. 69



అసాధ్యమో! సుసాధ్యమో.. ఆ తర్వాత ఒక్క బిడ్డకే జన్మనివ్వాలంటే ఎగాదిగా చూస్తున్న తల్లిదండ్రులున్న ఈ లోకంలో ఓ మాతృమూర్తి 60 మంది పిల్లల్ని కని రికార్డులెక్కిందంటే నమ్మాలి మరి. ఆ రికార్డుల్లో కెక్కడమంటే ఆషామాషీ కాదు. 18వ శతాబ్దంలో పుట్టిన వాలంటీనా ఆమె భర్త ఫీడర్ వస్సిల్ యేల్లు 69 మంది పిల్లలకు జన్మనిచ్చారు.
వాలెంటీనా వస్సిస్యెవా రష్యాలోని శుయా నగరంలో ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించింది. ఒక్కో ప్రసవానికి గర్భస్థ సమయం 9 నెలలు కదా! అంతమంది పిల్లలు ఎలా? ఆశ్చర్యమే. విశేషమేమిటంటే అనుమానాలకు జవాబు దొరికింది. ఆమెకు ఒక్కోసారి కవలలు, ఒక్కో కాన్పుకు నలుగురు పిల్లల్ని ప్రసవించిన లెక్కలున్నాయి. ఊరికే రికార్డుల్లో కొస్తుందా! ●

## ధర్మజ్యోతి



మహాభారతం కథల్లో శ్రీకృష్ణుని ముఖ్య పాత్రధారి అక్రూరుడు. ఆయన యాదవ వంశానికి చెందినవాడు శ్రీకృష్ణునికి బంధువుగా ప్రసిద్ధి పొందాడు. అక్రూరుడు భక్తి, ధర్మనిష్ఠలతో ప్రసిద్ధి గాంచినవాడు. కంసుడు శ్రీకృష్ణుడు, బలరాముడిని మథురకు తీసుకురమ్మని పంపినప్పుడు, అక్రూరుడు ఆ బాధ్యతను నిర్వర్తించాడు. మార్గమధ్యంలో ఆయన శ్రీకృష్ణుని దివ్యరూపాన్ని దర్శించి పరమానందాన్ని పొందాడు. ఈ సంఘటన ఆయన గొప్ప భక్తుడిగా నిలిచేలా చేసింది. అక్రూరుడు ధర్మబద్ధత, విశ్వాసం, భక్తి లక్షణాలకు ప్రతీకగా భావించబడుతాడు.


## తండ్రి విలువను చాటిచెప్పే కథ

కుటుంబం కోసం తండ్రి పడే ఆరాటాన్ని, ఆయన త్యాగాలను వెండితెరపై ఆవిష్కరిస్తూ రూపొందిన చిత్రం ఓ తండ్రి కథ. నంది వెంకట్ రెడ్డి దర్శకత్వంలో, ఎల్వి క్రియేషన్స్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్పై అశోక్ రెడ్డి లెంకల నిర్మించిన ఈ భావోద్వేగ భరిత చిత్రం మే 1న థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది. తాజాగా హైదరాబాద్లోని తెలుగు ఫిలిం ఛాంబర్లో ఈ చిత్ర ఆడియో, ట్రైలర్ లాంచ్ కార్యక్రమం సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ దర్శకులు వి. సముద్ర, సంజీవ్ కుమార్ మేగోటి చిత్ర ట్రైలర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తరం మారినా తల్లిదండ్రులుపిల్లల మధ్య ఉండే అనుబంధం మారదు. తండ్రి విలువను వివరిస్తూ ఇలాంటి సందేశాత్మక చిత్రం తీయడం సాహసోపేతమైన నిర్ణయం. నేటి తరం యువత తప్పక చూడాల్సిన సినిమా ఇది.. అని చిత్ర బృందాన్ని అభినందించారు. నిర్మాత అశోక్ రెడ్డి లెంకల మాట్లాడుతూ.. తండ్రి బాధ్యతలను, పిల్లలతో ఆయనకు ఉండే అనుబంధాన్ని అత్యంత సహజంగా ఈ కథలో చూపించాం. ప్రతి ఇంట్లో ఉండే నాన్న పాత్రను ఈ సినిమాలో ప్రతిబింబించాం. కచ్చితంగా ఈ సినిమా కుటుంబ ప్రేక్షకులందరినీ కదిలిస్తుంది అని తెలిపారు. ఈ చిత్రంలో అశోక్ రెడ్డి లెంకల తండ్రి పాత్రలో నటించడం విశేషం. డ్రమ్స్ రాము సంగీతం అందించగా, అన్విక ఆడియోస్ ద్వారా పాటలు విడుదలయ్యాయి. వైఎస్కె, నిహారిక చౌదరి, వరేణ్య ఆగ్రా, విజయలక్ష్మీ తదితరులు నటించిన ఈ చిత్రానికి యాదగిరి ఛాయాగ్రహణం, శ్రీశైలం ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఘర్షణ శ్రీనివాస్, దొరరాజు, కళా రాజేష్ తదితరులు పాల్గొని చిత్ర యూనిట్కు శుభాకాంక్షలు తెలిపారు.



## మనుషులే దెయ్యాలను భయపెడితే..

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో వైవిధ్యమైన కథాంశాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు మహి వి. రాఘవ్. పాఠశాల, యాత్ర వంటి సీరియస్ సినిమాలతో పాటు ఆనందో బ్రహ్మ వంటి హారర్ కామెడీతో ప్రేక్షకులను మెప్పించిన ఆయన, ఇప్పుడు మరో వినూత్న కాన్సెప్ట్తో ముందుకు వస్తున్నారు. మహి వి. రాఘవ్ షో రన్నర్గా వ్యవహరిస్తున్న తాజా చిత్రం ఓం శాంతి డిస్కో శాంతి టైటిల్, మోషన్ పోస్టర్ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. సాధారణంగా హారర్ సినిమాల్లో దెయ్యాలు మనుషులను భయపెట్టడం మనం చూస్తుంటాం. కానీ ఓం శాంతి డిస్కో శాంతిలో కథ దీనికి పూర్తి భిన్నంగా ఉండబోతోంది. అసలు భయం అంటే ఏమిటో తెలియని కొందరు పిచ్చివాళ్లు ఒక దెయ్యం ఉన్న చోటికి వెళ్తే.. అక్కడ ఆ దెయ్యం పడే పాట్లు, జరిగే గందరగోళమే ఈ సినిమా కథాంశం. దెయ్యాలు మనుషులను భయపెట్టడం పాత పద్ధతి.. ఇప్పుడు మనుషులే దెయ్యాలను భయపెడితే ఎలా ఉంటుంది? అనే క్రేజీ పాయింట్తో ఈ స్పూకీ ఫన్ జర్నీ సాగనుంది. ఈ సినిమాకు "ఆల్ రెడీ కాషన్ కియా.. ఆల్ రెడీ అనే ఆసక్తికరమైన ట్యాగ్లైన్ను జత చేశారు. ఈ వెరైటీ క్యాప్షన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యింది. సేవ్ ది టైగర్స్ వంటి సూపర్ హిట్ వెబ్ సిరీస్తో ఫుల్ ఎంటర్టైన్మెంట్ ఇచ్చిన మహి వి. రాఘవ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. గోగు ఆర్.ఆర్. దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి మహి వి. రాఘవ్ కథ, స్క్రీన్ ప్లే, మాటలు అందించారు. త్రీ ఆటమ్ లీవ్స్ బ్యానర్పై శివ మేక, సాహితి చింతలపూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కృష్ణ కుమార్ సంగీతం అందిస్తుండగా, జ్ఞానశేఖర్ వి.ఎస్. సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. రిలీజ్ డేట్జంప్ స్కేర్లు, ఫన్నీ డైలాగులు, ఊహించని ట్విస్టులతో నిండిన ఈ హారర్ కామెడీ ఎంటర్టైనర్ సెప్టెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది.



## మళ్లీ అదే హిట్ సెంటిమెంట్తో..

నందమూరి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఎన్బికె 111 ప్రాజెక్ట్ ఎట్టకేలకు పట్టాలెక్కింది. వీరసింహా రెడ్డి వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్లో వస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్ షూటింగ్ సోమవారం అధికారికంగా ప్రారంభమైంది. ఈ సినిమా షూటింగ్ వాస్తవానికి కొంతకాలం క్రితమే ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, స్క్రిప్ట్ విషయంలో గోపీచంద్ మలినేని పక్కాగా కసరత్తు చేయడం వల్ల కొంత జాప్యం జరిగింది. బాలయ్య ఇమేజ్కు తగ్గట్టుగా, మాస్ ఎలిమెంట్స్ తో పాటు పవర్ఫుల్ ఎమోషన్స్ కలగలిపిన కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అవుట్పుట్ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదనే ఉద్దేశంతో చిత్ర బృందం పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగింది. ఈ సినిమాలో బాలకృష్ణ సరసన లేడీ సూపర్ స్టార్ నయనతార కథానాయికగా నటిస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన సింహా, శ్రీరామరాజ్యం, జై సింహా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించాయి. సుదీర్ఘ విరామం తర్వాత మళ్ళీ ఈ క్రేజీ పెయిర్ కలిసి నటిస్తుండటంతో సినిమాపై హైప్ రెట్టింపు అయ్యింది. థమన్ మ్యూజిక్ మ్యాజిక్..అఖండ, వీరసింహా రెడ్డి, భగవంత్ కేసరి వంటి సినిమాలకు తన నేపథ్య సంగీతంతో థియేటర్లను దడదడలాడించిన ఎస్.ఎస్. థమన్, ఈ సినిమాకు కూడా సంగీతాన్ని అందిస్తున్నారు. బాలయ్య ఎలివేషన్ సీన్లకు థమన్ ఇచ్చే స్కోర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. సినిమాస్ బ్యానర్పై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్తో నిర్మిస్తున్నారు. మేకింగ్ విషయంలో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ షూటింగ్ షెడ్యూల్ నిరంతరాయంగా సాగనున్నట్లు సమాచారం. నందమూరి అభిమానులకు మరో మాస్ ట్రీట్ ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.





## తెర

## సమగ్ర కుటుంబ కథా చిత్రం పిఠాపురంలో .. అలా మొదలైంది..

"పిఠాపురంలో .. అలా మొదలైంది" కుటుంబ కథా చిత్రం.. ఈ సినిమాలో తండ్రీకూతుళ్ల బంధాన్ని అద్భుతంగా చూపించాం.. నిర్మాతలు దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్. ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్ పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్. ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) "పిఠాపురంలో.. అలా మొదలైంది" చిత్రాన్ని నిర్మించారు. సీనియర్ దర్శకులు మహేష్ చంద్ర దర్శకత్వంలో ఈ మూవీ రూపుదిద్దుకుంది. డాక్టర్ రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ఇందులో ప్రధాన పాత్రలను పోషించారు. ఈ సినిమాని మే 1న గ్రాండ్గా రిలీజ్ చేయనున్నారు. ఈ క్రమంలో నిర్మాతలు దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్. ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. ఈ క్రమంలో.. నిర్మాత దుండిగల్ల బాలకృష్ణ మాట్లాడుతూ.. దాదాపు 75 శాతం షూటింగ్ పిఠాపురంలోనే చేశాం. హైదరాబాద్, గోవాల్లోనూ కొంత పార్ట్ షూట్ చేశాం. మహేష్ చంద్ర గారితో మాకు ఎన్నో ఏళ్ల నుంచి బంధం ఉంది. ఆకుల సురేష్ గారితో మహేష్ చంద్ర గారు ఓ సినిమా చేయాలని అనుకున్నారు. ఆ తరువాత మేం జాయిన్ అయ్యాం. భారీ తారాగణంతో కేవలం 45 రోజుల్లోనే షూటింగ్ కంప్లీట్ చేశారు. ఇది పూర్తిగా కుటుంబ కథా చిత్రం.



## 'కాస్ట్' మూవీ కీలక పాత్రలో.. నాగబాబు

'కాస్ట్' మూవీ నుంచి రంగరాజన్గా నాగబాబు పవర్ ఫుల్ ఫస్ట్ లుక్ రిలీజ్. వరుణ్సందేశ్, గగన్, సత్యం రాజేష్, రవి ప్రధాన పాత్రల్లో ఎకె జంపన్న రచన, దర్శకత్వంలో గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్న చిత్రం కాస్ట్. ఈ సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంలో నాగబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రని రంగరాజన్గా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ని రిలీజ్ చేశారు మేకర్స్. నల్లదుస్తుల్లో, మెడలో రుద్రాక్షమాల, నుదుటిపై తిలకం ధరించి, ఇంటెన్స్గా చూస్తున్న నాగబాబు లుక్ పవర్ ఫుల్గా ఉంది. ఈ గెటప్ ఆయన పాత్రలోని కమాండ్, అథారిటీ చూపిస్తోంది. ఇందులో ఆయన పాత్ర నిర్భయంగా, కులాలకు అతీతమైన మానవత్వంతో ఉండబోతుంది. ఈ చిత్రంలో కశికా కపూర్, దివి హీరోయిన్స్గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. మేకర్స్ త్వరలోనే రిలీజ్ డేట్ని అనౌన్స్ చేయనున్నారు.



## టిఎఫ్డిఎ కోసం రూ.30 కోట్లతో పది సినిమాలు

టీఎఫ్డీఏ కోసం ముప్పై కోట్లతో పది సినిమాలు నిర్మిస్తున్న చదలవాడ శ్రీనివాసరావు గారికి శతసహస్ర కృతజ్ఞతాభివందనాలు తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ఎన్. ఆదిత్య ప్రముఖ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ (గినీదీతి) ఆధ్వర్యంలో ముప్పై కోట్ల బడ్జెట్తో పది సినిమాల్ని నిర్మించనున్నారు. ఈ మేరకు టీఎఫ్డీఏ సోమవారం నాడు మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి చదలవాడ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు వి.ఎన్. ఆదిత్య, ట్రెజరర్ సాయి రాజేష్, వైస్ ప్రెసిడెంట్ సముద్ర, ప్రముఖ దర్శకులు నవీన్ మేడారం, అజయ్ కుమార్, ప్రసన్న కుమార్ తదితరలు హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో.. వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ.. .."మా కమిటీ కొత్తగా ఎన్నికైంది. మేం విద్య, వైద్యం, ఉపాధి అనే అంశాల మీదే ఫోకస్ పెట్టాం. చదలవాడ శ్రీనివాసరావు గారు ఉగాది నాడు ఓ గొప్ప ఆలోచనను మాతో పంచుకున్నారు. సాయి రాజేష్ మాట్లాడుతూ.. .."టీఎఫ్డీఏకి ట్రెజరర్గా ఉండటం గర్వంగా ఉంది. విద్య, వైద్యం, ఉపాధి అనే నినాదంతో మేం ఎన్నికల్లో గెలిచాం. ఉపాధి ఎలా కల్పించాలనే మథనం మా అందరిలో ఉండేది. అయితే ఉగాది నాడు చదలవాడ శ్రీనివాసరావు గారు దేవుడి రూపంలో మాకు వరమిచ్చారు. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మీడియా నాకు ఎన్నోఏళ్ల నుంచి సపోర్ట్గా ఉంది.





# అభి పరుగుల ఉప్పెన

# షేక్

## ఐపిఎల్‌లో మరో సెంచరీ నమోదు

## ఉప్పల్‌లో శతక్కొట్టిన ఆరెంజ్ ఆర్మీ



68 బంతుల్లో 135 నాటౌట్

25 బంతుల్లో 50 రన్స్

47 బంతుల్లో 47 రన్స్

10 ఫోర్లు, 10 సిక్స్‌లు

ఐపిఎల్‌లో రెండో సెంచరీ

ఉప్పల్‌లోనే 2 శతకాలు

*గుజరాత్ టైటాన్స్‌పై తిలక్ వర్మ శతక్కొడితే... 24 గంటల్లోనే ఆ వంతు అభిషేక్ తీసుకున్నాడు. ఢిల్లీని షేక్ చేశాడు. ఉప్పల్‌లో పరుగుల ఉప్పెన సృష్టించాడు. దీంతో ఐపీఎల్ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో పరుగుల వరద, సెంచరీల మోత మోగుతోంది. సరికొత్త రికార్డులను నెలకొల్పుతోంది. తొలి సెంచరీకి కాస్త ఆలస్యమైనా ఆ వెంటవెంటనే నాలుగు శతకాలు నమోదయ్యాయి. జస్ట్ పది రోజుల వ్యవధిలోనే. అందులో 24 గంటల వ్యవధిలో రెండు సెంచరీలు. ఎపుడు ఎవరూ సెంచరీ సాధిస్తారో చెప్పలేని విధంగా ఐపీఎల్ మారింది. ఒకే మ్యాచ్‌లో ఇద్దరూ సెంచరీలు చేసే ఊపులో కనిపించారు. అలాగే పలువురు సెంచరీలకు దరిదాపుల్లోకి వచ్చారు. బ్యాటర్లు విరుచుకు పడుతుండడంతో 200 ప్లస్ స్కోర్లు సర్వసాధారణంగా మారాయి.*

**హైదరాబాద్, ఏప్రిల్ 21(వార్త క్రీడా ప్రతినిధి)**

క్రికెట్‌లో సెంచరీది ప్రత్యేకమైన స్థానం. శతక్కొట్టేవారికి ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. బ్యాట్ పట్టిన ప్రతి ఒక్కరూ కుదిరితే సెంచరీ చేయాలన్నదే కల. సెంచరీ సాధించడం సిక్స్‌లు కొట్టినంత తేలికకాదు. బ్యాట్ ఝుళిపిస్తే సెంచరీలు రాలవు. ఇది కేవలం పరుగుల వేట మాత్రమే కాదు, మానసిక స్థైర్యానికి సంబంధించిన పరీక్ష. శతకం సాధించాలంటే ఉండాల్సిన ముఖ్యమైన గుణం ఓపిక. క్రీజులో ఎక్కువ సమయం ఉండాలి. బంతికి బంతికి పరుగులు తీయాలనే తొందరపాటు కాకుండా, మంచి బంతులను గౌరవిస్తూ, చెడ్డ బంతులను బౌండరీలకు తరలించాలి. ఇక 90లలోకి వచ్చినపుడు పెరిగే ఒత్తిడిని అధిగ మించాలి. ఆ సమయంలో తొందరపడి వికెట్ పారేసుకోకుండా, ఓపిగ్గా ఆడి సెంచరీ పూర్తి చేసుకోవాలి. వికెట్ ఎలా ఉంది, బౌలర్లు ఎలా వేస్తున్నారు అని గమనించి, ఆటతీరును మార్చుకోవాలి. సమయం రావాలి, వచ్చేవరకు ఓపిగ్గా ఎదురు చూడాలి అనే కాన్సెప్ట్ వల్లనే సంజూ శాంమ్సన్, క్వింటాన్ డికాక్, తిలక్ వర్మ, ఇపుడు అభిషేక్ వర్మ సెంచరీ హీరోలు కాగలిగారు.

**అభిషేకింగ్:** అభి అంటే మొదటి బంతికే సిక్స్. కానీ ఈసారి డబుల్‌తో పరుగుల ఖాతా తెరిచాడు. దూకుడుకు పోకుండా ఆచితూచి ఆడాడు. ఎదుర్కొన్న 7 బంతికే ఫోర్, 11వ బంతికి మరో ఫోర్ బాదాడు. ఎండిగి ఓవర్లో రెండు ఫోర్లు, నితిష్ రాణా ఓవర్లో రెండు సిక్స్‌లతో 25 బంతుల్లో హాఫ్ సెంచరీ కంప్లీట్ చేశాడు. అక్షర్, కుల్దీప్ బంతులను సిక్స్‌లుగా మలిచిన అభిషేక్... నితీష్‌రాణా ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లతో మరో 22 బంతులకు ఐపీఎల్‌లో రెండో సెంచరీ సాధించాడు. ఆ తర్వాత మరో ఫోర్, సిక్స్‌తో 23 రన్స్ పిండుకున్నాడు. కడదాకా క్రీజ్‌లో నిలిచి 135 రన్స్ చేశాడు.

**తొలి సెంచరీ హీరో సంజు :** టీట్వంటీ వరల్డ్‌కప్ హీరో సంజూ శాంసన్... ఐపీఎల్ 2026 సీజన్‌లో మొదటి సెంచరీని తన పేరిట లిఖించాడు. సెంచరీకోసం సంజూ వెయిట్ చేస్తున్నట్లు కాక అతని కోసం శతకం ఎదురుచూసినట్లుగా మారింది.వరుసగా 3 మ్యాచ్‌ల్లో నిరాశపరిచిన సంజూ... ఢిల్లీ క్యాపిటల్స్‌పై చెపాక్‌లో 56 బంతుల్లో అజేయంగా 115 పరుగులు చేశాడు. చివరి వరకూ క్రీజ్‌లో నిలిచాడు. రెండు వందలకు పైగా స్ట్రయిక్ రేట్‌తో... 15 ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో శతకం బాదాడు.

**వస్తూనే సెంచరీ మోత :** దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ క్వింటన్ డికాక్... ఈ ఐపీఎల్ సీజన్‌లోకి ముంబై ఇండియన్స్ తరపున గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చాడు. వస్తూనే సెంచరీతో మెరిశాడు. వాంఖడే స్టేడియం వేదికగా పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లో అద్భుత సెంచరీ చేశాడు. 60 బంతుల్లోనే 112 పరుగులతో అజేయంగా నిలిచాడు. 8 ఫోర్లు, ఏడు సిక్స్‌లతో అలరించాడు.


**సెంచరీ తిలకం:** తిలక్ వర్మ... ముంబై ఇండియన్స్‌కు ఆడుతూ గుజరాత్‌పై అహ్మదాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో కేవలం 45 బంతుల్లో 101 పరుగులతో శతకొట్టాడు. ఐపీఎల్ కెరీర్‌లో తొలి సెంచరీ నమోదుచేశాడు.22బంతుల్లో కేవలం 19 రన్స్ చేసిన తిలక్.. ఆ తర్వాత గేర్ మార్చి సునామీలా విరుచుకుపడ్డాడు. 33 బంతుల్లో హాఫ్ సెంచరీ. మరో 12 బంతులు ముగిసేసరికి సెంచరీ సాధించాడు.

ఇక పంజాబ్ కింగ్స్ ప్లేయర్లు ప్రియాన్ష్ ఆర్య(93), కూపర్ కొన్నోలీ(87) కూడా ఒకే మ్యాచ్‌లో సెంచరీ చేసే ఊపులో కనిపించారు. లక్నో సూపర్ జెయింట్స్‌పై ప్రియాన్స్ 37 బంతుల్లో 93 రన్స్, కూపర్ కొన్నోలీ 87 రన్స్‌తో మెరిశారు. వీరేకాక కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, సమీర్ రిజ్వీ 90లలోకి వచ్చి తృటిలో సెంచరీ చేజార్చుకున్నారు. ఇక మెరుపు హాఫ్ సెంచరీలకేతే లెక్కేలేదు.

## సొంతగడ్డపై రైజర్స్ హ్యాట్రిక్ విన్

**హైదరాబాద్:** ఉప్పల్ స్టేడియంలో సన్ రైజింగ్ కొనసాగుతోంది. సొంతగడ్డపై బ్యాటింగ్, బౌలింగ్‌లో దుమ్మురేపిన ఆరెంజ్ టీమ్.. ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘనవిజయం సాధించింది. హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌కు అభిషేక్(135), ట్రావిస్ హెడ్ మరోసారి చక్కని శుభారంభం అందించారు. ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడుతూ 8.5 ఓవర్లలో 97 పరుగులు అందించారు. ట్రావిస్ అవుటైనా అభిషేక్ జోరు తగ్గలేదు. ఇషాన్ కిషన్(13 బంతుల్లో 25)తో కలిసి రెండో వికెట్‌కు 79 రన్స్.. హెన్రీ క్లాసెన్( 13 బంతుల్లో 37 నాటౌట్ అండగా మూడో వికెట్‌కు అజేయంగా 66 రన్స్ జోడించాడు. ఈ క్రమంలో నితీష్‌రాణా నాలుగో ఓవర్లో 20 రన్స్, కుల్‌దీప్ 12వ ఓవర్లో 22 రన్స్, నితీష్ రాణా 15వ ఓవర్లో 23 రన్స్.. ఇలా పరుగుల వరద పారింది. దీంతో సన్ రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 242 పరుగుల భారీ స్కోరు చేసింది.

243 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌ను మలింగ దెబ్బతీశాడు. ఓపెనర్ నిస్సాంక(8)ను మధుశంక అవుట్ చేసి బ్రేక్‌త్రూ అందిస్తే... ఆ తర్వాత మలింగ బెంబేలెత్తించాడు. అర్ధసెంచరీతో రాణించిన నితిష్‌రాణా(30 బంతుల్లో 57)తో పాటు డేవిడ్ మిల్లర్(0), ట్రిస్టన్ స్టబ్స్(27), అశుతోష్ రాణా(14) వికెట్లను పడగొట్టాడు. 4వికెట్ల హాల్ సాధించాడు. మరోవైపు కేఎల్ రాహుల్ (37)ను సకిబ్ హుస్సేన్ పెవలియన్ పంపాడు. చివర్లో సమీర్ రిజ్వీ(41), అక్షర్(2), ఎంగిడి(0)లను హర్షల్ దూబె అవుట్ చేశాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 195 రన్స్ చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ 48 పరుగుల తేడాతో గెలుపొంది ఖాతాలో నాలుగో విజయాన్ని చేర్చింది.




## కమ్‌బ్యాక్ ఎవరిది?

**లక్నో:** వరుస పరాజయాలతో ఉన్న రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు.. నేడు తలపడనున్నాయి. రెండు జట్లు కూడా ఆరంభంలో అదరగొట్టాయి. రాజస్థాన్ రాయల్స్ నాలుగు విజయాల తర్వాత వరుసగా రెండు ఓటములు పొందింది. పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉంది. లక్నో సూపర్ జెయింట్స్ ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో నాలుగింటిలో ఓడింది. దిగువనుంచి రెండో స్థానంలో కొనసాగుతోంది. హాట్రిక్ ఓటములకు సొంతగడ్డపై ఫుల్ స్టాప్ పెట్టాలని లక్నో చూస్తోంది. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ మునుపటి జోరును అందుకుని గెలుపు ట్రాక్‌లో పడాలని ఉవ్విళ్లూరుతోంది. ప్లే ఆఫ్ రేసులో నిలవాలంటే ఇక్కడి నుంచి గెలుపు బాటలో పడడం ఇరు జట్లకు కీలకం.


రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్‌లో వైభవ్ కీలక ప్లేయర్. ఆరు మ్యాచ్‌ల్లో 246 పరుగులు సాధించి జోరు మీదున్నాడు.రెండు వందలకు పైగా స్ట్రయిక్ రేట్‌తో పరుగులు సాధిస్తున్నాడు. యశస్వీ జైస్వాల్‌తో కలిసి ఫ్లయింగ్ స్టార్ట్‌లు అందిస్తున్నాడు. వీరిద్దరూ విఫలమైతే జట్టు బ్యాటిగ్ పేకమేడలా తయారవుతోంది. వీరిద్దరి లక్నో ఎంత తొందరగా పెవలియన్‌ను చేర్చడంపైనే విజయావకాశాలు ఉంటాయి. లేదంటే రాయల్స్‌కు భారీ స్కోరు ఖాయం. విఫలమవుతున్న ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్, హెట్మైర్, జడేజా బ్యాటింగ్‌లో రాణించాల్సి ఉంటుంది. రాజస్థాన్ బౌలింగ్ మాత్రం సూపర్‌గా ఉంది. అర్చర్ ఆరంభంలోనే వికెట్‌తో బ్రేక్ త్రూ అందిస్తున్నాడు. రవి బిష్ణోయ్, జడేజా రూపంలో రాజస్థాన్ రాయల్స్‌కు చక్కని స్పిన్ వేరియేషన్ ఉంది.

లక్నో ఫారెన్ పేయర్లు మిచెల్ మార్ష్, మార్కరమ్ బ్యాట్‌తో పెద్దగా రాణించింది లేదు. రిషబ్ పంత్ కూడా పరుగుల ట్రాక్‌లో పడాల్సి ఉంటుంది. ఆయుష్ బదోనీ, ముకుల్ చౌదరీ మాత్రమే లక్నో బ్యాటింగ్‌కు అండగా నిలుస్తున్నారు. బౌలింగ్‌లో సీనియర్ పేసర్ షమీతో పాటు ప్రిన్స్ యాదవ్ చక్కని లైన్ అండ్ లెంగ్త్‌తో అద్భుత ప్రదర్శన ఇస్తున్నాడు. ఆరు మ్యాచ్‌ల్లో 11 వికెట్లు పడగొట్టాడు. ప్రత్యర్థి బాట్స్‌మెన్‌ను చక్కగా కట్టడిచేస్తున్నాడు.

**హెడ్ టు హెడ్:** ఇరు జట్లు ఆరు మ్యాచ్‌ల్లో తలపడగా, రాజస్థాన్ రాయల్స్ ఆధిక్యంతో ఉంది. రాయల్స్ నాలుగు మ్యాచ్‌ల్లో, లక్నో రెండు మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. ఇరు జట్లు చివరగా గత ఏడాది ఏప్రిల్19న తలపడగా లక్నో విజయం సాధించింది.

**పిచ్ రిపోర్ట్:** వాజ్‌పేయి ఏకానా స్టేడియం పిచ్ మందకొడిగా ఉంటుంది. ఈ పిచ్‌పై బ్యాటింగ్ కాస్తాంత కష్టమే. క్రీజ్‌లో నిలదొక్కుకుంటే పరుగులు సాధించవచ్చు.స్పిన్నర్లు, ఫాస్ట్ బౌలర్లు రాణించే అవకాశం ఉంది. లక్ష్యాన్ని చేధించే జట్టుకు విజయావకాశాలు ఉంటాయి.

**లక్నో సూపర్ జెయింట్స్(అంచనా):** మిచెల్ మార్ష్, మార్క్‌రమ్, రిషబ్ పంత్(కెప్టెన్), మాథ్యూ బ్రెట్జ్‌కే, ఆయుష్ బదోని, ముకుల్ చౌదరీ, మహ్మద్ షమీ, అవేష్ ఖాన్, ప్రిన్స్ యాదవ్, సిద్ధార్థ్, మోసిన్‌ఖాన్; ఇఫాక్ట్ ప్లేయర్: హిమ్మత్ సింగ్; **రాజస్థాన్ రాయల్స్:** యశస్వీ జైస్వాల్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్(కెప్టెన్), హిమ్రాన్ హెట్మైర్, ఫెరీరా, రవీంద్ర జడేజా, జోఫ్రా అర్చర్, బర్గర్, బ్రిజేష్ శర్మ, రవి బిష్ణోయ్, సందీప్ శర్మ; ఇంఫాక్ట్ ప్లేయర్: వైభవ్ సూర్యవంశీ



## మూడోరోజూ లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** అమెరికా ఇరాన్‌లమధ్య తుదివిడతచర్చలతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు సడలిపోతాయన్న నమ్మకాలు పెరగడంతో ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్లకు ఉపక్రమించారు. దీనితో వరుసగా మూడోరోజు కూడా స్టాక్ మార్కెట్లు లాభాల్లోనే ముగిసాయి. మంగళవారం నిఫ్టీ 24,550 మార్కును దాటేసింది. ఎఫ్‌ఎంసిజి, ప్రైవేటు బ్యాంకింగ్ స్టాక్స్ భారీగా ర్యాలీ తీసాయి. నాలుగవ త్రైమాసిక ఫలితాల పైనా ఇన్వెస్టర్లు ఆసక్తిచూపించి అప్రమత్తంగా కొనుగోళ్లుజరిపారు. బిఎస్‌ఇ సెన్సెక్స్ 753.03 పాయింట్లుపెరిగి 79,273.33 పాయింట్లకు పెరిగితే, ఇఫ్టీ 50 సూచీ 211.75 పాయింట్లు పెరిగి 24,576.60 పాయింట్లకు చేరింది. వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్,నిఫ్టీ 1.65శాతం, 1.57శాతం చొప్పున పెరిగాయి.

హిందూస్తాన్ యూనిలీవర్ 3.13శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 2.41శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2.04శాతం నిఫ్టీలో లాభాలకు మద్దతిచ్చాయి.బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.55శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.71శాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి 33 పైసలు క్షీణించి 93.49వద్ద కదలాడింది. ముందురోజు 93.16వద్ద ముగిసిన సంగతి తెలిసిందే.ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్‌లో జూన్ ఐదునాటి సెటిల్‌మెంట్లు రూ.1,53,680వద్దకు చేరాయి. అమెరికా పదేళ్ల బాండ్ల రాబడులు 0.12శాతంపెరిగి 4.252శాతంగా ఉన్నాయి. కమొడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు జూన్ సెటిల్‌మెంట్‌నాటికి 82 సెంట్లు పడిపోయి బ్యారెల్‌కు 94.66 డాలర్లుగా కొనసాగింది. ఈక్విటీ మార్కెట్లలో పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 0.25శాతం పెరిగింది. నెస్లే ఇండియా షేర్లు 7.09శాతంపెరిగాయి.బోర్డు త్రైమాసిక ఫలితాలు ఆశాజనకంగా మారడంతో స్టాక్స్ పెరిగాయి. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 5.95శాతం, పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ 8.09శాతం, పెరిగాయి. రిస్ లైఫ్ సైన్సెస్ 3.81శాతం క్షీణించింది. రోలెక్స్ రింగ్స్ 16.43శాతం, ఈ2ఈ నెట్‌వర్క్స్ 5శాతం ఎగువన ట్రేడింగ్ ముగించాయి. ఏపెజీ సురేంద్ర పార్క్ హోటల్స్ 3.15శాతంపెరిగింది.అయోధ్య, ఉజ్జయినిలలో కొత్తప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడం కలిసొచ్చింది.నెల్కో5.92శాతంపెరిగాయి. కంపెనీ లాభాలు 1.09కోట్లు నమోదయ్యాయి.ఆవాస్ ఫైనాన్షియర్స్ 3.28శాతం పెరిగాయి. కంపెనీ బోర్డు యనుయశ్‌పాల్ సింగ్‌ను ఎండి సిఇఒగా నియమించేందుకు ఆమోదం తెలిపినట్లు ప్రకటించడంతో షేర్లు పెరిగాయి.

## ఎరువుల రంగంపై హార్ముజ్ ఎఫెక్ట్

### 24.6శాతానికి పడిపోయిన యూరియా ఉత్పత్తి




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు భారతీయ ఉత్పత్తి రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. భారతఎరువుల రంగంపై యుద్ధ ప్రభావం మరీ అధికంగా ఉంది. కేంద్ర వాణిజ్యశాఖ రిలీజ్ చేసిన డేటా తీవ్ర ఆందోళనకరంగా ఉంది.దేశంలో ఎరువుల ఉత్పత్తి సుమారు క్వార్టర్ వంతు పడిపోయినట్లు అధికారి డేటా పేర్కొన్నది. ఇండియాలో ఎరువుల ఉత్పత్తి మార్చిలో 24.6 శాతానికి పడిపోయినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఎరువుల తయారీలో సహజవాయువు చాలా కీలకమైంది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో నేచురల్ గ్యాస్ దిగుమతి క్షీణించింది. ఎరువుల ఉత్పత్తికి కీలకమైన సహజ వాయువు తగ్గడంతో గత ఏడాదితో పోలిస్తే మార్చి నెలలో ఎరువుల ఉత్పత్తి 24.6 శాతం తగ్గింది. నేచురల్ గ్యాస్ ద్వారానే ఎక్కువగా యూరియాను ఉత్పత్తి చేస్తారు. భారతీయ ఎరువుల రంగంలో యూరియా చాలా ప్రాధానమైంది.

భారత వ్యవసాయ రంగంలో యూరియాను వినియోగం ఎక్కువే. హోర్ముజ్ జలసంధి మూసివేత వల్ల ఆ మార్గం ద్వారా రావాల్సిన సహజ ఇంధన సరఫరాలు పడిపోయాయి. దీని వల్ల ఎరువుల ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గిపోయింది. ఫెర్టిలైజర్ ఉత్పత్తికి సంబంధించిన ఇన్‌పుట్స్ అన్నీ హోర్ముజ్ జలసంధి మార్గం ద్వారానే ఇండియాకు వస్తుంటాయి. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడి చేయడంతో పరిస్థితులు తలకిందులయ్యాయి. ప్రపంచానికి అవసరమైన ఎరువుల్లో మూడో వంతు హోర్ముజ్ జలసంధి మార్గంలోనే వెళ్తుంటాయి. ఎరువులకు చెందిన ముడిసరుకుల సరఫరా దెబ్బతినడంతో దాని వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆహార ఉత్పత్తిలో కూడా అసమతుల్యత నెలకొంది. 140కోట్ల భారతీయ జనాభాకు వ్యవసాయమే ముఖ్యమైంది. సుమారు 45 శాతం దేశ ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడుతారు.ఇక ఆహార ధాన్యాల ఉత్పత్తిలో యూరియాను అధికంగావాడుతున్నారు. ప్రస్తుతం ఇరాన్ వార్‌లో యూరియా ఉత్పత్తి పడిపోవడం, ఫలితంగా ఎరువుల ఉత్పత్తి తగ్గడం.. ఆ ప్రభావం భారతీయ వ్యవసాయ రంగాన్ని క్షీణింపచేసే అవకాశాలు ఉన్నాయి. ఫెర్టిలైజర్ల ఉత్పత్తి 24.6 శాతం పడిపోయినట్లు కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటించడం మరింత ఆందోళన కలిగిస్తోంది.




## పోస్టల్ వార్షిక రాబడి 15,296 కోట్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** కేంద్రంపరిధిలోని పోస్టల్ శాఖ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆదాయం భారీగా పెరిగింది.వార్షిక ఆదాయం16శాతంపెరిగి రూ.15,296 కోట్లుగా నమోదైంది.2024-25ఆర్థిక సంవత్సరంలో రూ. 13,218 కోట్ల ఆదాయం ఉండేది. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో మొత్తం 23 సర్కిళ్లలో 8 సర్కిళ్లు తమ టార్గెట్‌లో 90 శాతం వరకు సాధించాయని చెప్పుకొచ్చారు. మిగతా 14 సర్కిల్స్ 80 90 శాతం వరకు లక్ష్యాల్ని చేరుకున్నాయని వివరించారు. ఒకటే సర్కిల్ టార్గెట్‌లో 80 శాతానికి లోపు పరిమితమైందని అన్నారు. తన సేవల్ని మరింత సమర్థవంతంగా, వేగంగా అందించేందుకు ఇంకా ఆదాయాన్ని పెంచుకునేందుకు పోస్టల్ కార్యకలాపాల్ని 6ప్రధాన విభాగాలుగా విభజించింది. ఉత్తరాలు, పత్రాలు, సాధారణ తపాలా సేవలు, పార్శిల్స్ ప్యాకేజీలు,కొరియర్ సేవల్ని వేగంగా డెలివరీ చేయడం, అంతర్జాతీయ వ్యాపారం, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్లు, సుకన్య సమృద్ధి, పీపీఎఫ్, టైమ్ డిపాజిట్ వంటి పథకాలు సహా సిటిజెన్ సెంట్రిక్ సర్వీసులు ఆధార్ నమోదు, పాస్ట్‌పోర్ట్ సేవలు, బిల్ పేమెంట్స్ ఉన్నాయి.పార్శిళ్ల విభాగంలో ఆదాయం 1133 కోట్లు వచ్చింది.ముందు ఏడాదితో పోలిస్తే69శాతం పెరిగింది.గుజరాత్, ఝార్ఖండ్, తెలంగాణలో వీటికి మంచి డిమాండ్ ఉందని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. మెయిల్స్ విభాగంలో 3,202 కోట్ల ఆదాయం వచ్చింది. ఇంటర్నేషనల్ మెయిల్ కేటగిరీ ప్రపంచవ్యాప్తంగా అంతరాయాల కారణంతో పలు సమస్యల్ని ఎదుర్కొంది. ఇక్కడ ఆదాయం864 కోట్లుగా నమోదైంది. పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ విభాగం అత్యధికంగా 13శాతంపెరిగి రూ.7,756కోట్ల ఆదాయం సాధించింది.పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ అండ్ రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆదాయం 1458 కోట్లుగా ఉంది. ఇది 25 శాతం పెరిగింది.

## చిన్నబ్యాంకుల్లోనే డిపాజిట్లపై ఎక్కువ వడ్డీరేట్లు

**ముంబయి, ఏప్రిల్ 21:** సీనియర్ సిటిజన్లకు 3 సంవత్సరాల ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు 8 శాతం వరకు అత్యధిక రాబడిని అందిస్తుండగా, ప్రైవేట్ బ్యాంకులు పోటీ పడుతున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు కొంత తక్కువ రేట్లతో విశ్వసనీయతను అందిస్తున్నాయి. స్థిరమైన ఆదాయం, మూలధన భద్రత కోరుకునే సీనియర్ సిటిజన్లకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఇప్పటికీ నమ్మకమైన పెట్టుబడిగా నిలుస్తున్నాయి.3సంవత్సరాల కాలపరిమితి గల ఎఫ్‌డీలపై బ్యాంకులు అందిస్తున్న వడ్డీరేట్లు పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల విభాగంలో జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ చెరో 8 శాతం వడ్డీతో అగ్రస్థానంలో నిలిచాయి.సీనియర్ సిటిజన్లకు అత్యధికరాబడిని అందిస్తున్నాయి.ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 7.70 శాతం వడ్డీ ఇవ్వగా, ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 7.60 శాతం రేటుతో కొనసాగుతోంది. ఈ విభాగంలో అధిక రాబడి ఉన్నప్పటికీ, పెట్టుబడిదారులు బ్యాంక్ విశ్వసనీయతను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో బంధన్ బ్యాంక్, ఎస్ బ్యాంక్ చెరో 7.75 శాతం వడ్డీతో ముందంజలో ఉన్నాయి. అలాగే ఆర్బీఎల్ బ్యాంక్ 7.70 శాతం,ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ 7.50 శాతం వంటి రేట్లు అందిస్తున్నాయి. పెద్ద బ్యాంకులైన హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ మాత్రం సుమారు 6.95 శాతం వరకు మాత్రమే వడ్డీ అందిస్తున్నాయి.

## ఆంథ్రోపిక్‌లో అమెజాన్ 2 లక్షల కోట్ల పెట్టుబడి




**ముంబయి, ఏప్రిల్ 21:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచంలో మరో భారీ డీల్ వెలుగులోకి వచ్చింది. ప్రముఖ ఇకామర్స్, క్లౌడ్ దిగ్గజం అమెజాన్, ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్‌లో ఏకంగా 25 బిలియన్ డాలర్ల అంటే మనకరెన్సీలో సుమారు రూ.2.10లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది.ఈ ఒప్పందంతో ఏఐ రంగంలో ఆధిపత్యం కోసం జరుగుతున్న పోటీ మరింత ముదిరింది. అమెజాన్ ప్రస్తుతం 5 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతుండగా, భవిష్యత్తు స్థితిని బట్టి మరో 20 బిలియన్ డాలర్లు అందించనుంది. అమెజాన్ పెట్టిన 8 బిలియన్ డాలర్ల పెట్టుబడికి ఇది అదనం. దీనికి ప్రతిగా ఆంత్రోపిక్ సంస్థ రాబోయే పదేళ్లలో అమెజాన్ క్లౌడ్ టెక్నాలజీస్‌పై 100 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఖర్చు చేయాలని నిర్ణయించుకుంది. ఆంత్రోపిక్ తన తదుపరి ఏఐ మోడల్స్ శిక్షణ కోసం అమెజాన్ స్వయంగా తయారు చేసిన ట్రైనియంచిప్స్‌ను ఉపయోగించనుంది. అమెజాన్ తన సొంత ఏఐ మోడల్స్ తో పెద్దగా గుర్తింపు పొందలేకపోయినా, ఇన్ఫ్రాస్ట్రక్చర్ (క్లౌడ్ సేవలు) పరంగా తిరుగులేని శక్తిగా ఎదగాలని చూస్తోంది.



## యాపిల్ సిఇఒగా జాన్ టెర్నస్

**సియాటెల్, ఏప్రిల్ 21:** టెక్ దిగ్గజం ఆపిల్‌లో కీలక మార్పులు జరిగాయి. 15 ఏళ్లుగా కంపెనీ సీఈవోగా వ్యవహరిస్తున్న టిమ్ కుక్ తన పదవి నుంచి తప్పుకుంటున్నట్టు సంస్థ ప్రకటించింది. ఆయన స్థానంలో కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (సీఈవో) జాన్ టెర్నస్‌ను నియమించింది. ఈ మార్పులు ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. సీఈవో పదవి నుంచి వైదొలగినప్పటికీ, టిమ్ కుక్ కంపెనీకి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా సేవలు అందించనున్నారు. 50 ఏళ్ల జాన్ టెర్నస్ గత 25 ఏళ్లుగా ఆపిల్‌తో అనుబంధం కలిగి ఉన్నారు. 2001లో కంపెనీలో చేరిన ఆయన, ప్రస్తుతం హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా కొనసాగుతున్నారు.

మ్యాక్స్, ఐప్యాడ్స్, ఎయిర్‌పాడ్స్ వంటి విజయవంతమైన ఉత్పత్తుల రూపకల్పనలో టెర్నస్ తెరవెనుక కీలక పాత్ర పోషించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ఎన్విడియా, మెటా వంటి సంస్థల నుంచి తీవ్రమైన పోటీ ఎదురవుతున్న తరుణంలో ఈ నాయకత్వ మార్పు ప్రాధాన్యం సంతరించుకుంది. ఐఫోన్లలో ఏఐని మరింత సమర్థంగా చేయడంతో పాటు, ఫోల్డబుల్ ఫోన్లు, స్మార్ట్ గ్లాసెస్ వంటి కొత్త తరం ఉత్పత్తులపై టెర్నస్ దృష్టి సారిస్తారని అంచనా. ఆపిల్ తన సిరి కోసం గూగుల్ జెమినీ ఏఐ మోడల్‌ను వినియోగించుకునేందుకు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. 2011లో స్టీవ్ జాబ్స్ అనారోగ్యంతో తప్పుకున్న తర్వాత టిమ్ కుక్ ఆపిల్ సీఈఓగా బాధ్యతలు చేపట్టి తన హయాంలో కంపెనీ మార్కెట్ విలువ 3.6 ట్రిలియన్ డాలర్లకు పైగా పెంచారు. తాజా మార్పుల్లో భాగంగా, జానీ స్రౌజీని చీఫ్ హార్డ్‌వేర్ ఆఫీసర్‌గా నియమించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.